సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 342

శనివారం 4-3-2023



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండగ రోజు'


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

Lifestyle...
Resort Style...
Gated Community...

MVV GV THE GRAND

Sai Priya Layout, Madhurawada, VIZAG

25 Floor High Each Block



1 min. from Highway **9.15 Acres 5 Blocks**

60 FEET GAP BETWEEN EVERY 2 BLOCKS, SURROUNDED BY GREENERY, GARDENS, PARKS ALL AROUND, SEPARATE JOGGING, WALKING TRACKS AND OPEN AIR GYMS



65,725 Sft. Club House **35 Indoor and Outdoor Games**



Separate Gym for Ladies and Gents



Children's Play Area



322 Seater Theatre / Auditorium

Madhurawada is an amazing neighbourhood spruced with development and design. Marked as the buzzing IT hub full of opportunities for software professionals, it is located on the stretch of NH 16. What makes this place special is its strong connectivity to the city centre, best proximity to schools, hospitals, malls and leisure zones all around. With the appreciation value growing exponentially each year, investing in MVV GV -The Grand is not just about living in the most happening community but also a great value for money.

PROJECT HIGHLIGHTS

322 Seater Theatre / Auditorium
Super Market & ATM
Senior Citizens Lounge
Library
First-Aid Clinic
Pharmacy
Restaurant & Food Courts
Carroms and Chess Lounge
Squash & Shuttle Courts
Snooker & Billiards
and other Indoor Games....



Salon and Spa

Association Meeting Hall
Dance Floor
Function Hall
Guest Suites
Coffee Shop
Ice Cream Parlour
Open Roof-Top Party Area
Infinite Swimming Pool
Basketball Court
Tennis Court
Skating Arena
Children's Play Area
and many more...

Hitha Designs (+91-40-2330 6819) www.hitha.com

M.V.V BUILDERS
VISAKHAPATNAM

25 SUCCESSFUL YEARS

Corporate Office
1st Floor, D.No.4-62-1, Plot No. 21,
MVV Builders, Near Post office,
Lawsons Bay Colony,
Visakhapatnam - 530017
Contact : 99486 61600
www.mvvbuilders.com

Site Sales Office
Plot No. 27, L.P No-2/91,
Madhurawada (Post),
Visakhapatnam - 530048
mvvgvthegrand.sales@gmail.com
www.mvvgvthegrand.com

For Sales:
98489 16600, 99129 36600
90713 32233, 90713 30033


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 342

శనివారం 4-3-2023


ఆనందం ఆస్ట్రేలియాదే..
మూడో టెస్టులో టీమిండియాపై విజయం
డబ్ల్యూటీసీ ఫైనల్‌కూ అర్హత - 13లో


వారాంతాన బుల్ రంకెలు
సెన్సెక్స్ 900 పాయింట్లు ప్లస్..
నిఫ్టీ 272 పాయింట్ల లాభం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఏపీకి పారిశ్రామిక దిగ్గజాల భరోసా..

జీఐఎస్ వేదికపై సీఎం వైఎస్ జగన్‌తో పాటు వరుసగా... మసహిరో యమగుచి (టోరే ఇండియా), సుమిత్ బిదానీ (కెనాఫ్), అర్జున్ ఒబెరాయ్ (ఒబెరాయ్ గ్రూప్), పునీత్ దాల్మియా (దాల్మియా భారత్), ప్రీతా రెడ్డి (అపోలో), కృష్ణ ఎల్లా (భారత్ బయోటెక్), జీఎం రావు (జీఎంఆర్), ముఖేష్ అంబానీ (రిలయన్స్ గ్రూప్), కరణ్ అదానీ (అదానీ గ్రూప్), బీవీఆర్ మోహన్ రెడ్డి (సైయంట్), సజ్జన్ భజాంకా (సెంచురీ ప్లై), హరిమోహన్ బంగూర్ (శ్రీ సిమెంట్), మార్టిన్ ఎబర్ హార్డ్ (టెస్లా), కట్ డాంగ్ లీ (కియా ప్రతినిధులు), ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్

రూ. 13 లక్షల కోట్లు

పెట్టుబడులకు 340 ఒప్పందాలు

6 లక్షల ఉద్యోగాలు

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన
- తొలి రోజు రూ.11.87 లక్షల కోట్ల విలువైన 92 ఒప్పందాలు
- నేడు 1.15 లక్షల కోట్ల విలువైన 248 ఒప్పందాలు
- సీఎం పాలనా దక్షతను కొనియాడిన ప్రముఖులు
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై నాలుగు ఆడియో విజువల్స్ ప్రదర్శన
- వేదికపై ఉన్నంత సేపు సీఎంతో ముఖేష్ అంబానీ చర్చలు.. ఎంవోయూల అనంతరం కార్పొరేట్ ప్రముఖులకు ముఖ్యమంత్రి సత్కారం
- వేదికపైన ప్రతి పారిశ్రామికవేత్త వద్దకు వెళ్లి పలకరింపు

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధి: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన లభించింది. విశాఖ వేదికగా రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద పారింది. రెండు రోజుల జీఐఎస్ సదస్సు సందర్భంగా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన 340 ఒప్పందాలు రానున్నాయి. తొలి రోజు శుక్రవారం సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కార్పొరేట్ దిగ్గజ సంస్థలు రూ.11,87,756 కోట్ల విలువైన 92 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ద్వారా 3,92,015 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో ఒక్క ఇంధన రంగంలోనే రూ.8,25,639 కోట్ల విలువైన 35 ఒప్పందాలు కుదిరాయి. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ, ఏబీసీ, ఇండోసోల్, జేఎస్ డబ్ల్యూ గ్రూపు, ఏసీఎంఈ, టెప్సోల్, అవాడా, గ్రీన్‌కో, అదానీ, అరబిందో, ఎన్‌హెచ్‌పీసీ, ఆదిత్య బిర్లా వంటి సంస్థలున్నాయి. ఇంధన రంగంలో పెట్టుబడుల ద్వారా 1,33,950 మందికి ఉపాధి లభించనుంది. పరిశ్రమలు..

మిగతా 2వ పేజీలో ▶

ఒక్క ఫోన్‌కాల్ దూరంలో..


సదస్సు ప్రాంగణంలో రిలయన్స్ గ్రూప్ అధినేత ముఖేష్ అంబానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- మాది పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- 340 పారిశ్రామిక ఒప్పందాలు.. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు
- 20 రంగాల్లో ఆరు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- నాలుగు కీలక రంగాలే మూల స్తంభాలుగా పారిశ్రామికాభివృద్ధి
- ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే అగ్రగామి ఏపీ
- అపార సహజ వనరులకు నిలయం
- పారిశ్రామికవేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ప్రభుత్వం.. త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా విశాఖ

2 లో

రంగాల వారీగా పెట్టుబడుల వివరాలు

రంగం	ఒప్పందాలు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
ఇంధన రంగం	35	8,25,639	1,33,950
పరిశ్రమలు	41	3,20,455	1,79,850
ఐటీ, ఐటీఈఎస్	6	32,944	64,815
పర్యాటకం	10	8,718	13,400

భారీ పెట్టుబడులు పెడుతున్నాం


రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ సుస్థిర సమగ్రాభివృద్ధిని సాధిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాం. ఏపీలో మరింతగా విస్తరించనున్నాం.


- కరణ్ అదానీ, సీఈవో, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్

విజనరీ ముఖ్యమంత్రి


విజనరీ లీడర్ షిప్‌తో పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ఏపీ ప్రభుత్వంతో కలిసి ఇప్పటికే పనిచేస్తున్నాం. పలు ప్రాజెక్టులకు ఎంవోయూలు చేసుకున్నాం.

- నవీన్ జిందాల్, జేఎస్‌పీఎల్ గ్రూప్ చైర్మన్

జగన్ సారథ్యంలో వేగంగా అభివృద్ధి


భోగాపురం ఎయిర్‌పోర్టు సిటీ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మారుస్తుంది. తొలి దశలో రూ.5,000 కోట్లతో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. సీఎం జగన్ నాయకత్వంలో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోంది.

- జీఎం రావు, జీఎంఆర్ గ్రూపు చైర్మన్

పరిశ్రమలు తరలి వస్తున్నాయి


వైద్య, ఆరోగ్య రంగంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రశంసనీయం. ఏపీ ప్రభుత్వంతో అపోలో గ్రూప్స్ భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉంది. ఏపీవైపు అన్ని పరిశ్రమలు తరలి వస్తున్నాయి.

- ప్రీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్‌పర్సన్

అపార అవకాశాలు..


ఫార్మా రంగంలో ముడి పదార్థాలకు చైనాపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలోతయారీ పార్క్‌ను నెలకొల్పాలని కోరుతున్నా. యానిమల్, ఆక్వా వ్యాక్సినేషన్ల రంగాల్లోనూ అపార అవకాశాలున్నాయి.

- కృష్ణ ఎల్లా, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్

అపార వనరులు.. యువ నాయకుడు

జీఐఎస్ సదస్సులో రిలయన్స్ గ్రూపు అధినేత ముఖేష్ అంబానీ



- ప్రధాని మోదీ నాయకత్వ పటిమ.. సీఎం జగన్ దార్శనికత భేష్
- రాష్ట్రంలో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ నెలకొల్పుతాం
- కేజీ బేసిన్‌లో రూ.1,50,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం
- దేశ సహజ వాయువులో 30 శాతం ఏపీలోని కేజీ డి–6 నుంచే రానుంది
- రిలయన్స్ రిటైల్‌తో 6,000 గ్రామాల్లో 1.2 లక్షల కిరాణా షాపులతో భాగస్వామ్యం
- రైతులు, హస్తకళాకారుల నుంచి కొనుగోళ్ల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కల్పన
- సహజ వనరులు, నిపుణులు, పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు

7 లో


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో అలరించిన సంప్రదాయ నృత్యం

విశాఖ–భోగాపురం ఆరులేన్ల రహదారి

రూ.6,300 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదం


పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ

- విశాఖలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన
- ఏపీ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం
- పోర్టులను అనుసంధానిస్తూ రూ.20 వేల కోట్లతో రోడ్లు
- గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణంతో పారిశ్రామిక అభివృద్ధి

8 లో

"ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం. ఏపీలో పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణానికి రూ.20 వేల కోట్లతో ప్రాజెక్టులను చేపడుతున్నాం. సీఎం వైఎస్ జగన్ కలల ప్రాజెక్ట్ అయిన విశాఖపట్నం–భోగాపురం ఆరులేన్ల రహదారి ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేశాం. ఈ ప్రాజెక్టు కోసం సీఎం జగన్ నాతో చాలాసార్లు చర్చించారు. ఈ ఆరు లేన్ల రహదారిని రూ.6,300 కోట్లతో నిర్మించాలని నిర్ణయించాం.

- విశాఖ సదస్సులో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

అభివృద్ధిలో భాగస్వాములవుతాం

తొలి రోజు 92 ఒప్పందాలు

మరిన్ని కథనాలు 2,7, 8,9లో

అద్భుత ఆతిథ్యం

ఇక ఈవీలు.. ఏఐ



ADVANTAGE ANDHRA PRADESH

జీఐఎస్‌లో నేడు..

- ఉదయం 9 గంటలకు ఎంవోయూలు
- కార్పొరేట్ ప్రముఖులు, కేంద్ర మంత్రుల ప్రసంగాలు
- కొత్త పరిశ్రమ యూనిట్ల ప్రారంభోత్సవం
- సీఎం జగన్ ముగింపు ఉపన్యాసం

సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మక గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండవ రోజు శనివారం ఉదయం 9 గంటలకు ఎంవోయూలపై సంతకాలతో ప్రారంభం కానుంది. 10.30 గంటలకు ప్రముఖ ఇండో అమెరికన్ మ్యుజీషియన్ కర్ష్ కాలే బ్యాండ్ ప్రదర్శన ఉంటుంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ప్రారంభ ఉపన్యాసం, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రసంగం ఉంటుంది. ఆ తర్వాత నోవా ఎయిర్ సీఈఓ అండ్ ఎండీ గజానన్ నాబర్, అవాడ గ్రూప్ చైర్మన్ వినీత్ మిట్టల్, లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓ సత్యనారాయణ చావ, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ డాక్టర్ వంశీ కృష్ణ బండి, గ్రీన్‌కో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీల్‌కుమార్ చలమశెట్టి, సెయింట్ గోబిన్ ఆసియా–పసిఫిక్ అండ్ ఇండియా సీఈఓ సంతానం.బి ప్రసంగాలు ఉంటాయి. అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, అపోలో అండ్ హిల్‌టాప్ గ్రూప్ డైరెక్టర్ అండ్ గ్రూప్ హెడ్ ఇండియా ఆపరేషన్స్ సర్జియో లీ, బ్లైండ్ హట్ ఫౌండర్ హెన్‌రిక్ స్టామ్ క్రిస్టెన్‌సన్, వెల్‌స్పన్ గ్రూప్ ఎండీ రాజేష్ మండవేవాలా, వెల్‌స్పన్ గ్రూప్ ఎండీ సతీష్‌రెడ్డి, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎండీ, సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్ర కె.ఎల్లా ప్రసంగిస్తారు. ఆ తర్వాత కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ కీలక ఉపన్యాసం ఉంటుంది. అనంతరం సమ్మిట్ వేదికపై నుంచి కొత్త పరిశ్రమ యూనిట్ల ప్రారంభోత్సవం, సీఎం వైఎస్ జగన్ ముగింపు ఉపన్యాసం ఉంటుంది.

రెండో రోజు 8 రంగాలపై సెషన్లు

రెండో రోజు శనివారం ఉదయం 9 గంటలకు ఆటోరియం 1లో పెట్రోలియం అండ్ పెట్రో కెమికల్స్, 2లో హయ్యర్ ఎడ్యుకేషన్, 3లో స్కిల్ డెవలప్‌మెంట్, 4లో వియత్నాం కంట్రీ సెషన్ జరగనుంది. 9.45 గంటలకు ఆడిటోరియం 1లో టూరిజం అండ్ హాస్పిటాలిటీ, 2లో టెక్స్‌టైల్స్ అండ్ అపరెల్స్, 3లో ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్, 4లో వెస్టర్న్ ఆస్ట్రేలియా కంట్రీ సెషన్ ఉంటుంది.

పెట్టుబడుల సదస్సు రాష్ట్ర అభివృద్ధిలో శుభపరిణామం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్వాగతించారు. శుక్రవారం ఆయన ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ.. ' పెట్టుబడుల సదస్సు రాష్ట్ర అభివృద్ధిలో శుభపరిణామం. ఇది విజయవంతమవుతుంది. రాష్ట్ర ప్రగతి కోసం ప్రభుత్వానికి కేంద్రం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తున్నాం. ప్రధాని నరేంద్రమోదీ నిబద్ధతతో కూడిన ప్రయత్నాల కారణంగా నేడు దేశం అనుకూలమైన పారిశ్రామికవాతావరణాన్ని కలిగి ఉంది. విశాఖ వేదికగా చేసిన వాగ్దానాలు రాష్ట్ర అభివృద్ధికి దారితీస్తాయని ఆశిస్తున్నాం. నితిన్ గడ్కరీ హాజరు కావడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఎలా మద్దతు ఇస్తుందో చూపిస్తోంది' అంటూ పేర్కొన్నారు.

ఒక్క ఫోన్‌కాల్ దూరంలో..



మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో సీఎం వైఎస్ జగన్



విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన పారిశ్రామికవేత్తలు తదితరులు

విశాఖ జీఐఎస్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : భూమి, నీరు, సముద్రతీరం, విస్తారమైన ఖనిజ సంపద, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఇతరత్రా ప్రకృతి వనరులు.. వీటన్నింటికీ తోడు పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం కలిగిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, పెట్టుబడులకు స్వర్గధామమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి 340 పారిశ్రామిక పెట్టుబడుల ప్రతిపాదనలతో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని స్పష్టం చేశారు. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 20 రంగాల్లో 6 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని చెప్పారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 తొలి రోజు శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం దేశ, విదేశాలకు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామిక దిగ్గజాలు హాజరైన ఈ సమ్మిట్‌ను ఉద్దేశించి మాట్లాడారు. తొలి రోజు రూ.11.87 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 92 ఎంవోయూలు కుదుర్చుకుంటున్నామని, వీటి ద్వారా దాదాపు 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మిగిలిన 248 ఎంవోయూలను శనివారం కుదుర్చుకుంటామని, వాటి విలువ రూ.1.15 లక్షల కోట్లు అని తెలిపారు. వాటితో దాదాపు 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రిలయెన్స్ గ్రూప్, అదాని గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్, రెన్యూ పవర్, అరబిందో గ్రూప్, డైకిన్, ఎన్టీపీసీ, ఐటీసీఎల్, జిందాల్ గ్రూప్, మోండలెజ్, పార్లే, శ్రీ సిమెంట్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు స్థాపించి వ్యాపారాన్ని విస్తరించనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎలాంటి సహకారం అందించేందుకునైనా తమ ప్రభుత్వం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉంటుందని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రం ఏ విధంగా అనుకూలమో ఆయన వారికి స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

దేశంలోనే అత్యధిక జీడీపీ సాధించిన ఏపీ

- 2021-22లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం జీఎస్‌డీపీ వృద్ధి రేటు సాధించింది. గత మూడేళ్లలో ఏపీ నుంచి ఎగుమతులు కూడా వృద్ధి చెందాయి. సీఏజీఆర్ (సగటు వార్షిక వృద్ధి రేటు) 9.3 శాతంగా నమోదైంది.
- సుస్థిరమైన అభివృద్ధి కోసం మేం చేస్తున్న ప్రయత్నాలను నీతి ఆయోగ్ కూడా గుర్తించింది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాల్లో 2020-21కి ఇచ్చిన ఎస్‌జీడీ ఇండియా ఇండెక్స్ ర్యాంకుల్లో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచింది.
- క్షేత్ర స్థాయి నుంచి పరిపాలనను బలోపేతం చేసేందుకు మా ప్రభుత్వం అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చింది. వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడం, స్థిరమైన విధానాలు, పోటీతత్వాన్ని పెంపొందించడానికి, తక్కువ రిస్క్ పెట్టుబడి వాతావరణాన్ని కల్పించడానికి, పారదర్శకతను పెంపొందించేందుకు పలు చర్యలు తీసుకుంది.

ఎన్నెన్నో అనుకూలతలు

ఎన్నో ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమలు, పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలు, మెడ్‌టెక్ జోన్, ప్రముఖ పర్యాటక కేంద్రాలతో ప్రకృతి అందాలకు నెలవైన విశాఖపట్నం బలమైన ఆర్థిక కేంద్రంగా రూపాంతరం చెందింది. జీ–20 దేశాల వర్కింగ్ కమిటీ సమావేశాలకు కూడా ఇదే విశాఖ మార్చి చివరి వారంలో ఆతిథ్యం ఇవ్వనుంది. సమృద్ధిగా సహజ వనరులు, ఉన్నత విద్యా సంస్థలు, వ్యూహాత్మక ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్‌కు సానుకూలతలు. వీటికి తోడు పెట్టుబడులకు రాష్ట్రాన్ని ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చేందుకు పటిష్ట కార్యాచరణతో అడుగులు ముందుకు వేసేందుకు చురుకైన ప్రభుత్వం రాష్ట్రంలో ఉంది.

మూల స్తంభాలుగా 4 అంశాలు

గ్రీనిఫికేషన్

సంప్రదాయేతర ఇంధనం దిశగా వ్యవస్థను మార్చడంపై ప్రధానంగా శ్రద్ధ పెట్టాం. రాష్ట్రంలో 82 గిగావాట్ల సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిని సాధించడానికి అవకాశాలున్నాయి. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ.. ఈ మూడు రకాల ఇంధనాలు సమ్మిళితంగా పొందడానికి అవకాశాలున్న అతికొద్ది రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. ఈ ప్రాజెక్టులను ప్రారంభించడానికి అవసరమైన ల్యాండ్ పార్సిళ్లను కూడా ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక భౌగోళిక లక్షణాలు ఉన్నందున 34 గిగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టులకు అవకాశం ఉంది. 24 గంటలపాటు ఈ ప్రాజెక్ట్ నుంచి సంప్రదాయేతర ఇంధనాన్ని పొందవచ్చును. అతిపెద్ద తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగం, ఎగుమతులకు రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయి.

పారిశ్రామిక లాజిస్టిక్స్, మౌలిక వసతులు

ఈ విషయంలో భారతదేశానికి తూర్పుతీరంలో ఆంధ్రప్రదేశ్ గేట్‌వే గా ఉంది. 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. సముద్ర రవాణా రంగంలో రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేసేందుకు కొత్తగా రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ, భావనపాడులలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆరు పోర్టులకు ఇవి అదనం. ఈ పోర్టుల సమీపంలో పారిశ్రామికీకరణకు అపార అవకాశాలున్నాయి. మూడు పారిశ్రామిక కారిడార్లు.. విశాఖపట్నం- చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు వస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే. పారిశ్రామికంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు సమీపంలో ఈ కారిడార్లు ఉన్నాయి. వీటికి పోర్టులతో అద్భుతమైన రవాణా అనుసంధానం ఉంది. ఈ పారిశ్రామిక కారిడార్లలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న 10 నోడ్స్ పారిశ్రామిక హబ్‌లుగా తయారవుతున్నాయి. సరుకు రవాణా సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయడానికి రాష్ట్రంలో వ్యూహాత్మక ప్రాంతాల్లో 5 మల్టీ మోడల్ పార్కులను కూడా అభివృద్ధి చేస్తున్నాం. సముద్ర ఉత్పత్తులను పెంచడానికి ప్రాసెసింగ్ కోసం కొత్తగా 9 హార్బర్లను నిర్మిస్తున్నాం. వివిధ పారిశ్రామిక రంగాలకు సంబంధించి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు కూడా ఉన్నాయి. ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు నిర్దిష్టంగా క్లస్టర్లు ఉన్నాయి. అవి చక్కటి మౌలిక సదుపాయాలు, మానవ వనరులను అందిస్తున్నాయి. మెడ్‌టెక్ కంపెనీలకు ఏపీ పుట్టిల్లు. విశాఖపట్నం మెడ్‌టెక్ జోన్‌లో అనేక కంపెనీలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఈ రంగంలో మరింత వృద్ధి కోసం ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. దాంతో సమయం, వ్యయం ఆదా అవుతుంది.

డిజిటలైజేషన్

దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల కోసం ప్రభుత్వం సింగిల్ పోర్టల్ సేవలను అందిస్తోంది. 23 విభాగాల్లో 90 రకాల వ్యాపార సేవలు ఈ పోర్టల్‌లో లభిస్తున్నాయి. వ్యాపారాలు ప్రారంభించడానికి గరిష్టంగా 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నాం. పరిపాలనలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో 540 రకాల సేవలను అందిస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా ఏపీదే మొదటి స్థానం. పరిశ్రమలు పెట్టేవారికి అత్యంత అనుకూలంగా ఉండటం కోసం కొన్ని చట్టాలను సవరించడం, తొలగించడం చేశాం.

ఎంటర్‌ప్రైజస్, స్కిల్ డెవలప్‌మెంట్

పారిశ్రామికంగా నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి మంచి మౌలిక వసతులు, సానుకూల వ్యాపార వాతావరణంతోపాటు నైపుణ్యమైన మానవ వనరులు అత్యంత కీలకం. ఈ దిశగా 26 చోట్ల నైపుణ్యాభివృద్ధి కాలేజీలను ఏర్పాటు చేస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్థానిక యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం పారిశ్రామిక సంస్థల సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తున్నాం.

త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం

అందమైన విశాఖపట్నంలో అద్భుతమైన సమయాన్ని గడపాలని కోరుతున్నాను. విశాఖపట్నం త్వరలోనే ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక రాజధాని కాబోతోంది. నేనూ త్వరలోనే ఇక్కడి నుంచే పరిపాలన సాగించబోతున్నా. త్వరలోనే అది సాకారం అవుతుంది.

9 రంగాలపై సెమినార్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సులో పలు రంగాలలో మొదటి రోజు సెమినార్లు జరిగాయి. వీటిలో ప్రధానంగా రెన్యువబుల్ ఎనర్జీ అండ్ గ్రీన్ హైడ్రోజన్ (పునరుత్పాదక శక్తి), ఆరోగ్య భద్రత – వైద్య పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఐటీ, ఆటోమేటివ్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఇన్నోవేషన్స్, అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ప్రోసెసింగ్ రంగాల్లో సెమినార్లు నిర్వహించారు. పారిశ్రామికవేత్తలకు మంత్రులు, అధికారులు ప్రభుత్వ విధానాలను వివరించారు . ఏపీ ప్రభుత్వం అందించే అవకాశాలతో పాటు ఇక్కడ విస్తారంగా ఉన్న భూమి, వనరులు, నైపుణ్యం కలిగిన యువత, పుష్కలంగా నీటి లభ్యత, నిరంతర విద్యుత్ సరఫరాను వివరించారు. పెట్టుబడులకు ఏపీ స్వర్గధామమని తెలిపారు.

ఆరోగ్య భద్రత – వైద్య పరికరాలు

'ఆరోగ్య భద్రత – వైద్య పరికరాలు' రంగంపై వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని హాజరయ్యారు. వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఆమె వివరించారు. 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 95 శాతం ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. రాష్ట్రంలోని 2,200 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 3,200 రోగాలకు వైద్యం అందిస్తున్నాం. పార్లమెంట్ నియోజకవర్గానికో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నాం. వైద్య విభాగంలో పెట్టుబడులను ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తుంది. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుంది' అని మంత్రి వివరించారు. దేశంలోనే అతి పెద్ద కంపెనీల్లో ఒకటైన మణిపాల్ ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దిలీప్ జోష్, ఉస్మానియా వైద్య నిపుణులు గురునాథ్‌రెడ్డి, ఎయిమ్స్ హెచ్‌వోడీ ముకేష్ త్రిపాఠి తదితరులు క్వాలిటీ హెల్త్ సిస్టమ్, ప్రైవేట్ సెక్టార్ హెల్త్ కేర్, వైద్య రంగం ద్వారా వచ్చే రెవెన్యూ, ఉద్యోగావకాశాలు, ఇమేజింగ్ హెల్త్ కార్డ్ డెలివరీ, కమ్యునికబుల్, నాన్ కమ్యునికబుల్ డిసీజస్ అనే అంశాలపై మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు అందిస్తున్న 'ఫ్యామిలీ ఫిజిషియన్' విధానాన్ని, ఆరోగ్యశ్రీ ద్వారా ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగువారికి అందిస్తున్న ఉచిత వైద్యాన్ని ప్రశంసించారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నామని వెల్లడించారు.

పునరుత్పాదక ఇంధన శక్తి

రెన్యువబుల్ ఎనర్జీ అండ్ గ్రీన్ హైడ్రోజన్ (పునరుత్పాదక ఇంధన శక్తి) రంగంలో పెట్టుబడిదారులతో రాష్ట్ర ఇంధన శక్తి స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.వి జయానంద్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన శక్తి రంగంలో పెట్టుబడులకు ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పారు. ఈ రంగంలో పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సదుపాయాలు, ఆర్‌పీవో ప్రయోజనాలను వివరించారు. '2030 నాటికి ఏపీలో 500 కేటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రభుత్వ లక్ష్యం. 10 నుంచి 15 బిలియన్ డాలర్ల గ్రీన్‌ఎనర్జీ అవకాశాలు ఏపీలో ఉన్నాయి. 38 జీడబ్ల్యూ సోలార్, 44 జీడబ్ల్యూ విండ్, 34 జీడబ్ల్యూ హైడ్రో ప్రాజెక్టులకు అవకాశాలున్నాయి. 974 కిలోమీటర్ల తీర ప్రాంతం, 6 పోర్టులు, ఇతర రాష్ట్రాలతో పోల్చితే 45% ఎకనామికల్ వాటర్ సదుపాయం ఏపీలో ఉన్నాయి. నిపుణులైన మానవ వనరులు కూడా అందుబాటులో ఉన్నాయి' అని పెద్దిరెడ్డి వివరించారు.

రూ. 13 లక్షల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వాణిజ్య విభాగంలో రూ.3,20,455 కోట్ల విలువైన 41 ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 1,79,850 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో జిందాల్ స్టీల్, శ్రీ సిమెంట్, మైహోమ్ సిమెంట్, అల్ట్రాటెక్, లారస్ మోండలెజ్, వెల్స్పన్ వంటి సంస్థలున్నాయి. ఐటీ, ఐటీఈఎస్ రంగంలో రూ.32,944 కోట్ల విలువైన 6 ఒప్పందాలు కుదరగా, వీటి ద్వారా 64,815 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో టీసీఎల్, రిజల్యూట్, డైకిన్, సన్నీ ఆప్టెక్ వంటి సంస్థలున్నాయి. పర్యాటక రంగంలో రూ.8,718 కోట్ల విలువైన 10 ఒప్పందాలు కుదరగా.. వీటి ద్వారా 13,400 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో డ్రీమ్‌వ్యాలీ గ్రూపు, ఒబెరాయ్, భ్రమరాంబ గ్రూపు, ఎంఆర్‌కేఆర్, మంజీరా హోటల్స్ వంటి సంస్థలున్నాయి. రెండో రోజు శనివారం రూ.1.15 లక్షల కోట్ల విలువైన 248 ఒప్పందాలు కుదరనున్నట్లు అధికారులు వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వ కృషిని కొనియాడిన కార్పొరేట్ దిగ్గజాలు

కోవిడ్ తర్వాత తక్కువ కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగంగా పరుగులు పెట్టించి, రాష్ట్రంలోని పెట్టుబడుల అవకాశాలను వివరిస్తూ రోడ్‌షోలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది. జీఐఎస్ సమావేశంలో పాల్గొన్న అంబానీ దగ్గర నుంచి బంగర్ వరకు అందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను స్వాగతిస్తూ ప్రసంగించారు. ముఖ్యంగా విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ కృషిని కొనియాడారు. సభా ప్రాంగణానికి సీఎం జగన్‌తో కలిసి వచ్చిన రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ సభ ముగిసే వరకు.. ఆద్యంతం ముఖ్యమంత్రితో చర్చిస్తూ ఉల్లాసంగా కనిపించారు. సీఎం తన ప్రసంగం అనంతరం వేదికపై ఉన్న ప్రతి పారిశ్రామికవేత్త వద్దకు వెళ్లి నమస్కరించి పలకరించారు. ఎంవోయూ కార్యక్రమం అనంతరం పారిశ్రామికవేత్తలను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన సమయంలో పాదరక్షలు విడిచిన పారిశ్రామికవేత్తలు.. తర్వాత నిలబడి వాటిని ధరించడంలో ఇబ్బంది పడుతుంటే.. ముఖ్యమంత్రి వారికి ఆసరాగా నిలిచి చేయూతనందించడం పలువురిని ఆకర్షించింది. మధ్యాహ్నం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి స్టాల్స్‌ను సందర్శించారు. అంతకు ముందు రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై నాలుగు ఆడియో విజువల్స్ ప్రదర్శించారు.



పారిశ్రామికవేత్తలతో సీఎం జగన్ మాటామంతి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జీఐఎస్ సందర్భంగా ఏర్పాటు చేసిన లేజర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకర్షించాయి. ఎయిర్‌పోర్టులో అతిథులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆహ్వానం పలికిన విధానం పలువురిని ఆకట్టుకుంది. ఈ విషయాన్ని పలువురు వక్తలు సదస్సులో ప్రస్తావించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర జానపద కళలు, కొమ్మునృత్యం, తప్పెటగుళ్లు, ఉరుములు అందరినీ ఆకర్షించాయి. ఈ సదస్సుకు కార్పొరేట్ ప్రముఖులతో పాటు, విదేశీ రాయబారులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సమావేశాలకు హాజరైన వారికి ముఖ్యమంత్రి రాత్రి ప్రత్యేకంగా విందు ఇచ్చారు.

జగన్ దార్శనికతే ఏపీ ప్రగతి దిక్సూచి

ఉదాహరణలతో సహా వివరించిన పారిశ్రామిక దిగ్గజాలు

- జగన్ దార్శనికతతోనే సులభతర వాణిజ్యంలో ఏపీకి మొదటి స్థానం: ముఖేశ్ అంబానీ
- దక్షిణ భారత దేశంలో పెట్టుబడుల సదస్సుకు తొలిసారి హాజరైన ముఖేశ్
- వనరుల సద్వినియోగంతో అభివృద్ధి ప్రణాళికలు జగన్ ప్రత్యేకత : కరణ్ అదానీ
- జగన్ ఏపీని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారు : నవీన్ జిందాల్
- సంక్షోభంలోనూ సమర్థ నాయకుడు జగన్ : కబ్ డాంగ్‌లీ
- జగన్ సహకారంతోనే అతి పెద్ద ప్లాంట్ సాధ్యమైంది : సుమిత్ బిదానీ
- ఇంతటి పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం చాలా అరుదు: మసహిరో యమగుచి
- జె ఫర్ జగన్.. జె ఫర్ జోష్‌గా మారింది : పునీత్ దాల్మియా

> అపారమైన సహజ వనరులు.. నైపుణ్యమైన మానవ వనరులు అభివృద్ధికి మూలం. కీలకమైన ఆ రెండింటినీ గరిష్ట స్థాయిలో సద్వినియోగం చేసుకునే సమర్థ నాయకత్వం ఉంటేనే ఆర్థికాభివృద్ధి సాధ్యం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో అటువంటి సమర్థ నాయకత్వం లభించిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలవడం ఖాయం. వైఎస్ జగన్ దార్శనికతే ఏపీ ప్రగతికి దిక్సూచి.
>
> గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 వేదికపై దిగ్గజ పారిశ్రామికవేత్తలు వ్యక్తం చేసిన ఏకాభిప్రాయమిది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం జగన్, పారిశ్రామిక దిగ్గజాలు

(గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 ' ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ పారిశ్రామికవేత్తలు అంతా ఒకే వేదికపైకి వచ్చిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. అంతకుమించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దార్శనికత, కార్యదక్షతకు నిదర్శనంగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు, సరళతర వాణిజ్య విధానాలు ఎంతటి సత్ఫలితాలను అందిస్తున్నాయో ప్రపంచానికి చాటి చెప్పింది. సదస్సులో తొలి రోజు శుక్రవారం దాదాపు 20 మంది పారిశ్రామికవేత్తలు ప్రసంగించారు. సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించిన పారిశ్రామిక అనుకూల వాతావరణం గురించి దిగ్గజ పారిశ్రామికవేత్తలు ప్రముఖంగా ప్రస్తావించారు. సీఎం వైఎస్ జగన్ యువ నాయకత్వం, దార్శనికతతోనే వృద్ధి రేటు, సులభతర వాణిజ్యంలో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కొనియాడటం విశేషం. దక్షిణ భారత దేశంలో నిర్వహించిన ఓ పెట్టుబడుల సదస్సుకు ఆయన హాజరుకావడం ఇదే తొలిసారి. పారిశ్రామికాభివృద్ధిపట్ల సీఎం జగన్ స్పష్టమైన దృక్పథానికి ఆకర్షితుడయ్యే ఆయన ఈ సదస్సుకు హాజరయ్యారు. సహజ వనరులు, భౌగోళిక అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేకత అని ఆదానీ పోర్ట్ – సెజ్ సీఈవో కరణ్ అదానీ చెప్పారు. దేశంలోనే రెండో అతిపెద్ద తీరరేఖ కలిగిన ఏపీలో పోర్టుల అభివృద్ధికి జగన్ ప్రణాళికలు ఇందుకు నిదర్శనమన్నారు. పారిశ్రామిక విధానం, పరిశ్రమల అనుకూల ఎకోసిస్టమ్ కల్పించేందుకు సమర్థంగా అమలు చేస్తున్న సింగిల్ విండో పాలసీ గురించి జేఎస్‌పీఎల్ గ్రూప్ చైర్మన్ నవీన్ జిందాల్ ప్రధానంగా ప్రస్తావించారు. సీఎం జగన్ దార్శనిక విధానాల ఫలితంగానే తమ గ్రూప్ ఏపీలో రూ.10 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. జీడీపీ వృద్ధి రేటులో దేశంలోనే అగ్రగామిగా నిలిపి సీఎం జగన్ ఏపీని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారన్నారు.

సమర్థ నాయకుడు

సంక్షోభం తలెత్తినప్పుడు సమర్థంగా వ్యవహరించడమే నాయకత్వ లక్షణమని కియా మోటార్స్‌కు చెందిన కబ్ డాంగ్‌లీ చెప్పారు. అలాంటి నాయకుడు జగన్ అని చెప్పారు. కరోనా సంక్షోభ సమయంలో ఉద్యోగులు, ముడి సరుకును సురక్షితంగా తరలించడానికి సీఎం జగన్ సత్వరం సహకారం అందించడం ఇందుకు తార్కాణమన్నారు. మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధే ఆర్థికాభివృద్ధికి చోదక శక్తి అనే వాస్తవాన్ని గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి కొనియాడారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య–ఆరోగ్య రంగాలపై ఏపీ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తుండటం దేశానికే ఆదర్శమన్నారు.

గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎంవోయూల పేరుతో చేసిన కనికట్టు అందరికీ తెలిసిందే. ఛోటా మోటా నేతలకు సూట్లు వేసి మరీ ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు ప్రజల్ని మోసం చేశారు. అందుకే చంద్రబాబు ప్రభుత్వంలో చేసుకున్న ఎంవోయూలలో 10 శాతం కూడా కార్యరూపం దాల్చలేదు. అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తూ పరిశ్రమల ఏర్పాటును స్వయంగా పర్యవేక్షిస్తుండటం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. ఇదే విషయాన్ని కెనాఫ్ సంస్థ సీఈవో సుమిత్ బిదానీ జీఐఎస్ సభా వేదిక మీదే చెప్పారు. 40 మిలియన్ డాలర్ల ప్రాథమిక పెట్టుబడితో దేశంలోనే అతి పెద్ద ప్లాంట్‌ను తాము ఏర్పాటు చేయడం కేవలం సీఎం జగన్ సహకారంతోనే సాధ్యమైందని ఆయన అన్నారు. ఒప్పందం జరిగిన 18 నెలల్లోనే ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

ఇంతటి పారిశ్రామిక అనుకూలత అరుదు

సీఎం జగన్ నిబద్ధత గురించి జపాన్‌కు చెందిన టోరే ఇండస్ట్రీస్ ఎండీ మసహిరో యమగుచి చెప్పిన విషయం అబ్బురపరిచింది. శ్రీ సిటీలో రూ.200 కోట్లతో తాము త్వరగా ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం 132 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రత్యేకంగా వేయడాన్ని ఆయన ఉదహరించారు. ఇంతటి పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం ఉండటం చాలా అరుదని వ్యాఖ్యానించారు. సంప్రదాయేతర ఇంధన వనరులకు సీఎం జగన్ పెద్దపీట వేస్తుండటం ప్రపంచవ్యాప్తంగా భవిష్యత్ పారిశ్రామిక పరిణామాలపై ఆయనకున్న ముందు చూపునకు నిదర్శనమని టెస్లా కంపెనీ కో ఫౌండర్ మార్టిన్ ఎబర్‌హార్డ్ తెలిపారు. శ్రీ సిమెంట్ చైర్మన్ హరిమోహన్ బంగర్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సిమెంట్ రంగంలో తాము ఈ కారణంగానే ఏపీలో పెట్టుబడులు పెడుతున్నామన్నారు. ఇప్పటికే రూ.3,000 కోట్లతో గుంటూరులో తాము ఏర్పాటు చేస్తున్న దేశంలోనే మొదటి గ్రీన్ సిమెంట్ ప్లాంట్ పనులు నడుస్తున్నాయని, త్వరలో మరో రూ.5,000 కోట్లు పెట్టుబడులతో 5 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

సీఎం జగన్‌ను చూసి గర్వపడుతున్నా..

పరిశ్రమల ఏర్పాటుకు సీఎం జగన్ ఎంత వేగంగా స్పందిస్తారో చెబుతూ సెంచరీ ప్లై చైర్మన్ సజ్జన్ భజాంకా చెప్పిన ఉదాహరణ ఆకట్టుకుంది. ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలి, అందుకోసం నోడల్ ఆఫీసర్ల నియామకంతోపాటు మార్కెట్‌లో నిలదొక్కుకునేందుకు ఏఏ మోడల్స్ ఉత్పత్తి చేయాలి తదితర అంశాలన్నీ ఒక్క సమావేశంలోనే కొలిక్కి వచ్చేశాయన్నారు. తాను పుట్టిన నేలకు దేశ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలను తెచ్చిన సీఎం జగన్‌ను చూసి గర్విస్తున్నానని జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు చెప్పారు. జె ఫర్ జగన్ కాస్త జె ఫర్ జోష్‌గా మారిందని దాల్మియా భారత్ గ్రూప్ ఎండీ పునీత్ దాల్మియా వ్యాఖ్యానించారు.

> ఇంద్రియ సముదాయమును చక్కగా వశపరచుకొనినవారు,
> సకల భూతముల హితమునే కోరుచుండువారు, సర్వప్రాణులను
> సమభావముతో చూచువారు యోగులు.
>
> – భగవద్గీత

సాక్షి
శనివారం, మార్చి, 4

ఈసీపై ఎన్నదగిన తీర్పు

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడటం, వాటికి విశ్వసనీయత కల్పించటం ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు అత్యంత కీలకం. ఈ కర్తవ్యనిర్వహణలో తలమునకలు కావాల్సిన ఎన్నికల సంఘం (ఈసీ) స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆ పని పూర్తిచేస్తున్నదన్న అభిప్రాయం ప్రజల్లో కలిగిస్తే విశ్వస నీయత దానంతటదే ఏర్పడుతుంది. అందుకే ఎన్నికల సంఘం కూర్పు విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా వెలువరించిన తీర్పు హర్షించదగ్గది. ఈ తీర్పు ప్రకారం ఇకపై ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండే త్రిసభ్య కమిటీ ఎన్నికల కమిషనర్‌ల నియామకాలను ఖరారు చేయాల్సివుంటుంది. ఇంతవరకూ అనుసరిస్తున్న విధానం వేరు. కేంద్ర పాలకుల ఇష్టారాజ్యంగా ఆ నియామకాలుంటున్నాయి. ఎన్నికల సంఘం విధులు, అధికారాల విషయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. విస్తృతాధికారాలుండే ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు జరగాలని, అందుకు అనుగుణమైన అధికారాలు దానికుండాలని రాజ్యాంగ నిర్ణాయక సభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణ, నియంత్రణ, అవసరమైన మార్గదర్శకాల ఖరారు కోసం ఎన్నికల సంఘం ఉండాలని రాజ్యాంగంలోని 324 అధికరణ మొదలుకొని 329వ అధికరణ వరకూ నిర్దేశిస్తున్నాయి.

అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్‌లను ఏవిధంగా ఎంపిక చేయాలన్న అంశంలో రాజ్యాంగం ఏమీ చెప్పలేదు. ఈ అధికరణలపై రాజ్యాంగ నిర్ణాయక సభలో చర్చ జరిగినప్పుడు ఎంపిక ప్రక్రియను పార్లమెంటుకే విడిచిపెట్టాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. నిర్దిష్టంగా ఉండే నిబంధనలకే తూట్లుపొడవటం అలవాటైన దేశంలో స్పష్టత కొరవడితే చెప్పేదేముంది? ఇది సహజంగానే అధికారంలో ఉండేవారికి వరమైంది. తమకు అనుకూలురైనవారిని ఆ సంఘంలో నియమించటం ఒక సంప్రదాయంగా స్థిరపడింది. అందువల్లే ఎన్నికలు ముంచుకొచ్చినపుడల్లా అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధాలు రివాజుగా మారాయి. ఎన్నికలు ప్రకటించటం దగ్గర్నుంచి ఎన్నికల తేదీల ఖరారు, ఎన్నికల నిర్వహణ వరకూ అన్నీ వివాదాస్పదమే అవుతున్నాయి. పారదర్శకత లోపించటమే ఇందుకు కారణం. గడువు పూర్తయిన రెండు రాష్ట్రాల్లో ఒక రాష్ట్రానికి మాత్రమే ఎన్నికల ప్రకటన వెలువరించి, మరో రాష్ట్రం గురించి మౌనం పాటించారన్న విమర్శలు ఒకపక్క... ప్రచారసభల్లో అవతలి పార్టీ నేతలు ఏం మాట్లాడినా మౌనంవహిస్తూ తమపై మాత్రం దూకుడుగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు మరోపక్క తరచు ఈసీ ఎదుర్కొనాల్సివస్తోంది. కొన్ని సందర్భాల్లో అదిచ్చే వివరణలు అసంబద్ధంగా ఉండటం కూడా కనబడుతూనే ఉంది. కేంద్రంలోని పాలకపక్షం తన విధేయులను ఎన్నికల సంఘంలో నియమించటం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని విపక్షాలు ఆరోపించటం కూడా మామూలే. యూపీఏ పాలనలో ప్రధానంగా బీజేపీనుంచి ఇలాంటి ఆరోపణలు వినిపిస్తే ఇప్పుడు బీజేపీయేతర పక్షాలు ఆ పాత్ర పోషిస్తున్నాయి. ఎవరు అధికారంలోకొచ్చినా కమిషనర్ల ఎంపిక ప్రక్రియ మార్చాలన్న ఆలోచనకే దూరంగా ఉంటున్నారు. కొత్త చట్టం తీసుకొస్తే అది తమకే గుదిబండవుతుందని, తమ పాచికలు పారవని భావిస్తున్నారు. వాస్తవానికి జస్టిస్ ఏపీ షా నేతృత్వంలోని 20వ లా కమిషన్ ఎన్నికల సంఘం కూర్పు, ఎన్నికల సంస్కరణల గురించి లోతుగా పరిశీలించి నివేదిక ఇచ్చింది. కమిషనర్‌ల ఎంపికకు ఒక ప్రత్యేక కమిటీ ఉండాలని సూచించింది. కానీ ఇంతవరకూ దాని ఊసే లేదు.

ఎన్నికల సంఘం తటస్థ పాత్ర పోషిస్తున్నదని పార్టీలకు పూర్తి నమ్మకం కుదిరినప్పుడే ఆ ఎన్నికలపై ప్రజానీకంలో కూడా విశ్వసనీయత ఏర్పడుతుంది. ఆరోపణలు, ప్రత్యారోపణలకు అవకాశం ఉండదు. ఎన్నికల సంఘం తాను సర్వస్వతంత్రంగా, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నానన్న భరోసా అందరిలోనూ కలగజేస్తే మెజారిటీ ప్రజానీకం నిర్భయంగా ఓటేయగలుగుతారు. మొదట్లో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) ఒక్కరే ఎన్నికల సంఘానికి ప్రాతినిధ్యంవహిస్తే 1987 నాటి రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో అప్పటి సీఈసీ ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి వ్యవహరించిన తీరుతో ఆందోళనపడ్డ నాటి ప్రధాని రాజీవ్ గాంధీ 1989 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈసీని ఇద్దరు సభ్యుల కమిషన్‌గా మార్చారు. కానీ ఎన్నికల అనంతరం వీపీ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం దాన్ని తిరగదోడింది. ఆ తర్వాత పదవి కోల్పోయిన కమిషనర్ ధనోవా సుప్రీంకోర్టుకెళ్లినా లాభం లేకపోయింది. తదనంతరకాలంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం అప్పటి సీఈసీ శేషన్ దూకుడు చూసి కీడు శంకించి త్రిసభ్య కమిషన్‌గా దాన్ని మార్చింది. కొత్తగా ఎంఎస్ గిల్, జీవీజీ కృష్ణమూర్తిలను తీసుకుంది. ఎన్నికల సంఘం చట్టాన్ని సవరించి ముగ్గురికీ ఒకే రకమైన అధికారాలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదా కల్పించారు. అయితే అంతా మారినట్టేనా? లేదని ఇన్ని దశాబ్దాల అనుభవాలు పదే పదే నిరూపించాయి. ఒకరున్నా, ఇద్దరున్నా, ముగ్గురున్నా ఈసీకి నిందలు తప్పటం లేదు. నిర్ణయ ప్రక్రియలో పారదర్శకత కూడా అంతంతమాత్రం. సుప్రీంకోర్టు చెప్పడానికి ముందే ప్రభుత్వాలు దీన్ని గ్రహిస్తే బాగుండేది. కమిషనర్‌ల ఎంపిక ప్రక్రియపై కొత్త చట్టం తీసుకురావాలని, అంతవరకూ తమ మార్గదర్శకాలు అమల్లో ఉంటాయని తాజాగా ధర్మాసనం ప్రకటించింది. ఈ తీర్పు స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చట్టం తీసుకొస్తుందని, ఇకపై ఎన్నికల సంఘం తటస్థత విషయంలో అనుమానాలకూ, అపోహలకూ ఆస్కారం ఉండదని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.ద్వాదశి ఉ.11.57 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: పుష్యమి రా.7.03 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6.20 నుండి 7.55 వరకు, అమృతఘడియలు: ఉ.11.43 నుండి 1.43 వరకు, శనిత్రయోదశి.

సూర్యోదయం : 6.21
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

మళ్లీ వీళ్లే పోటీ పడితే?

అభిప్రాయం



గ్యారీ అబెర్నాతీ

అమెరికాలో 2024 అధ్యక్ష ఎన్నికలు తిరిగి ట్రంప్, బైడెన్ మధ్యే జరిగితే ఆ పోటీ నిర్జీవంగా ఉంటుంది. ఓటమి ఫలితాన్ని తిరస్కరించిన ట్రంప్ పట్ల చాలామంది రిపబ్లికన్లు కూడా సుముఖంగా లేరు. అదే సమయంలో డెమొక్రాట్లు కూడా మరొక అభ్యర్థిని వెతుక్కోవడం మంచిది. ఎందుకంటే బైడెన్ కానీ, ట్రంప్ కానీ తమ పార్టీలను ఉత్సాహపరిచే స్థితిలో లేరు. కానీ ఒకవేళ బైడెన్ కాకపోతే సామ్యవాద శైలితో అమెరికాను మరింతగా ముంచే ఉదారవాది డెమొక్రాటిక్ పార్టీ నామినీ కావొచ్చు. అప్పుడు నేను రిపబ్లికన్ పార్టీ నామినీకే ఓటేస్తాను. ఆ నామినీ ట్రంప్ అయితే కూడా నా అభిప్రాయం ఇదేనా? ఇది న్యాయమైన ప్రశ్న.

2024లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష ప్రాథమిక ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు భావిస్తున్న మేరీలాండ్ మాజీ గవర్నర్ లారీ హోగన్... టాప్ రేడియో హోస్ట్, రాజకీయ పండితుడు హ్యూజ్ హెవిట్‌తో చేసిన సంభాషణతో వార్తల్లో కెక్కారు. అధ్యక్ష అభ్యర్థి కోసం రిపబ్లికన్ పార్టీ జరిపే ప్రాథమిక ఎన్నికల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తిరిగి గెలిచినట్లయితే తాను 'అసమ్మతితో' మద్దతిస్తానని హోగన్ చెప్పారు. అంతకుముందు ఆయనే 2020లో అభ్యర్థుల జాబితాలో లేని రోనాల్డ్ రీగన్‌కు అయినా ఓటు వేస్తాను గానీ, ట్రంప్‌కి ఓటు వేసేది లేదని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత గందరగోళ స్థితిలో తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. ట్రంప్‌కు మద్దతివ్వను కానీ రిపబ్లికన్ పార్టీ నామినీకి మద్దతిస్తాననీ, అయితే ఆ అభ్యర్థి ట్రంప్ కారని ఆశిస్తాననీ చెప్పారు.

ఈ ప్రకటనలో స్పష్టత లేదు కానీ, హోగన్ మాటలు... రిపబ్లికన్ ప్రాథమిక పోటీల్లో ట్రంప్ తిరిగి నిలబడినట్లయితే పరిస్థితి ఏమిటని చాలామంది అమెరికన్లలో నెలకొని ఉన్న డోలాయమాన స్థితిని ప్రతిఫలిస్తున్నాయని చెప్పాలి. ట్రంప్‌ను ద్వేషించేవారు అడగొచ్చు. ''అసలు దేనికి ఈ డోలాయమానం? ప్రజాస్వామ్యాన్ని కూలదోయడానికి ప్రయత్నించినవాడిని ఎవరైనా ఎందుకు పరిగణించాలి?'' ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ అనుసరించబోయే తీవ్ర వామపక్ష వాద విధానాల కన్నా ట్రంప్ వాగాడంబరమే ఎక్కువ చిర్రెత్తించేవాళ్లు మాత్రమే ఇలా సింపుల్‌గా అనేయగలరు.

కొన్ని తక్షణ సమస్యలు

ఈ రెండు అంశాలు నన్ను తీవ్రంగా కలత పెడుతున్నాయి. కానీ ఒక రిపబ్లికన్‌గా నేను దీనికోసం 2024 వరకు వేచి ఉండలేను. బైడెన్ మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడనట్లయితే, సామ్యవాద శైలి అధోజగత్తులో మనందరినీ మరింతగా ముంచేసే ఉదారవాద రాజకీయ నాయకుడు డెమొక్రటిక్ పార్టీ నామినీ కావొచ్చు. నేను మాత్రం తప్పకుండా రిపబ్లికన్ పార్టీ నామినీకే ఓటు వేస్తాను. ఆ నామినీ ట్రంప్ అయితే కూడా నా అభిప్రాయం ఇలాగే ఉంటుందా? ఇది న్యాయమైన ప్రశ్న.

తన అధ్యక్ష పదవీ కాలం పొడవునా, ట్రంప్ తన దూకుడు ప్రవర్తన ద్వారా నన్ను ఎంతో నిస్పృహకు గురిచేశారు. కానీ ఆయనకు నా మద్దతు చెక్కుచెదరలేదు. ఎందుకంటే నేను రాజకీయ నేతలను వారి ప్రవర్తనను బట్టి చూడను. వారి ఫలితాలను మాత్రమే పట్టించుకుంటాను.

అయితే 'ట్రంప్ ఎప్పటికీ వద్దు' అనే ప్రచారంలో నేను ఇంతకు ముందూ లేను, ఇకపై కూడా ఉండబోను. కొంతమంది పైస్థాయి రిపబ్లికన్లు 2016 నుంచి ట్రంప్‌పై ఆగ్రహంగా ఉన్నారు. ట్రంప్ నేతృత్వంలోని క్షేత్రస్థాయి ఉద్యమం (దీనికి నేను సంతోషించాను) తమ నుంచి పార్టీని లాగేసుకుందని వీరికి కోపం. అయితే 2020 అధ్యక్ష ఎన్నికల్లో తనను ప్రజలు తిరస్కరించడాన్ని ట్రంప్ ఆమోదించక పోవడం, ఆ తర్వాత 2021 జనవరి 6న జరిగిన హింసాత్మక ఘటనల వల్ల ట్రంప్‌తో రిపబ్లికన్ పార్టీ తెగతెంపులు చేసుకోవాలని నేను అభిప్రాయపడాల్సి వచ్చింది.



అయితే లోపభూయిష్టమైన రాజకీయ ఎంపికలు తరచుగా ఉన్నతమైన ఆదర్శాలతో ఘర్షిస్తుంటాయి. ఇతర విసుగు చెందిన ట్రంప్ మద్దతుదారులతో తాజాగా మాట్లాడుతున్నప్పుడు, ''నామినేషన్ ఆయన గెల్చుకుంటే ఏమవుతుంది?'' అనే ప్రశ్న తలెత్తుతుంది. అప్పుడు సాధారణంగా గాఢ నిశ్శబ్దం ఆవరిస్తుంది. ''బైడెన్‌కు వోటు వేయడం ఒక్కటే దేశభక్తియుత చర్యగా ఉంటుంది'' అని వీరిలో చాలామంది నొక్కి చెబుతారు. అయితే అది అంత సులభమైన విషయం కాదు.

అధ్యక్షుడిగా ఆశ్చర్యకరంగా ప్రభుత్వ పెద్ద విజన్‌కు ఛాంపియన్‌గా నిలిచిన బైడెన్‌ను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తాను. ఆ విజన్‌ను ఆయన తన స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలోనూ పునరుద్ఘాటించారు.

సబ్సిడీలతో, పన్ను మినహాయింపులతో ప్రత్యామ్నాయ 'శుభ్రమైన' శక్తివనరులకు ప్రభుత్వం ఆసరా ఇస్తున్నప్పుడు- సరసమైన శిలాజ ఇంధనాల ధరపై బైడెన్ చేస్తున్న యుద్ధం నాకు చికాకు తెప్పిస్తుంటుంది. ఆయుధాలను కలిగి ఉండటంపై అమెరికా రాజ్యాంగపు రెండో సవరణను మరింతగా అతిక్రమించే, అబార్షన్ హక్కులను క్రమబద్ధీకరించాలనే అభ్యర్థికి నేను ఓటు వేయలేను.

చట్టబద్ధమైన వలసలను సులభతరం చేయడాన్ని నేను బలపరుస్తాను. అలాగని అమెరికా సరిహద్దులను సురక్షితంగా ఉంచే బాధ్యత పట్ల బైడెన్ ప్రభుత్వం ప్రమాదకరమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అనుకుంటున్నాను.

'నిరసన ఓటు' లేదు

కాబట్టి 2020లో మూడో పార్టీ అభ్యర్థి కోసం తమ ఓటు వేస్తానని చెప్పిన హోగన్ వంటి రిపబ్లికన్లతో నేను జట్టు కట్టలేను. దీనివల్ల వారి మనస్సాక్షికి ఉపశమనం కలిగిందేమో గానీ వాస్తవంలో దానితో ఉపయోగం లేకపోగా బైడెన్ ఎన్నిక కావడానికి తోడ్పడింది. పైగా పాత అమెరికా పథకాలు 'న్యూ డీల్', 'గ్రేట్ సొసైటీ' వంటి వాటి గురించి చరిత్రకారులు పోల్చేటటువంటి భారీ ప్రభుత్వ విస్తరణకు అది దారితీసింది. అందుకే ఈ చర్చ ట్రంపా? బైడెనా? అని తిరిగి అక్కడికే వచ్చి నట్లయితే, 'నిరసన ఓటు'పై మన స్వాతంత్ర్యాన్ని వృథా చేయకుండా – కఠినమైన, అసౌకర్యమైన నిర్ణయాన్ని అయినా సరే... తీసుకోవడం పౌరులుగా మనందరి విధి.

ట్రంప్, బైడెన్ తిరిగి పోటీపడటం జరిగినట్లయితే– చట్టబద్ధమైన ఎన్నిక ఫలితాన్ని తిరస్కరించిన వ్యక్తి (తిరిగి అదే పని చేయగలడు కూడా), ఫెడరల్ కోర్టు బెంచ్‌లో సాంప్రదాయిక ఆలోచనలున్న న్యాయమూర్తులను నియమిస్తూనే సామాజిక, ఆర్థిక, సరిహద్దు విధానాలను కఠినంగా చేపట్టగల వ్యక్తి... ప్రగతిశీల విధానాలు అవలంబిస్తూ, సమస్య తర్వాత సమస్యతో దేశానికి తీవ్ర నష్టం చేస్తున్న వ్యక్తి మధ్య ఒకరిని నేను ఎంచుకోవాల్సి ఉంటుంది.

డెమొక్రాట్లు కూడా మరొక అభ్యర్థిని వెతుక్కోవడం తెలివైన పని. ఇటీవలే 'ఏబీసీ' న్యూస్ పోల్ నివేదించినట్లుగా బైడెన్ కానీ, ట్రంప్ కానీ తమ సొంత పార్టీలను విస్తృతంగా ఉత్సాహపరిచే స్థితిలో లేరు.

ఊహాత్మకమైన పోటీ

బైడెన్, ట్రంప్ మధ్య తిరిగి పోటీ జరుగుతుందని ఊహిస్తే గనక, ఇదే పోల్ ప్రకారం 48 శాతం ఓటర్లు ట్రంప్‌కు, 45 శాతం మంది బైడెన్‌కు అనుకూలంగా ఉంటున్నారు. ఇక స్వతంత్రులతో కలిపి పరిగణిస్తే- ట్రంప్‌కు 50 శాతం మద్దతు లభించగా బైడెన్‌కు 41 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. ట్రంప్ మద్దతుదారులే కాకుండా కోట్లాదిమంది అమెరికన్లు కూడా ఇప్పుడు బైడెన్ పాలన పట్ల సంతోషంగా లేరు. పైగా ఎన్ని లోపాలున్నప్పటికీ, మరోసారి ట్రంప్‌కు అవకాశం ఇవ్వడం పట్ల కూడా వీరు సుముఖంగా ఉన్నారు.

కానీ ఈ నిర్జీవ పోటీనే మనం ఎదుర్కోవాల్సిన వాస్తవమా? అయితే రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఓటర్లు ట్రంప్‌ను కాకుండా మరొకరిని అధ్యక్ష పదవికి ఎంచుకుంటారని నేను ఇప్పటికీ ఆశావాదంతో ఉన్నాను. రిపబ్లికన్ పార్టీ ఎన్నుకునే అధ్యక్ష అభ్యర్థి రిపబ్లికన్లను మాత్రమే కాకుండా, వివిధ వర్గాల అమెరికన్లను కూడా ఉత్సాహపరిచేట్టుగా ఉండాలి.

వ్యాసకర్త సంపాదకుడు, కాలమిస్ట్
('ద వాషింగ్టన్ పోస్ట్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పళ్ల రాజు



ఎండాకాలానికి సిద్ధంగా లేనుగానీ, మామిడిపళ్ల కోసం మాత్రం ఎదురుచూస్తున్నాను. ఏమంటారు?

– రణవీర్ బ్రార్, షెఫ్

నేర్వని గుణపాఠాలు



ఉత్తరాఖండ్‌లో రిషీకేశ్ నుంచి శ్రీనగర్‌కు వేస్తున్న సొరంగ రైల్వే ట్రాకు వల్లే మళ్లీ భూపాతం సంభవించింది. జోషీమఠ్ కుంగిపోవడం నుంచి మోదీ ప్రభుత్వం ఏ పాఠాలూ నేర్చుకోలేదని దీనివల్ల స్పష్టమవుతోంది.

– సీమా సేన్‌గుప్తా, కాలమిస్ట్

మాకు కావాలో దేశం



కైలాసంను ఐక్యరాజ్యసమితి గుర్తించి, వైకుంఠాన్ని కనీసం పట్టించుకోకపోవడం పట్ల ఒక వైష్ణవుడిగా చాలా బాధ పడుతున్నాను. ఎవరైనా వైష్ణవ గురువు త్వరగా ఈ లోటు తీర్చుతారని నమ్ముతున్నాను. విష్ణు పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్నా.(కైలాసం పేరుతో వివాదాస్పద గురువు నిత్యానంద ఒక 'దేశం' నెలకొల్పడం పట్ల వ్యంగ్యం.)

– టి.ఎం. కృష్ణ, గాయకుడు

ప్రజాస్వామికంగా...



నేను తర్వాతి డిన్నర్‌కు వెళ్దామని అనుకున్నప్పుడు భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నేతను అడుగుతాను. వాళ్లే రెస్టారెంట్‌ను ఎంపిక చేయాలి.

– సంధ్యా రవిశంకర్, సంపాదకురాలు

మొత్తం నష్టపోయాం



వార్తల్లో వచ్చే ప్రతిదీ దయచేసి నమ్మవద్దు. స్టాకుల విషయంలో నాకూ, మారియాకు (భార్య మారియా గోరెట్టి) ఉన్న జ్ఞానం శూన్యం. సలహా తీసుకుని 'శారదా'లో పెట్టుబడులు పెట్టాం. మరెందరి లాగానో మా కష్టార్జితమైన మొత్తం డబ్బును నష్టపోయాం.

– అర్షద్ వార్సీ, నటుడు

తప్పనిసరి పాఠం



ఆరోగ్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో అత్యంత తక్కువ జ్ఞానం, సంసిద్ధత ఉండటం చూస్తే బాధ కలుగుతోంది. (బ్యాడ్మింటన్ ఆడుతూ కుప్పకూలిన 38 ఏళ్ల శ్యామ్ యాదవ్‌కు 'సీపీఆర్' చేసివుంటే బతికేవాడేమోనన్న అర్థంలో.) సీపీఆర్ అనేది ఎంత విలువైనదో, అది ఎలా ఒకరి జీవితాన్ని కాపాడగలదో సామాజిక మాధ్యమాల్లో తగినంత చైతన్యం ఉంది. సీపీఆర్‌ను పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా నేర్పాల్సిన సమయం ఇదే.

– సంగీతా రెడ్డి, ఆరోగ్య రంగ పర్సనాలిటీ

అక్కర్లేని పోరు



కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒప్పందలలో ఉన్నాయి – కేంబ్రిడ్జిలో రాహుల్ ఉపన్యాసం గొప్పగా ఉంది. అది ఓట్లు తేగలదని కాంగ్రెస్ నమ్మింది. అది మరిన్ని ఎక్కువ ఓట్లు తమకు తేగలదని బీజేపీ నమ్మింది. విన్-విన్ సందర్భం! మరి మనం ఎందుకు పోట్లాడుకుంటున్నట్టు?

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యంగ్య వ్యాఖ్యాత

ప్రగతిశీల పాత్రికేయ సమున్నతుడు

సందర్భం




జయసూర్య

1962లో మార్క్సిస్టు పార్టీ అవతరణ దశలో, మార్క్సిస్టు పార్టీ వారపత్రిక 'జనశక్తి' స్థాపనకు పార్టీ నాయకత్వం డిక్లరేషన్ తీసుకుని ఏబీకే ప్రసాద్ (అన్నె భవానీ కోటేశ్వర ప్రసాద్) దానిని ప్రారంభించారు. అనతి కాలంలోనే జనశక్తి పార్టీ క్యాడర్‌లోనే కాక, తెలుగునాట పార్టీయేతర ప్రజలలో కూడా ఎక్కువ ప్రాచుర్యం సాధించింది. బొమ్మారెడ్డి, సత్యమూర్తి (శివసాగర్), వై. కోటేశ్వర రావు, శ్రీహరి తదితరుల సారథ్యంలోని జనశక్తి ప్రధాన సంపాదకునిగా ఏబీకే ప్రసాద్ వ్యవహరించేవారు. ఆయన ప్రధానంగా సంపాదకీయాలతో పాటు సిద్ధాంత వ్యాసాలు రాసేవారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాల ప్రభావం కారణంగా సిద్ధాంతపరమైన వ్యాసాలతో, వార్తా విశేషాలతో పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఆకట్టుకున్న 'జనశక్తి' తెలుగు నాట రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహించింది. వార పత్రిక గానే గాక ద్వైవార పత్రికగా, దినపత్రికగానూ సంవత్సరాల తరబడి సంచలనం సృష్టించింది. భారత చైనా వివాదం, ఘర్షణలు తలెత్తినపుడు... కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నాటి పరిస్థితులను సాకుగా చూపి చాలా మంది మార్క్సిస్టు పార్టీ నాయకులతో పాటూ ఏబీకేనూ అరెస్టు చేసి జైలులో పెట్టింది. ఏడాదికి పైగా జైలులో ఉండి విడుదలైన కొద్ది రోజులకే రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన పరిస్థితులు తలెత్తి... విప్లవ వర్గం అవతరించింది. తొలినుంచి 'జనశక్తి' పత్రికా నిర్వహణలో చురుకుగా పాల్గొంటున్న ఏబీకే చీలిక వర్గాల ఒత్తిళ్ళు సరిపడక పార్టీ పరమైన రాజకీయాల నుంచి దూరమయ్యారు. అయినా మార్క్సిజం మూల సూత్రాల నుంచి ఆయన దూరం కాలేదు.

'జనశక్తి' నుంచి తప్పుకున్న తరువాత ఆంధ్ర జ్యోతి సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు నుంచి పిలుపు రావడంతోనే ఏబీకే పత్రికా ప్రస్థానం మలుపు తిరిగింది. ఇంతలో ప్రభుత్వం పార్వతీ పురం కుట్ర కేసులో ఇరికించింది. రెండున్నరేళ్ల కోర్టు చుట్టూ తిరిగి ఆ కేసు నుంచీ బయటపడ్డారు. విలేఖరి స్థాయి నుంచి 'ఎడిటర్-ఇన్-చీఫ్' వరకూ అరవై ఏళ్ల పత్రికా జీవితంలో ఎదిగారు. నిబద్ధత, ఎవరికీ తలవంచని ప్రవృత్తి, జనసామాన్యం సంక్షేమం పట్ల నిరంతర నిమగ్నత, సోషలిస్టు సమాజ లక్ష్యం ఏబీకేను ఇప్పటికీ నడిపిస్తున్నాయి. 'జనశక్తి', 'విశాలాంధ్ర', 'ఈనాడు', 'ఆంధ్రప్రభ', 'ఆంధ్ర భూమి', 'ఉదయం', 'ఆంధ్రజ్యోతి', 'వార్త', 'ఆంధ్రప్రదేశ్', 'మాభూమి', 'సుప్రభాతం' వంటి పత్రికలకు సంపాదకునిగా మార్గ దర్శకత్వం వహించిన ఏకైక మేధా సంపన్నునిగా ఆయనకు గుర్తింపు లభించింది.

తెలుగు పత్రికలలో అచ్చమైన తెలుగు పదాలకు, నుడికారాలకు, సామెతలకు; సందర్భానుసారంగా శీర్షికలు, వాక్యాలలో స్థానం కల్పించి... మాతృభాషకు ఎంతో సేవ చేశారు. అక్కరకు వచ్చే తెలుగు పదాలను తోసిపుచ్చడం ఆత్మహత్యాసదృశం అన్నారు. ప్రామాణిక భాషనే కాదు, ప్రామాణిక భాషను సంపన్నవంతం చేసే ప్రాదేశిక పద సంపదను పత్రికా రంగంలో ప్రవేశపెట్టారు. సంపాదకీయానికి విషయ పరిజ్ఞానం, విశ్లేషణ, సాధికారత, భాష ... ఈ నాలుగు లక్షణాల ఆవశ్యకతను గుర్తించి, నార్ల ఒరవడిని పుణికిపుచ్చుకుని ప్రతిభావంతమైన సంపాదకీయాలు రాశారు. అధికార భాషా సంఘం చైర్మన్‌గానూ ఆయన వ్యవహరించారు.



పత్రికా రచయితగానే కాకుండా గ్రంథకర్తగా 'నిబద్ధాక్షరి', 'సాహిత్యకీయాలు', 'యూనివర్సిటీలలో జ్యోతిష్యం అవసరమా?', 'పరాధీన భారతం', 'సిరా సరాగాలు', 'దారి తప్పిన రూపాయి', 'యుద్ధ నేరస్థులు', 'అంతా బాగుంది', 'అబద్ధాలు–ఆర్భాటాలు' 'ఆఫ్ఘనిస్తాన్‌పై సూపర్ టెర్రరిజం ధ్వంసరచన', 'కళంకిత సావర్కర్', 'సర్వ సమర్పణం', 'రుణాంధ్రప్రదేశ్' వంటి ఎన్నో రచనలు వెలుగుచూశాయి.

సంపాదకీయాలు పేరిట నాలుగు గ్రంథాలు వచ్చాయి. సతీష్ చందర్‌తో కలిసి 'వార్త పలుకుబడి', టంకశాల అశోక్‌తో కలిసి 'నిజాలు, నిష్ఠూరాలు' పేరుతో నాలుగు సంపుటాలు; కన్నాబిరాన్, ఆర్.ఎస్. రావులతో కలిసి 'పీపుల్స్‌వార్ ప్రభుత్వ చర్చలు దృక్పథాలు, దృక్కోణాలు' వెలువడ్డాయి. ఆత్మకథ రచించే ప్రతిపాదన రూపు దిద్దుకొంటోంది. ఆయన 'పరాధీన భారతం' దేశ వ్యాపితంగా ప్రశంసలందుకుంది.

88 ఏళ్ల వయసులో డా॥ ఏబీకే ప్రసాద్ వృద్ధాశ్రమంలో ఉన్నా పత్రికా కార్యాలయంలో ఉన్నట్టే మార్క్సిస్టు ప్రగతిశీల సోషలిజం భావజాలంతో అనుక్షణం జీవిత గమనంలో అనేక సమకాలీన సంఘటనలకు స్పందిస్తూ రచనలు కొనసాగిస్తూ ఉన్నారు. ఆయన వంటి పాత్రికేయులు, వర్తమాన మీడియాకు అత్యవసరమని ప్రస్తుత రాజకీయ, పాత్రికేయ రంగం స్థితిగతులు స్పష్టం చేస్తున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ : 90149 48336

(ప్రముఖ సీనియర్ పత్రికా సంపాదకులు ఏబీకే ప్రసాద్‌కు 'రాజా రామమోహన్ రాయ్ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్' ప్రదానం సందర్భంగా)

బుద్ధి సూక్ష్మత

మనిషికి 'తత్కాలవృత్తియైన బుద్ధి' అంటే అవసరానికి ఉపయోగపడే బుద్ధి తగిన ఫలితం అందిస్తుంది. కానీ 'తలచినపుడె బుద్ధి తలకొనకుండిన హానివచ్చుగాన' అనగా అవసరానికి ఆదుకోని బుద్ధి వలన ఆపదే కాబట్టి, అది తెలివిలేనితనంతో సమానమైనదే అంటాడు ఎఱ్ఱయ కవి 'సకలనీతి కథా నిదానము'లో ఒకచోట. ఇందుకు దృష్టాంతంగా చెప్పుకోదగిన ఒక పాత కథ ఉంది.

పూర్వం ఒక ఊరిలో ఒక రైతు కుటుంబం ఉండేది. జీవితమంతా కష్టపడి దాచిన సొమ్ము ఒక వెయ్యి వరహాలు చేరింది అతని దగ్గర. అప్పట్లో అది పెద్ద మొత్తమే. ఆ మొత్తాన్ని చాలా జాగ్రత్తగా దాచి పెట్టి రోజూ చూసుకుని ఆనందపడుతూండేవాడు. రోజులు అలా గడుస్తూండగా అతనికి ముసలితనం వచ్చి, ఏదో తెలియని వ్యాధి అతని శరీరంలోకి చేరింది. ఎక్కువ రోజులు బతికే అవకాశం లేదని అతనికి అర్థం కాగానే, దాచి ఉంచిన డబ్బుమూట మీద అతనికి దిగులు పెరిగిపోసాగింది.

జ్యోతిర్మయం

అతనికి ఇద్దరు కొడుకులున్నారు. ఇద్దరూ బుద్ధిగా ఉంటూ శ్రమచేసి జీవనం సాగించేవారే. అయినప్పటికీ ఆ ఇద్దరిలో ఎవరు తాను దాచి ఉంచిన ధనరాశికి అర్హుడైనవాడో తెలుసుకోవడానికి ఒక పరీక్ష పెట్టాలనుకున్నాడు. ఆ రాత్రి జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి నిద్ర పోయాడు. ఆ మరునాడు నిద్ర మేలుకోగానే ఇద్దరు కొడుకులనూ పిలిచి, ఒక్కొక్కరికి ఐదు వరహాలు ఇచ్చి, ఆ ధనంతో ఏమి కొనగలరో కొని, ఇంటిని పూర్తిగా నింపి చూపించమని అడిగాడు. చిన్నవాడు వెంటనే ఒక చెరకు గానుగ కొట్టుకు వెళ్ళి, రెండు బండ్ల చెరకు చెత్త తెచ్చి, అరగంటలో ఇంటినంతా నింపి చూపించాడు తండ్రికి.

తమ్ముడి తొందరపాటుతనంతో పాటు, తండ్రి మనసులో ఆలోచన తెలిసినవాడైన పెద్దకొడుకు, సాయంత్రమైన దాకా వేచి ఉండి, చీకట్లు ఊరిని కమ్మేస్తూ ఉండగా, ఇంటికి దగ్గరలోని ఒక అంగడికి వెళ్ళి, ఒక నూనెలో ముంచిన దివిటీని ఒక వరహా ఖర్చుతో కొని తెచ్చి, తండ్రి, తమ్ముడు చూస్తూ ఉండగా దివిటీని వెలిగించి, ఆ దేదీప్యమానమైన వెలుగులో ఇంటిని మొత్తాన్నీ నింపి, ఇంటిని నింపడానికి తనకు ఒక వరహా సరిపోయిందని, మిగతా నాలుగు వరహాలు తిరిగి తండ్రికే ఇచ్చాడు. తండ్రి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. పెద్దవానికే సొమ్ము బాధ్యతతో పాటు, తమ్ముడి బాధ్యతను గూడా అప్పగించాడు. అన్న తెలివికి తమ్ముడు కూడా ఆనందించి, అన్నకు విధేయుడై ఉంటూ సుఖపడ్డాడు.

అలా అవసరమైనప్పుడు ఉపయోగపడే బుద్ధి అన్ని సందర్భాలలోనూ విజయాన్ని అందించేదిగా ఉంటుంది.

– వెంకట్ భట్టు

క్లుప్తంగా...

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ప్రారంభం



పుష్కరిణిలో తెప్పోత్సవం

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలై మాడ వీధుల మీదుగా పుష్కరిణికి చేరుకుంది. సీతా రామలక్ష్మణ ఆంజనేయస్వామివారు పుష్కరిణిలో తెప్పపై 3 చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. తిరుమల పెద్దజీయర్ స్వామి, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్షమోదక లక్ష్మీగణపతి హవనం



మాట్లాడుతున్న విశాఖ శారద పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాక స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం లక్షమోదక లక్ష్మీగణపతి హవనం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశాఖ శారద పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి, కలశ స్థాపన వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు, యజ్ఞాలు ప్రారంభించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుగ్రహంతోనే ఆలయంలో లక్షమోదక లక్ష్మీ గణపతి హవనం పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు జరుగుతాయని చెప్పారు.

ఏఎన్‌యూ, ఏపీశాక్ మధ్య ఎంవోయూ

ఏఎన్‌యూ: విద్య, పరిశోధన అంశాల్లో కలిసి పని చేసేందుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీశాక్) మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు యూనివర్సిటీలో జియాలజీ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఏపీశాక్ డైరెక్టర్ (టెక్నికల్) ఎ.నాగేశ్వరరావు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు.



'యాంటిబయోటిక్స్'కు బ్రేకులు

విచ్చలవిడి విక్రయాలను నియంత్రించాలని వైద్య శాఖ నిర్ణయం

రాష్ట్రంలోని అన్ని మందుల దుకాణాలకు హెచ్చరికలు జారీ

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మితే కఠిన చర్యలు

యాంటీబయోటిక్స్ విక్రయాలపై ఔషధ నియంత్రణ విభాగం నిఘా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యాంటిబయోటిక్ మందుల అతి వినియోగాన్ని నియంత్రించడంపై వైద్య శాఖ దృష్టి సారించింది. నిబంధనలకు విరుద్ధంగా మందుల దుకాణాల్లో ఈ మందుల విక్రయానికి కళ్లెం వేయాలని నిర్ణయించింది. యాంటీబయోటిక్స్ అతి వినియోగం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. దగ్గు, జలుబు, జ్వరం.. ఇలా ఏ చిన్న సమస్య వచ్చినా యాంటీబయోటిక్స్ వాడుతున్నారు. వైద్యులు ప్రిస్కిప్షన్ లేకుండానే మందుల దుకాణాలకు వెళ్లి సమస్య చెప్పగానే ఈ మందులు ఇచ్చేస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి అనంతరం వీటి వినియోగం మరింత పెరిగింది. అధికశాతం మందుల దుకాణాల్లో వీటి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఈ తరహాలో వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందుల షాపుల్లో జరిగే యాంటిబయోటిక్స్ విక్రయాలపై ఔషధ నియంత్రణ విభాగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మందుల దుకాణాల్లో ఫార్మాసిస్ట్‌ల అందుబాటు, వైద్యుల ప్రిస్కిప్షన్ మేరకు హెచ్, హెచ్1 మందుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించాం. విచ్చలవిడిగా యాంటిబయోటిక్స్ విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ మందుల వినియోగంపై ప్రజల్లో కూడా చైతన్యం రావాలి. వైద్యుడి సూచన లేకుండా మందుల దుకాణాల్లో యాంటిబయోటిక్ ఇస్తే ప్రశ్నించాలి.

– ఎస్. రవిశంకర్ నారాయణ్, డీజీ ఔషధ నియంత్రణ విభాగం

ఇప్పటికే హెచ్చరికలు జారీ

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం 1945లోని షెడ్యూల్ హెచ్, హెచ్ 1లో ఉండే మందులను దుకాణాల్లో వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా అమ్మకూడదు. వీటిలో యాంటిబయోటిక్స్ కూడా ఉంటాయి. అందువల్ల షెడ్యూల్ హెచ్, హెచ్ 1 మందుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఇప్పటికే ఔషధ నియంత్రణ విభాగం అధికారులు మందుల దుకాణాల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులకు హెచ్చరికలు జారీ చేశారు. వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా ఈ మందులను విక్రయిస్తూ తనిఖీల్లో పట్టుబడినా, ఆధారాలతో ఫిర్యాదులు వచ్చినా నెల రోజుల పాటు లైసెన్స్‌ను సస్పెండ్ చేయడంతో పాటు, శాశ్వతంగా అనుమతులు రద్దు కూడా చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి షెడ్యూల్ హెచ్, హెచ్1 మందుల విక్రయాలపై నిఘా ఉంచుతున్నారు. రాష్ట్రంలో 42వేల హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాలు ఉన్నాయి. మందులపై ఉన్న బ్యాచ్ నంబర్ల ఆధారంగా హోల్‌సేలర్ నుంచి ఏ మందులు ఏ రిటైల్ దుకాణానికి వెళ్లాయి, అక్కడ వాటి విక్రయాలు, రికార్డులు ఇతర అంశాలపై ఆరా తీస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి యావజ్జీవం

గుంటూరు లీగల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పోక్సో కోర్టు న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.3,500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బాలిక తల్లితో కలిసి దుర్గి మండలంలోని ఓ గ్రామంలో నివసిస్తున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి పూర్తి చేసుకుని నాలుగో తరగతిలో చేరాల్సి ఉంది. ఈ క్రమంలో దుర్గిలో నివాసం ఉంటున్న అత్త ఇంటికి వెళ్లి వస్తానని తల్లికి చెప్పడంతో అదే గ్రామంలో ఉంటున్న ఆటో డ్రైవర్ కామ రామన్జీ అలియాస్ అంజితో మాట్లాడి ఆటో ఎక్కించి పంపించింది. అంజి బాలికను మొక్కజొన్న పొలం వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత బాలికను బంధువుల ఇంటి వద్ద దింపాడు. బాలిక అనారోగ్యంగా ఉండటంతో అదే రోజు సాయంత్రం తల్లి వద్దకు వచ్చేసింది. అంజి బెదిరింపులకు భయపడి తల్లికి విషయం చెప్పలేదు. అయితే 2018, మే 12న తల్లి యథావిధిగా పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఎప్పుడూ ఇంటి పనులు చేసే బాలిక చేయకుండా నీరసంగా కనిపించడంతో ఏం జరిగిందని అడుగ్గా, గతంలో తనపై జరిగిన లైంగిక దాడి విషయాన్ని చెప్పింది. వెంటనే తల్లి దుర్గి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఏఎస్పీ కె.జి.వి.సరిత దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడు అంజిపై నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు పైవిధంగా తీర్పు చెప్పారు. కోర్టు విచారణ సమయంలో బాలిక మృతి చెందింది. బాలిక కుటుంబానికి రూ.4 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శ్యామల కేసు వాదించారు.

కొల్లేరు పెద్దింట్లమ్మకు కలువ బోనాలు

కైకలూరు: ఏలూరు జిల్లా కొల్లేటికోటలో పెద్దింట్లమ్మ జాతర శుక్రవారం కూడా కొనసాగింది. జాతరలో ప్రధాన ఘట్టమైన శ్రీజలదుర్గ, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. పెద్దింట్లమ్మకు కై కలూరు, దెందులూరు, ఆకివీడు, ఉంగుటూరు నియోజకవర్గాల కొల్లేరు ప్రాంత మహిళలు 1700 మంది కలువ బోనాలు సమర్పించారు. బోనాలు ముందు వరుసలో ఏడు కావిళ్లలో పసుపు, కుంకుమ, నెయ్యి, వేప రొట్టలు, నిమ్మకాయలు, పానకం, కల్లు తీసుకెళ్లి అమ్మకు నైవేద్యం పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభ ఊరేగింపు ఆకట్టుకుంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ, ఆలయ ఈవో కేవీ గోపాలరావు, రాష్ట్ర వడ్డీలు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రి సంతోషి, వడ్డెర, అతిరాస కార్పొరేషన్ల చైర్‌పర్సన్, చైర్మన్‌లు దేవెళ్ల రేవతి, ఇల్లా భాస్కరరావు పాల్గొన్నారు.



కొల్లేటికోట పెద్దింట్లమ్మ చెంతకు బోనాలతో మహిళలు

వైభవంగా ఖాద్రీశుడి కల్యాణం



కల్యాణ వేదికపై శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారసింహుడు

కదిరి: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, జగత్ రక్షకుడైన శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో అంగరంగ వైభవంగా జరిగింది. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం అర్చకులు శ్రీవారి కల్యాణం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సకల దేవతల ఆశీర్వచనాలతో స్వామి.. శ్రీదేవి, భూదేవిలను వివాహమాడారు. పక్షం రోజులు సాగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం ముఖ్యమైనది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రమోహన్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చారు. శ్రీవారి కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

రెండో రోజూ కొనసాగిన గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు

లక్షలాదిగా పాల్గొన్న భక్తులు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన 46వ హోసన్న గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం రెండో రోజూ కొనసాగాయి. ప్రత్యేక ప్రార్థనల్లో ఉదయం వినుకొండకు చెందిన పాస్టర్ జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. అనంతరం హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్‌లు, సిస్టర్‌లు క్రీస్తుని స్తుతి గీతాలను ఆలపించారు. కడపకు చెందిన పాస్టర్ జాన్‌పాల్, కర్నూలుకు చెందిన పాస్టర్ ఫ్రెడిపాల్, ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు భక్తులనుద్దేశించి ప్రసంగించారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీలు క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందజేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు 2 లక్షలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

దశాబ్దం తర్వాత నల్లమలలో తోడేళ్ల జాడ

సంరక్షణకు అటవీశాఖ చర్యలు

మార్కాపురం: పదేళ్ల కాలం అనంతరం నల్లమల అటవీ ప్రాంతంలో తోడేళ్ల కదలికలు కనిపించాయి. ఇటీవల దోర్నాల–ఆత్మకూరు సరిహద్దులోని రోళ్ల పాడు వద్ద తోడేళ్లు కనిపించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇవి దోర్నాల– ఆత్మకూరు–శ్రీశైలం అటవీ ప్రాంతాల మధ్య కొద్ది సంఖ్యలో సంచరిస్తున్నాయి. వీటి అరుపు కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఇవి గుంపులుగా సంచరిస్తూ..జింకలు, గొర్రెలు, మేకలు, కుందేళ్లను చంపి తింటాయి. అత్యంత వేగంగా పరిగెడతాయి. పాతికేళ్ల క్రితం మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, అర్ధవీడు, దోర్నాల తదితర ప్రాంతాల్లో ఇవి ఉండేవి. పంట పొలాలకు రక్షణ చర్యలో భాగంగా రైతులు కరెంటు తీగలు పెట్టడంతో జంతువుల్ని వేటాడేందుకు పొలాల్లోకి వచ్చి విద్యుత్ వైర్లు తగిలి చనిపోయి వాటి సంఖ్య క్రమేపి తగ్గిపోయింది. గడిచిన పదేళ్ల కాలంలో నల్లమలలో తోడేళ్ల జాడ లేకపోవడంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో నెల క్రితం రోళ్లపాడు అటవీ ప్రాంతంలో తోడేళ్ల జాడ ట్రాప్డ్ కెమెరాల్లో కనిపించింది. వాటి సంరక్షణకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



వన్య ప్రాణులను చంపవద్దు



వన్య ప్రాణులను ఎవరూ చంపవద్దు. ఉచ్చులేసి వేటాడొద్దు. ఇటీవల రోళ్ల పాడు ప్రాంతంలో తోడేళ్లు సంచరించాయి. రైతులు పొలాలకు విద్యుత్ కంచె వేయవద్దు. వన్య ప్రాణులను వేటాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎ.విగ్నేష్, డిప్యూటీ డైరెక్టర్, అటవీ శాఖ

పాలనా వికేంద్రీకరణ వల్లే పెట్టుబడుల వెల్లువ



887వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వికేంద్రీకరణకు పెద్దపీట వేస్తున్నందునే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 887వ రోజు రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా విశాఖ కేంద్రంగా తాను ఇకపై పాలన కొనసాగిస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికగా ప్రకటించడం హర్షణీయమని చెప్పారు. 5 కోట్ల మంది ప్రజల ఆశయాలకు అనుగుణంగా జగనన్న తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానాభివృద్ధి చెందుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. విశాఖలో ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రాష్ట్రానికి దిగ్గజ పారిశ్రామిక కంపెనీల ద్వారా వెల్లువెత్తిన పెట్టుబడులను చూసైనా ఎల్లో మీడియా విష ప్రచారాలు కట్టిపెడితే మంచిదని హితవు పలికారు. లేకుంటే ప్రజలు వీరిని పూర్తిగా బహిష్కరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తుది తీర్పునకు లోబడే 25% కోటా సీట్ల ఫీజు చెల్లింపు వ్యవహారం

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, అమరావతి : విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ఉచిత సీట్లు పొందే పిల్లల తల్లిదండ్రులు అమ్మఒడి పథకం చెల్లించే మొత్తం నుంచే ఫీజులు చెల్లించుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 24ను సవాలు చేస్తూ ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐఎస్‌ఎంఏ) అధ్యక్షుడు కోగంటి శ్రీకాంత్, యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ ఫెడరేషన్(యుపీఈఐఎఫ్) చైర్మన్ గొల్లపూడి మోహనరావు హైకోర్టును ఆశ్రయించారు. 25 శాతం కోటా కింద భర్తీ చేసే సీట్ల ఫీజులను తల్లుల ఖాతాల్లో కాకుండా నేరుగా పాఠశాలలకు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వారు కోర్టును కోరారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వేదుల వెంకటరమణ, బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. 25 శాతం కోటా సీట్ల ఫీజులను ప్రభుత్వం సరైన రీతిలో నిర్ణయించలేదని వారు కోర్టుకు నివేదించారు. ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో కాకుండా నేరుగా పాఠశాలల ఖాతాలో సొమ్ము జమ చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ.. ఫీజు చెల్లింపు వ్యవహారం ఈ వ్యాజ్యాల్లో తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లకు నోటీసులిచ్చారు. తదుపరి విచారణను 15కి వాయిదా వేశారు.

క్లుప్తంగా...

ఎస్‌ఎస్‌బీ డీజీగా రశ్మీ శుక్లా



న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం సశస్త్ర సీమా బల్(ఎస్‌ఎస్‌బీ) డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి రశ్మీ శుక్లా(57) నియమితులయ్యారు. 1988 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ రశ్మీ శుక్లా ప్రస్తుతం సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) అదనపు డీజీగా ఉన్నారు. శుక్లా నియామకానికి కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని సిబ్బంది వ్యవహారాల శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమె 2024 జూన్ 30వ తేదీ వరకు విధుల్లో ఉంటారని తెలిపింది. నేపాల్, భూటాన్ సరిహద్దుల భద్రతను ఎస్‌ఎస్‌బీయే చూసుకుంటుంది.

ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వండి

షిల్లాంగ్: మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) చీఫ్, తాజా మాజీ సీఎం కాన్రాడ్ సంగ్మా రాష్ట్ర గవర్నర్ ఫగు చౌహాన్‌ను కోరారు. రాష్ట్ర అసెంబ్లీలోని 60 మంది సభ్యులకు గాను 32 మంది ఎమ్మెల్యేల మద్దతు తనకుందని తెలిపారు. వీరి సంతకాలతో కూడిన లేఖను గవర్నర్‌కు అందజేశామన్నారు. శుక్రవారం ఆయన రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు నాకుంది. మద్దతిస్తామని బీజేపీ ఇప్పటికే తెలిపింది. హిల్ స్టేట్ డెమోక్రటిక్ పార్టీ, స్వతంత్రులు కూడా మా వెంట ఉన్నారు' అని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఈ నెల 7న ప్రమాణం చేయనుందని, ప్రధాని మోదీ కూడా ఈ కార్యక్రమానికి వస్తారని తెలిపారు. కాగా, ఎన్‌పీపీ యేతర, బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటూ అంతకుముందు టీఎంసీ, కాంగ్రెస్, యూడీపీ, పీడీఎఫ్‌లు హడావుడి చేశాయి. ఫిబ్రవరి 27వ తేదీన 59 సీట్లకు జరిగిన ఎన్నికల్లో ఎన్‌పీపీ సొంతంగా 26, మిత్రపక్షం యూడీపీ 11 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్, టీఎంసీలు చెరో ఐదు స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ రెండు సీట్లను దక్కించుకుంది.

సోనియా గాంధీకి అస్వస్థత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా (76) అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం గురువారం ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరారు. సోనియా జ్వరంతో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. సోనియాకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆమె ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

బీజేపీ పవర్ ప్లే..



భారతీయ జనతా పార్టీ దేశాన్ని చుట్టేస్తోంది. ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రధాని మోదీ ఇమేజ్‌ని పెట్టుబడిగా పెట్టి, డబుల్ ఇంజిన్ నినాదంతో రాష్ట్రాల్లో పాగా వేస్తోంది. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో గురువారం వెలువడిన ఎన్నికల ఫలితాలు కమలం దళంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అభివృద్ధి, శాంతి స్థాపన లక్ష్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల్ని ఎదుర్కొని, అధికార వ్యతిరేకతను ఎదురొడ్డి త్రిపుర, నాగాలాండ్‌లో అధికారాన్ని నిలబెట్టుకుంది. మేఘాలయలో కూడా ఒకప్పటి మిత్రపక్షం కాన్రాడ్ సంగ్మాకు చెందిన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)కి మద్దతు ఇచ్చి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ అధికారంలోకి రావడం ద్వారా 2024లో జరగనున్న లోక్ సభ ఎన్నికలకు బలమైన పునాదులు వేసుకుంటోంది.

ఎలా పట్టు సాధించింది ?

ఈశాన్య రాష్ట్రాల్లో అసోం, త్రిపురలో హిందూ జనాభా ఎక్కువ. మిగిలిన రాష్ట్రాల్లో గిరిజనులు, క్రిస్టియన్లదే పట్టు. ఆయా రాష్ట్రాల్లో అత్యధికులు బీఫ్ తింటారు. ఇంగ్లిష్ మాట్లాడతారు. దీంతో ఇతర పార్టీలు బీజేపీ హిందుత్వ, హిందీ ఎజెండాను పదే పదే ఎత్తి చూపుతూ కాషాయ దళాన్ని ఇరుకున పెట్టాలని చూశాయి. అయినప్పటికీ ఈశాన్యంలో కాషాయ జెండా రెపరెపలాడింది. త్రిపుర లో శాంతి స్థాపన, అభివృద్ధికే బీజేపీ మొదట నుంచి ప్రాధాన్యం ఇస్తూ వచ్చింది. మౌలిక సదుపాయాలు, హైవేల నిర్మాణం, సురక్షిత మంచి నీరు, ఉచిత రేషన్, విద్యుత్ సౌకర్యం వంటివన్నీ బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపడానికి కారణాలే. ఎన్నికలకు కాస్త ముందు ప్రభుత్వ ఉద్యోగులకు 12% డీఏ ప్రకటించి వారిని తమ వైపు తిప్పుకుంది. కేంద్రంలో అధికారంలో ఉండడంతో నాగాలాండ్‌లో కూడా శాంతి చర్చలు చేసి వారి సమస్య పరిష్కారానికి హామీలు ఇచ్చింది. ఎన్‌డీపీపీతో పొత్తుతో అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకుంది. కొద్ది రోజుల క్రితం మేఘాలయ బీజేపీ చీఫ్ ఎర్నెస్ట్ మావ్రీ బీఫ్ తినడం రాష్ట్ర ప్రజల జీవనశైలిలో ఒక భాగమంటూ వ్యాఖ్యానించి ఈశాన్య రాష్ట్రాల్లో బీఫ్ తినడాన్ని బీజేపీ అడ్డుకోదన్న సందేశాన్ని ఇచ్చారు. మైనార్టీ వ్యతిరేక పార్టీ అని విపక్షాలు ప్రచారం చేసినప్పటికీ నాగాలాండ్‌లో 15% నుంచి 19 శాతానికి ఓటు షేర్‌ను పెంచుకోగలిగింది. మేఘాలయలో 9% ఓట్లను రాబట్టింది.

నాగాలో శాంతి మంత్రం..

నాగాలాండ్‌లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమం చేస్తున్న నాగాలతో శాంతి చర్చలు జరుపుతూ వారి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పడంలో బీజేపీ విజయం సాధించింది. మరోవైపు కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) పరిమితమైన సీట్లలో పోటీ చేశాయి. 60 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌పీఎఫ్ 22 స్థానాల్లో పోటీ చేస్తే, కాంగ్రెస్ 23 స్థానాల్లో పోటీకే పరిమితమైంది. నాగా సమస్యని ఎన్‌డీపీపీతో కలిసి సమష్టిగా పరిష్కరిస్తామని బీజేపీ ఇచ్చిన హామీలు తిరిగి ఆ కూటమి అధికారాన్ని నిలబెట్టుకునేలా చేశాయి.

అసోం నుంచి త్రిపుర వరకు

- 2016లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అసోం అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కాంగ్రెస్ 15 ఏళ్ల పరిపాలనకు తెర దించింది.
- 2017లో మణిపూర్‌లో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ మాజీ సభ్యుడు ఎన్. బైరాన్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు.
- 2018లో త్రిపుర ఎన్నికల్లో బీజేపీ 25ఏళ్ల లెఫ్ట్ పాలనకు తెరదించి అధికారంలోకి వచ్చింది
- అదే ఏడాది బీజేపీ మేఘాలయ, నాగాలాండ్‌లలో ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపి అధికారంలోకి వచ్చింది.
- 2019లో అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 41 స్థానాలను కైవశం చేసుకొని విజయ ఢంకా మోగించింది.
- 2021లో అసోంలో మళ్లీ అధికారాన్ని కాపాడుకుంది.
- 2022లో బీజేపీ మణిపూర్‌లో కూడా తిరిగి అధికారంలోకి వచ్చింది.
- 2023లో త్రిపుర, నాగాలాండ్‌లలో అధికారాన్ని నిలబెట్టుకుంది. మేఘాలయలో కూడా అధికారంలో భాగస్వామ్యం కావడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది.

అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల జరగడానికి ఏడాది ముందు ముఖ్యమంత్రుల్ని హఠాత్తుగా మార్చి పరిస్థితుల్ని అనుకూలంగా మార్చుకునే వ్యూహంలో బీజేపీ విజయం సాధిస్తోంది. త్రిపురలో కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి, తిప్రా మోథాలను దీటుగా ఎదుర్కొని అధికార వ్యతిరేకతను ఎదురొడ్డడానికి ముఖ్య కారణం నాలుగేళ్ల పాటు సీఎంగా ఉన్న విప్లవ్‌దేబ్‌ను పది నెలల క్రితం మార్చడమే. ఆయన స్థానంలో మిస్టర్ క్లీన్‌గా పేరున్న

పక్కా వ్యూహంతో సీఎంల మార్పు

మాణిక్ సాహాను సీఎంను చేయడంతో అధికార వ్యతిరేకత తుడిచిపెట్టుకుపోయింది. గతంలో ఉత్తరాఖండ్‌లో ఇద్దరు సీఎంలను, గుజరాత్‌లో సీఎంను మార్చి నెగ్గింది. హిమాచల్‌లోనూ సీఎంను మార్చాలని ఎన్నో గళాలు వినిపించినా జైరామ్ ఠాకూర్‌నే కొనసాగించి ఈ ఏడాది మొదట్లో జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైంది. చిన్న నియోజకవర్గాలున్న త్రిపురలో అభివృద్ధిని చేసి చూపించడంతో పాటు సీఎంను మార్చడం కూడా బీజేపీకి కలిసి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మోదీ ఈశాన్య రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండటం కూడా ఒక కారణం.

వాజ్‌పేయి హయాంలోనే అభివృద్ధికి బీజం

- 2016లో అసోంతో మొదలైన బీజేపీ జైత్రయాత్ర 2023 వచ్చినా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం వాజ్‌పేయి హయాంలో తొలి బీజం పడింది. కేంద్రంలో మంత్రులతో కమిటీని కూడా ఏర్పాటు చేసి కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అప్పుడు మొదలైన అభివృద్ధి పథం 2014లో నరేంద్ర మోదీ ప్రధాని మంత్రి అయ్యాక పరుగులు తీసింది. అభివృద్ధి కంటికి కనిపించేలా సాగింది.ప్రజల్లో మంచి పట్టు ఉన్న కాంగ్రెస్ నాయకుడు హిమాంత బిశ్వ శర్మ 2015లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి రావడంతో ఈశాన్య రాష్ట్రాల్లో కమలదళానికి పట్టు పెరిగింది. ప్రస్తుతం అసోం ముఖ్యమంత్రి అయిన శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటైన నార్త్ ఈస్ట్ డెమొక్రాటిక్ అలయెన్స్(ఎన్‌డీపీఏ)తో కాంగ్రెస్‌ను వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలన్నీ జత కట్టాయి. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నుంచే బిశ్వ శర్మ మూడు రాష్ట్రాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తూ తమకు అనుకూలంగా ఉండే చిన్న పార్టీలను ఎన్‌డీపీఏ గూటికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. డబుల్ ఇంజిన్ నినాదంతో బీజేపీ తనకు అనుకూలంగా ఉండే ప్రాంతీయ పార్టీలను కలుపుకొని పోతూ ఒక్కో రాష్ట్రంలో అధికారాన్ని కొల్లగొడుతూ వచ్చింది. ఎన్. బైరాన్ సింగ్, ప్రేమ ఖాండూ వంటి నాయకులు కాంగ్రెస్‌ను వీడడంతో ఆ పార్టీ ఉనికి కూడా కోల్పోసాగింది. ఎన్‌డీపీఏ కంటే ముందే ఆరెస్సెస్ ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన తండాల్లో పని చేస్తూ పట్టు పెంచుకోవడం బీజేపీకి కలిసి వచ్చింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

కొత్త శిఖరాలకు మన పర్యాటకం

- కావాల్సిందల్లా విభిన్న ఆలోచనలు, దీర్ఘకాలిక విజన్
- మారుమూల పల్లెలకూ పర్యాటక పటంలో చోటు
- దేశంలో టూరిజం అభివృద్ధికి ఎన్నెన్నో అవకాశాలు
- వెబినార్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: విభిన్నంగా ఆలోచించడం, దీర్ఘకాలిక దార్శనికత(విజన్) మన పర్యాటక రంగాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని వ్యాఖ్యానించారు. మన దేశంలోని మారుమూల గ్రామాలు సైతం ఇప్పుడు పర్యాటక పటంలో కొత్తగా చోటు సంపాదించుకుంటున్నాయని హర్షం వ్యక్తం చేశారు. 'మిషన్ మోడ్‌లో పర్యాటకాభివృద్ధి' పేరిట శుక్రవారం నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. భారత భాషల్లో, ఐక్యరాజ్యసమితి గుర్తించిన భాషల్లో మన పర్యాటక ప్రాంతాల సమాచారాన్ని అందించేలా అప్లికేషన్లు(యాప్‌లు) తయారు చేయాలని సూచించారు. టూరిస్ట్ సైట్ల వద్ద బహుళ భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

కలిసి పనిచేస్తే అనుకున్నది సాధ్యమే

'నూతన పని సంస్కృతి'తో మన దేశం ముందుకు సాగుతోందని నరేంద్ర మోదీ వివరించారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌కు ప్రజల నుంచి మంచి ప్రశంసలు దక్కాయని అన్నారు. బడ్జెట్ అనంతరం వెబినార్లు నిర్వహించడం గతంలో ఎప్పుడూ జరగలేదని గుర్తుచేశారు. ఆ ప్రక్రియకు ఈ ఏడాదే శ్రీకారం చుట్టామని చెప్పారు. బడ్జెట్‌కు ముందు, బడ్జెట్ తర్వాత కూడా ప్రజలందరినీ ఇందులో భాగస్వాములను చేస్తున్నామని, వారితో కలిసి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. వెబినార్లలో ప్రజల నుంచి ఎన్నో సలహాలు సూచనలు అందుతున్నాయని తెలిపారు. అందరం చేతులు కలిపి పనిచేస్తే అనుకున్న ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదని సూచించారు. మన పర్యాటకాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాలంటే దీర్ఘకాలిక ప్రణాళికతో పని చేయాలన్నారు. కోస్టల్ టూరిజం, బీచ్ టూరిజం, మాంగ్రూవ్ టూరిజం, హిమాలయన్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, వైల్డ్‌లైఫ్ టూరిజం, ఎకో–టూరిజం, హెరిటేజ్ టూరిజం, ఆధ్యాత్మిక టూరిజం, వెడ్డింగ్ డెస్టినేషన్స్, స్పోర్ట్స్ టూరిజం అభివృద్ధికి మన దేశంలో ఎన్నెన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

యాత్రలతో దేశ ఐక్యత బలోపేతం

మతపరమైన చరిత్రాత్మక ప్రాంతాలు, కట్టడాలకు సరికొత్త హంగులు అద్ది, పర్యాటకులకు అమితంగా ఆకర్షించవచ్చని ప్రధానమంత్రి వెల్లడించారు. వారణాసిలో కాశీ విశ్వనాథ్ ధామ్‌ను బ్రహ్మాండంగా తీర్చిదిద్దామని అన్నారు. గతంలో ఏడాదికి 80 లక్షల మంది పర్యాటకులు వారణాసికి వచ్చేవారని, గత ఏడాది 7 కోట్ల మందికిపైగా వచ్చారని తెలిపారు. పునర్నిర్మాణానికి ముందు కేదార్‌నాథ్‌కు ఏటా 5 లక్షల మంది వచ్చారని, ఇప్పుడు 15 లక్షల మంది సందర్శిస్తున్నారని పేర్కొన్నారు. టూరిజం అనేది సంపన్నులకు మాత్రమేనన్న అభిప్రాయం కొందరిలో ఉందని, అది సరైంది కాదని మోదీ చెప్పారు. మన దేశంలో యాత్రలు చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. చార్‌ధామ్ యాత్ర, ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర, 51 శక్తిపీఠాల యాత్రను ప్రధాని ప్రస్తావించారు.

లోటుపాట్లు సవరించుకోవాలి

విదేశీ యాత్రికులు భారత్‌కు క్యూ కడుతున్నారని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. వారు మన దేశంలో సగటున 1,700 డాలర్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అమెరికాలో విదేశీ యాత్రికుల సగటు వ్యయం 2,500 డాలర్లుగా, ఆస్ట్రేలియాలో 5,000 డాలర్లుగా ఉందన్నారు. అధికంగా ఖర్చు చేయడానికి సిద్ధపడే విదేశీయులకు మన దేశంలోని వసతులను పరిచయం చేయాలన్నారు. భారత్ అనగానే గుర్తొచ్చేలా కనీసం 50 పర్యాటక ప్రాంతాలను అద్భుతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ రంగంలో లోటుపాట్లను సరిదిద్దుకోవాలని చెప్పారు.

ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి భారత్‌తో కలిసి పని చేస్తాం

వాషింగ్టన్: జీ20 సదస్సు ఆతిథ్య దేశంగా భారత్ ప్రత్యేకమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అమెరికా అభిప్రాయపడింది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడానికి రష్యాతో తనకున్న చిరకాల సత్సంబంధాలను భారత్ వినియోగించుకోవాలని చెప్పింది. ఈ సంక్షోభాన్ని వీలైనంత త్వరగా ముగించడానికి తాము కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. జీ20 విదేశాంగ శాఖ మంత్రుల సమావేశం ఉక్రెయిన్ యుద్ధంపై ఏకాభిప్రాయానికి రావడంలో విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ విలేకరులతో మాట్లాడుతూ జీ20 సదస్సు ప్రారంభమయ్యే లోపు ఉక్రెయిన్ యుద్ధంపై ఒక పరిష్కార మార్గం దొరుకుతుందని ఆశిస్తున్నట్టుగా తెలిపారు. ఇందుకోసం విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత్ ఒక దారి చూపించిందని ఈ ఏడాది కాలంలో ఇంకా చేయాల్సింది చాలా ఉందని అన్నారు.

నోట్ల కట్టలు.. గుట్టలు గుట్టలు..



కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి అవినీతి బాగోతం


బెంగళూరు: ఒక కాంట్రాక్టర్ నుంచి రూ. 40 లక్షలు లంచం తీసుకుంటూ లోకాయుక్తకు అడ్డంగా దొరికిపోయారు బీజేపీ ఎమ్మెల్యే కె.మాడాళ్ విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్. లోకాయుక్త అధికారులు జరిపిన సోదాల్లో అతని ఇంట్లో గుట్టలుగా నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. రూ.6 కోట్లకు పైగా స్వాధీనం చేసుకున్నట్టు శుక్రవారం అధికారులు వెల్లడించారు. కర్ణాటకలోని దావణగెరె జిల్లా చెన్నగిరి ఎమ్మెల్యే మాడాళు విరూపక్షప్ప కుమారుడు ప్రశాంత్ బెంగళూరు నీటి సరఫరా, మురుగు నీటి బోర్డుకు చీఫ్ అకౌంటెంట్‌గా ఉన్నారు. మైసూర్ శాండల్ సబ్బులు తయారు చేసే ప్రభుత్వ అధీనంలోని కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఏల్)కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తన తండ్రి విరూపాక్షప్ప కార్యాలయంలోనే ఒక కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ గురువారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అక్కడికక్కడే ప్రశాంత్‌ను అరెస్ట్ చేసిన అధికారులు మూడు సంచుల్లో రూ1.7 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రశాంత్ నివాసంలో జరిపిన సోదాల్లో రూ.6 కోట్లకు పైగానగదును స్వాధీనం చేసుకున్నారు. ముడివస్తువుల కొనుగోలు టెండర్ ఇప్పిస్తామని చెప్పి తన తండ్రి తరఫున లంచంలో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ తీసుకుంటూ ఉండగా ప్రశాంత్‌ని అదుపులోకి తీసుకున్నట్టుగా లోకాయుక్త అధికారులు చెబుతున్నారు. ఎఫ్ఐఆర్‌లో కూడా నిందితుల్లో నంబర్ వన్‌గా ఎమ్మెల్యే విరూపాక్షప్ప పేరుని, ప్రశాంత్‌ని నంబర్ 2గా చేర్చారు. కర్ణాటక అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి లంచాల బాగోతం ఆ పార్టీని ఇరుకున పడేసింది. బీజేపీ ప్రభుత్వం 40% కమీషన్ తీసుకుంటోందని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని, ఈ ఘటనే దీనికి నిలువెత్తు నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ అన్నారు.

కేఎస్‌డీఎల్ చైర్మన్‌గా రాజీనామా

ఈ పరిణామాల మధ్య విరూపాక్షప్ప కేఎస్‌డీఎల్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైకి రాసిన రాజీనామా లేఖలో లోకాయుక్త దాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్టుగా ఆ లేఖలో స్పష్టం చేశారు. మరోవైపు పోలీసులకు దొరక్కుండా వెళ్లిపోయిన ఎమ్మెల్యే విరూపాక్షప్ప ముందస్తు బెయిల్‌కి దరఖాస్తు చేసుకున్నారు.

మంచు తుపానులో కాలిఫోర్నియా విలవిల

టోర్నడోల తాకిడితో టెక్సాస్, లూసియానాల్లో చీకట్లు



కాలిఫోర్నియాలో ఓ ఇంటి చుట్టూ గుట్టలుగా పేరుకుపోయిన మంచు

లాస్‌ఏంజెలిస్/డాలస్: అమెరికాలోని కాలిఫోర్నియాను వారం రోజులుగా భారీ మంచు తుపాను వణికిస్తోంది. కాలిఫోర్నియా, ఒరెగాన్‌లలో ఈ శతాబ్దంలోనే అత్యధికంగా ఏడడుగుల మేర మంచుకురిసింది. కొన్ని రిసార్టు ప్రాంతాల్లో 10 అడుగుల మేర మంచు పేరుకుపోయిందన్నారు. అనూహ్య మంచు తుపానుతో కాలిఫోర్నియాలోని శాన్ బెర్నార్డినో కొండ ప్రాంతాల్లో ప్రజలు అత్యవసరాలు, ఆహారం, మందులు, పాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ మంచుమయం కావడంతో బయటకు వచ్చే వీలులేకపోయింది. కొండప్రాంతాల నివాసితులు రోడ్లపైకి రావొద్దని హెచ్చరించారు. ఇళ్లు, వాహనాలు మంచు గుట్టల మధ్య కూరుకుపోయాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రెండిళ్లలో పేలుళ్లు సంభవించినట్లు, మంచు భారంతో ఇళ్లపైకప్పులు కూలినట్లు, కొన్ని ఇళ్లలో గ్యాస్ లీకేజీ జరిగినట్లు సమాచారం ఉందని సిబ్బంది తెలిపారు. అత్యవసర వైద్య సాయం అవసరమైన వారిని రెడ్‌క్రాస్ షెల్టర్‌కు తరలించారు. కరెంటు తీగలు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెవాడా సరిహద్దుల్లో ఉన్న సాక్రమెంటో, లేక్ టహో ప్రాంతాల్లో మంచుతుపాను శనివారం మరింత తీవ్ర మవుతుందని నిపుణులు హెచ్చరించారు. కాలిఫోర్నియాలోని 13 కౌంటీల్లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అయితే, మంచు తుపాను కారణంగా కాలిఫోర్నియా ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులు తొలిగినట్లేనని అధికారులు చెప్పారు.

పెనుగాలుల విధ్వంసం

టోర్నడో తుపాను దెబ్బకు టెక్సాస్, లూసియానాల్లో అంధకారం అలుముకుంది. టెక్సాస్‌లోని డాలస్, ఫోర్ట్ వర్త్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గంటకు 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. ప్రజలు ఇళ్లు వదిలి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. డాలస్‌లో భారీగా చెట్లు నేలకూలాయి. వాహనాలు పల్టీలు కొట్టాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయని పోలీసులు తెలిపారు. డాలస్-ఫోర్ట్‌వర్త్, డాలస్ లవ్ ఫీల్డ్ విమానాశ్రయాల్లో 400 విమానాలు రద్దయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో టెక్సాస్‌లోని సుమారు 3.40 లక్షల వినియోగదారులు గురువారం రాత్రి చీకట్లోనే గడిపారు. వాతావరణ విభాగం హెచ్చరికలతో డాలస్, ఫోర్ట్‌వర్త్ తదితర ప్రాంతాల్లో విద్యాసంస్థలను మూసివేశారు.

రణక్షేత్రంలో క్రీడా సరదా

గల్వాన్ లోయలో క్రికెట్ ఆడిన భారత జవాన్లు



న్యూఢిల్లీ: 2020 జూన్ 15. తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయ. భారత్, చైనా సరిహద్దులోని పెట్రోలింగ్ పాయింట్(పీపీ)–14. సరిగ్గా అక్కడే ఇరు దేశాల సైనికుల నడుమ భీకర స్థాయిలో ఘర్షణ జరిగింది. పదునైన ఆయుధాలతో చైనా జవాన్లు దాడి చేయగా, దెబ్బకు దెబ్బ అన్నట్లుగా భారత సైనికులు దీటుగా బదులిచ్చారు. ఈ కొట్లాటలో తమ జవాన్లు ఎంతమంది బలయ్యారో చైనా ప్రభుత్వం ఇప్పటికీ బయటపెట్టలేదు. 40 మందికిపైగానే చనిపోయి ఉంటారని అంచనా. భారత్ వైపు నుంచి దాదాపు 20 మంది చనిపోయారు. రణక్షేత్రంగా రక్తంతో తడిసిపోయిన పీపీ–14 ఇప్పుడు క్రికెట్ మైదానంగా మారింది. పటియాలా బ్రిగేడ్‌కు చెందిన త్రిశూల్ డివిజన్ క్రికెట్ పోటీ నిర్వహించింది. సైనికులు సరదాగా క్రికెట్ ఆడారు. పీపీ–14కు కేవలం 4 కిలోమీటర్ల దూరంలో ఈ పోటీ జరిగింది. జవాన్లు క్రికెట్ ఆడుతున్న ఫొటోలను భారత సైన్యం శుక్రవారం ట్విట్టర్‌లో పోస్టు చేసింది. గడ్డ కట్టించే తీవ్రమైన చలిలో పూర్తి ఉత్సాహంతో ఈ పోటీ జరిగిందని వెల్లడించింది. అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని ఉద్ఘాటించింది. జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా గురువారం ఢిల్లీలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. ఆ మరుసటి రోజే గల్వాన్‌లో భారత సైనికులు క్రికెట్ పోటీ నిర్వహించుకోవడం విశేషం.

ఉగ్రవాదంపై 'క్వాడ్' కార్యాచరణ బృందం

న్యూఢిల్లీ: ఆధునిక యుగంలో కొత్త రూపు సంతరించుకుంటున్న ఉగ్రవాదాన్ని, హింసాత్మక తీవ్రవాదాన్ని కఠినంగా అణచివేయడానికి చేపట్టాల్సిన చర్యల కోసం 'వర్కింగ్ గ్రూప్ ఆఫ్ కౌంటర్–టెర్రరిజం' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు 'క్వాడ్' దేశాల విదేశాంగ మంత్రులు ప్రకటించారు. 'క్వాడ్' కూటమిలో భాగమైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులు ఎస్.జైశంకర్, ఆంటోనీ బ్లింకెన్, యోషిమస హయషీ, పెన్నీ వాంగ్ శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ప్రపంచమంతటా ఉగ్రవాద భూతం విస్తరిస్తుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్ర మూకల ఆటకట్టించడానికి నాలుగు దేశాల కార్యాచరణ బృందం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ వాణిజ్యానికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, శాంతియుతంగా వివాదాల పరిష్కారానికి మద్దతు కొనసాగుతుందని తేల్చిచెప్పారు. జీ7 కూటమికి జపాన్, జీ20 కూటమికి భారత్ సారథ్యం వహిస్తుండడంతోపాటు ఈ ఏడాది ఆసియా–పసిఫిక్ ఎకనామిక్ కో–ఆపరేషన్(ఏపీఈసీ)కి అమెరికా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో 'క్వాడ్' అజెండా అమలు కోసం సన్నిహితంగా కలిసి పనిచేయాలని తీర్మానించుకున్నట్లు వివరించారు. అనంతరం క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు ఢిల్లీలో 'రైజినా డైలాగ్'లో పాల్గొన్నారు.

భారత ప్రజాస్వామ్యంపై దాడి

- నాతోపాటు విపక్ష నాయకులపై 'పెగాసస్'తో నిఘా
- పార్లమెంట్, మీడియా, న్యాయ వ్యవస్థపై నిర్బంధం
- కేంబ్రిడ్జి యూనివర్సిటీలో రాహుల్ గాంధీ
- విదేశీ గడ్డపై దేశ ప్రతిష్టను దెబ్బతీయడం దారుణం
- రాహుల్‌పై బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ మండిపాటు



లండన్/న్యూఢిల్లీ: భారతదేశంలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో తనతోపాటు పలువురు రాజకీయ నాయకులు నిఘా నీడలో ఉంటున్నారని చెప్పారు. యూకేలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ జడ్జి బిజినెస్ స్కూల్ 'విజిటింగ్ ఫెలో' అయిన రాహుల్ గాంధీ గురువారం సాయంత్రం వర్సిటీలో 'లెర్నింగ్ టు లిజనింగ్ ఇన్ ద 21 సెంచరీ' పేరిట నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. రాహుల్ ప్రసంగం వీడియోను కాంగ్రెస్ నాయకుడు శామ్ పిట్రోడా ట్విట్టర్‌లో షేర్ చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్‌తో ప్రతిపక్ష నేతలపై ప్రభుత్వం నిఘా పెడుతోందని మండిపడ్డారు. తనతోపాటు చాలామంది నాయకుల ఫోన్లలో ఈ స్పైవేర్‌ను ఇన్‌స్టాల్ చేశారని ఆరోపించారు. నిఘా విభాగం అధికారులు ఈ విషయం స్వయంగా తనతో చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఫోన్లలో మాట్లాడేదంతా రికార్డు చేస్తున్నామని, అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారని అన్నారు. ప్రతిపక్ష నాయకులపై ప్రభుత్వం నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉందని దుయ్యబట్టారు.

ప్రశ్నిస్తే గొంతు నులిమేస్తున్నారు

భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, ఇందులో ఐదు కీలక అంశాలు ఉన్నాయని రాహుల్ గాంధీ వెల్లడించారు. అవి.. మీడియా, న్యాయ వ్యవస్థను చెరబట్టడం, నచ్చని వారిపై నిఘా పెట్టడం, బెదిరింపులకు గురిచేయడం, చట్టాలను అమలు చేయాల్సిన సంస్థల ద్వారా ప్రత్యర్థులను అణచివేయడం, మైనార్టీలు, దళితులు, గిరిజనులకు దాడులు, అసమ్మతి తెలియజేస్తే గొంతులు నొక్కేయడం. భారత ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందన్న నిజం ప్రతి ఒక్కరికీ తెలుసని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్దేశించిన పార్లమెంట్, స్వేచ్ఛాయుత మీడియా, న్యాయ వ్యవస్థపై ఇప్పుడు నిర్బంధం కొనసాగుతోందని ఆరోపించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మూల నిర్మాణాన్ని దెబ్బతీస్తున్నారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే గొంతు నులిమేస్తున్నారని మోదీ సర్కారుపై నిప్పులు చెరిగారు.

దేశంపై విషం చిమ్మడమే రాహుల్ పని: అనురాగ్ ఠాకూర్

కేంబ్రిడ్జి వర్సిటీలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం ఏమిటని నిలదీశారు. రాహుల్‌తోపాటు విపక్ష నేతల ఫోన్లలో పెగాసస్ స్పైవేర్ నిజంగా ఉంటే.. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీకి పరీక్ష కోసం ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీకి ఉన్న విద్వేషాన్ని అర్థం చేసుకోగలమని.. కానీ, దేశ ప్రతిష్టకు మరకలు అంటించేలా మాట్లాడడం దారుణమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుండడంతో రాహుల్ గాంధీకి దిక్కుతోచడం లేదని, అందుకే విదేశాలకు వెళ్లి మన దేశంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

దేశ విభజనతో విడిపోయిన కుటుంబాన్ని.. 75 ఏళ్లకు ఫేస్‌బుక్ ఒక్కటి చేసింది..!

లాహోర్: 1947లో దేశ విభజనతో వేరు పడిన ఇద్దరు సిక్కు సోదరుల కుటుంబాలు 75 ఏళ్ల తర్వాత సోషల్ మీడియా సాయంతో ఎట్టకేలకు కలుసుకున్నాయి. కర్తార్‌పూర్ కారిడార్ వద్ద వీరి కుటుంబసభ్యులు ఆనందంతో పాటలు పాడుతూ ఒకరిపై ఒకరు పూలు చల్లుకున్నారు. గురువారం గురుదేవ్ సింగ్, దయాసింగ్ కుటుంబాల కలయికతో గురుద్వారా దర్బార్ సాహిబ్, కర్తార్‌పూర్ సాహిబ్‌ల వద్ద ఉద్విగ్నపూరిత వాతావరణం ఏర్పడింది. హరియాణా రాష్ట్రం మహేంద్రగఢ్ జిల్లా గోమ్లా గ్రామానికి చెందిన ఈ సోదరులు తమ తండ్రి స్నేహితుడైన కరీం బక్ష్‌తో కలిసి నివసించేవారు. దేశ విభజనతో కరీం బక్ష్ వీరిలో గురుదేవ్‌ను తన వెంట పాకిస్తాన్‌కు తీసుకెళ్లగా గోమ్లాలోనే మేనమామ వద్దే దయాసింగ్ ఉండిపోయారు. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ఝాంగ్ జిల్లాలో నివాసం ఏర్పరుచుకున్న కరీంబక్ష్ గురుదేవ్ పేరును గులాం మహ్మద్‌గా మార్చాడు. గురుదేవ్ కొన్నేళ్ల క్రితం చనిపోయారు. తన సోదరుడు దయాసింగ్ ఎక్కడున్నారో జాడ తెలపాలంటూ గురుదేవ్ భారత ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాశారని ఆయన కొడుకు మహ్మద్ షరీఫ్ తెలిపారు. ఎట్టకేలకు ఫేస్‌బుక్ ద్వారా ఆరు నెలల క్రితం తమ అంకుల్ దయాసింగ్ జాడ కనుక్కోగలిగామన్నారు. కర్తార్‌పూర్ సాహిబ్ వద్ద ఇరువురు కుటుంబాలు కలుసుకోవాలని నిశ్చయించుకున్నట్లు చెప్పారు. వీసా మంజూరు చేసి హరియాణాలోని తమ పూర్వీకుల నివాసాన్ని చూసుకునే అవకాశం కల్పించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు కిలోమీటర్ల పొడవైన కర్తార్‌పూర్ కారిడార్‌తో భారతీయ సిక్కు యాత్రికులు పాక్ వైపు ఉన్న పవిత్ర దర్బార్ సాహిబ్ గురుద్వారాను వీసాతో అవసరం లేకుండా దర్శించుకునే అవకాశం ఉంది. కాగా, సోషల్ మీడియా సాయంతో భారత్, పాక్‌ల్లో ఉంటున్న సిద్దిక్(80), హబీబ్(78) అనే సోదరులు కూడా గత ఏడాది జనవరిలో కర్తార్‌పూర్ కారిడార్‌లో కలుసుకున్న విషయం తెలిసిందే.



జీఐఎస్ @ పారిశ్రామిక దిగ్గజాలు

భోగాపురంతో ఆర్థిక వైభవం


– జీఎం రావు, చైర్మన్, జీఎంఆర్ గ్రూప్



రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో జీఎంఆర్ భాగస్వామి అవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఎయిర్‌పోర్టులు కేవలం ప్రయాణానికే కాకుండా ఆయా రాష్ట్రాల ఆర్థికాభివృద్ధిని మార్చే శక్తి ఉంది. హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, ఢిల్లీ బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు దీనికి నిదర్శనం. ఢిల్లీ ఎయిర్‌పోర్టు ఆ రాష్ట్ర జీడీపీలో 18 శాతం వాటా కలిగి ఉంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నగర రూపురేఖలనే మార్చేసింది. అదే తరహాలో భోగాపురం ఎయిర్‌పోర్టు సిటీ కూడా విశాఖతో పాటు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మారుస్తుంది. తొలిదశలో రూ.5,000 కోట్లతో ఏటా 60 లక్షల మంది ప్రయాణించే విధంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. రానున్న కాలంలో దీన్ని నాలుగు కోట్లకు తీసుకెళ్తాం. రాష్ట్రంలో అపార సహజ వనరులు, మౌలిక వసతులున్నాయి. వీటిని వినియోగించుకుంటూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. నేను పుట్టిన నేలకు దగ్గరగా ఇంతమంది పారిశ్రామిక దిగ్గజాలు రావడం చాలా ఆనందంగా ఉంది.

విద్యపై రూ.1.12 లక్షల కోట్లు వెచ్చిస్తున్న ఏకైక రాష్ట్రం

– బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఫౌండర్ చైర్మన్, సైయెంట్



విద్యారంగానికి దేశంలోనే అత్యధిక బడ్జెట్ కేటాయిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటే. అందరికీ చదువు అందాలన్న సత్సంకల్పంతో సీఎం జగన్ బడ్జెట్‌లో రూ.1.12 లక్షల కోట్లు విద్యారంగానికి కేటాయించారు. మనబడి నాడు నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, 8వ తరగతి నుంచి ఉచితంగా ట్యాబ్స్ పంపిణీ, జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా చదువులను ప్రోత్సహిస్తున్నారు. సాంకేతిక విద్యలో నాణ్యత పెంచే విధంగా సిలబస్‌లో మార్పులు చేస్తూ ఏపీని ప్రపంచ మానవ వనరుల హబ్‌గా తీర్చిదిద్దాలి. 60 శాతం ఉద్యోగాలు పారిశ్రామికవేత్తల ద్వారా లభిస్తున్నందున రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కోరుతున్నా.

టీకాల రంగంలో అపార అవకాశాలు

– కృష్ణ ఎల్లా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, భారత్ బయోటెక్



ఫార్మా రంగంలో విశాఖ, నెల్లూరు ప్రాంతాలు ఇప్పటికే బాగా అభివృద్ధి చెందాయి. ఫార్మా రంగంలో ఇంటర్మీడియట్స్ కోసం చైనాపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలో తయారీ పార్క్‌ను నెలకొల్పాలని కోరుతున్నా. యానిమల్, ఆక్వా వ్యాక్సినేషన్ల రంగాల్లో అపార అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో పెట్టుబడులు కొనసాగిస్తాం

– పునీత్ దాల్మియా, ఎండీ, దాల్మియా భారత్ గ్రూప్



దేశవ్యాప్తంగా 40 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాం. 15 ఏళ్ల క్రితం దివంగత వైఎస్ఆర్ చొరవతో కడపలో మా కార్యక్రమాలు మొదలు పెట్టాం. సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం. రాష్ట్రంలో పెట్టుబడులు కొనసాగిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో లభిస్తున్న మద్దతుపై సంతోషంగా ఉన్నాం. రాష్ట్రం మౌలిక వసతుల కల్పనలో వేగంగా దూసుకుపోతోంది. జీఐఎస్ సదస్సుకు పెద్ద ఎత్తున కార్పొరేట్ ప్రముఖులు తరలి వచ్చారు. ఈ సమావేశం తర్వాత జే ఫర్ జగన్‌కు అదనంగా జే ఫర్ జోష్ అని చేర్చాలి.

గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట

– సుమంత్ సిన్హా, సీఎండీ, రెన్యూ ఎనర్జీ



పర్యావరణ హిత ఇంధన ఉత్పత్తికి ముఖ్యమంత్రి జగన్ పెద్ద పీట వేస్తున్నారు. రాష్ట్రంలో సోలార్, విండ్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నారు. రెన్యువబుల్ ఎనర్జీలో అత్యుత్తమ మౌలిక వసతులు కలిగిన రాష్ట్రంగా ఏపీ అవార్డులు దక్కించుకుంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.80,000 కోట్ల పెట్టుబడులు పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. వచ్చే ఐదేళ్లలో గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్, సోలార్ రంగాల్లో పెట్టుబడులను పెంచుతాం.

పర్యాటక రంగంలో అపార అవకాశాలు


– అర్జున్ ఒబెరాయ్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఒబెరాయ్ గ్రూప్



ఏపీ పర్యాటక పాలసీ చాలా బాగుంది. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో పర్యాటక రంగంలో రాష్ట్రం వేగంగా వృద్ధి చెందుతోంది. దేశ జీడీపీలో 10.3 శాతం వాటా కలిగిన పర్యాటక రంగం ప్రత్యక్షంగా పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తోంది. పర్యాటక రంగంలో రాష్ట్రంతో కలిసి పనిచేసే విధంగా రూ.1,350 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నాం.

భారీ పెట్టుబడులు పెడుతున్నాం

– కరణ్ అదానీ, సీఈవో, అదానీ పోర్ట్స్ – సెజ్ లిమిటెడ్



ఏపీ మౌలిక వసతుల కల్పన, తయారీ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది.రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. అదానీ గ్రూపు రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఇప్పటికే రూ.20,000 కోట్లకుపైగా పెట్టుబడులను పెట్టింది. వీటి ద్వారా ప్రత్యక్షంగా 18,000 మందికి, పరోక్షంగా 54,000 మందికి ఉపాధి లభిస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధిలో భాగంగా గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్లో పెట్టుబడులు పెట్టాం. ప్రస్తుతం ఈ రెండు పోర్టుల నిర్వహణ సామర్థ్యం 100 మిలియన్ టన్నులు ఉండగా దీన్ని వచ్చే ఐదేళ్లలో 200 మిలియన్ టన్నులకు పెంచనున్నాం. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో 15,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి యూనిట్లను నెలకొల్పేలా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నాం. నడికుడి, కడపలో ఉన్న అంబుజా, ఏసీసీ సిమెంట్ యూనిట్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 మిలియన్ టన్నులకు పెంచనున్నాం. విశాఖపట్నంలో 400 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం.

అపార వనరులు.. యువ నాయకుడు

విశాఖ జీఐఎస్‌లో రిలయన్స్ గ్రూపు అధినేత ముఖేష్ అంబానీ

- ప్రధాని మోదీ నాయకత్వ పటిమ.. సీఎం జగన్ దార్శనికత భేష్
- రాష్ట్రంలో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ నెలకొల్పుతాం
- కేజీ బేసిన్‌లో రూ.1,50,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం
- భవిష్యత్తులో దేశ సహజ వాయువు ఉత్పత్తిలో 30% కేజీ డి–6 నుంచే..
- సహజ వనరులు, నిపుణులు, పారిశ్రామికవేత్తలకు ఏపీ పుట్టినిల్లు



ఒప్పంద పత్రాలతో సీఎం జగన్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ. చిత్రంలో మంత్రులు పెద్దిరెడ్డి, గుడివాడ, ఉన్నతాధికారి విజయానంద్

(విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి, ప్రతినిధి)

దక్షిణాది రాష్ట్రాల్లో పెట్టుబడుల సదస్సుకు ఎన్నడూ హాజరు కాని రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముఖేష్ అంబానీ విశాఖ వేదికగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో పాల్గొనడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. ఈ సదస్సు కోసం 5 గంటలకు పైగా సమయాన్ని ప్రత్యేకంగా కేటాయించడమే కాకుండా రాష్ట్రంలోని అపార వనరులు, సీఎం వైఎస్ జగన్ పాలన దక్షత, యువ నాయకత్వాన్ని కొనియాడుతూ ప్రసంగించారు. అపార వనరులు కలిగి ఉండటం ఒక వరమని, ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టిన తాము భవిష్యత్తులో కూడా అదే బంధాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. జీఐఎస్ సదస్సులో ముఖేష్ అంబానీ ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే...

- బ్లూ ఎకానమీ (సముద్ర వాణిజ్యం)లో సాగరమంత అవకాశాలను కల్పిస్తూ రాష్ట్రం స్వాగత ద్వారాలు తెరిచింది. రెన్యువబుల్ ఓషన్ ఎనర్జీ, సముద్ర ఖనిజాలు, మెరైన్ బయోటెక్నాలజీ రంగాల్లో చాలా అవకాశాలున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ పటిమతో దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా, ఎంత వేగంగా విస్తరిస్తోందో అదేవిధంగా సీఎం వైఎస్ జగన్ యువ నాయకత్వం, దార్శనికతతో వృద్ధి రేటు, సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన రాష్ట్ర యువత, అధికారులకు శుభాకాంక్షలు. నూతన భారత దేశ వృద్ధిలో ఏపీ ముందుండి నడిపిస్తుందన్న నమ్మకం ఇక్కడ యువత, వ్యాపారవేత్తల్లో ధృడంగా కనిపిస్తోంది.

- ఆంధ్రప్రదేశ్‌లోని అపార అవకాశాలను గుర్తించి చమురు, గ్యాస్ రంగంలో 2002లో అడుగుపెట్టాం. రూ.1,50,000 కోట్లకుపైగా పెట్టుబడులను కేజీ డి–6 అసెట్స్‌పై పెట్టాం. భవిష్యత్తులో దేశ సహజవాయువు ఉత్పత్తిలో 30% కేజీ డి–6 నుంచే వస్తుంది. దేశంలో ఆంధ్రప్రదేశ్ ఎంత కీలకమో చెప్పేందుకు ఇదే నిదర్శనం. జియో సేవలకు సంబంధించి రాష్ట్రంలో టెలికాం విస్తరణ కోసం రూ.40,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఆంధ్రప్రదేశ్ జనాభాలో 98 శాతం 4జీ నెట్‌వర్క్ కవర్ చేసింది. ఇప్పుడు ట్రూ 5జీ సేవలను 2023 చివరి నాటికల్లా మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరిస్తాం. 5జీ రాకతో రాష్ట్రంలో డిజిటల్ విప్లవం అన్ని రంగాల్లో వృద్ధికి దోహదం చేస్తుంది. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు రానున్నాయి.

- ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా సారవంతమైన భూములు, సహజ వనరులు, నైపుణ్యం, విశిష్ట సంస్కృతి ఉన్నాయి. విశాఖలో అందమైన బీచ్‌లున్నాయి. అధిక ఆదాయాన్ని అందించే కృష్ణా, గోదావరి నదుల మధ్య మంచి భూములున్నాయి. విజయనగరం సామ్రాజ్యం నుంచి తిరుమల వరకు ఎంతో చారిత్రక ప్రదేశాలున్నాయి. ఇవన్నీ వినియోగించుకుంటూ ఆధునిక కాలంలో ఆంధ్రప్రదేశ్ ఎన్నో అద్భుతాలను సృష్టిస్తోంది. ఇన్‌ఫ్రా, ఫార్మా రంగంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికవేత్తలు గణనీయమైన శక్తి కలిగి ఉన్నారు. అంతర్జాతీయంగా పేరొందిన సైంటిస్టులు, ఇంజనీర్లు, డాక్టర్లు, వృత్తి నిపుణులు పలువురు ఏపీకి చెందిన వారే. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో మంచి నైపుణ్యంతో వివిధ నాయకత్వ హోదాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారున్నారు.

- రిలయన్స్ రిటైల్ ద్వారా భారీగా విస్తరించాం. రాష్ట్రంలో 1.20 లక్షల మంది కిరాణా వ్యాపారులతో ఒప్పందం చేసుకున్నాం. 6,000 గ్రామాల్లో రిలయన్స్ రిటైల్ సేవలను అందిస్తోంది. రాష్ట్రంలో 20,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధితోపాటు లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాం. రైతులు, హస్తకళాకారుల ఉత్పత్తులను విక్రయిస్తూ నేరుగా 50,000 కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాం. రిలయన్స్ ఫౌండేషన్ విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో కృషి చేస్తోంది. గ్రామీణ సామాజిక కేంద్రాల్లో రిలయన్స్ భాగస్వామి కానుంది. భవిష్యత్తులో కూడా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలతో ఇదే విధమైన బంధాన్ని కొనసాగిస్తామని హామీ ఇస్తున్నా. రాష్ట్ర వృద్ధి రేటులో రిలయన్స్ భాగస్వామిగా ఉంటుంది. మాకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తూ ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అధికారులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. ఈ సదస్సు విజయవంతమై రాష్ట్రాభివృద్ధిలో నూతన అధ్యాయాన్ని సృష్టించాలని కోరుకుంటున్నా.



అభివృద్ధిలో భాగస్వాములవుతాం

సీఎం జగన్ సారథ్యంలో అభివృద్ధి పరుగులు.. జీఐఎస్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తల ప్రశంసలు

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయిస్తూ ఉపాధి కల్పనే లక్ష్యంగా విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 ఊహకు మించి అద్భుతంగా ఆరంభమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న సదస్సుకు అనూహ్య స్పందన లభించింది. పలువురు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఇందులో పాల్గొనడం హైలెట్‌గా నిలిచింది. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో ఏ ఒక్క పెట్టుబడుల సదస్సుకు హాజరుకాని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ 15 మంది బోర్డు డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్లతో కలసి విశాఖ సమ్మిట్‌లో పాల్గొనడం విశేషం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డైనమిక్ లీడర్‌షిప్‌పై ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు ప్రశంసల జల్లు కురిపించారు. రాష్ట్రాభివృద్ధిలో తాము కూడా భాగస్వాములవుతామని ప్రకటించారు. పెట్టుబడులకు స్వర్గధామం లాంటి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు.

– సాక్షి, విశాఖపట్నం

ఆరోగ్య రంగం అద్భుతం..

– ప్రీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్‌పర్సన్



సమృద్ధి అంటే మనం చూస్తున్నట్లుగా ప్రజల శ్రేయస్సు పరిపూర్ణంగా కనిపించడం. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని ఈ భూమి తల్లి కుమార్తెగా చెబుతున్నా. వైద్యారోగ్య రంగంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు నిజంగా ప్రశంసనీయం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం ఇతర దేశాలకూ విస్తరించింది. ఆ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ మరింత విస్తరింపజేశారు. ఆరోగ్యశ్రీ ఆఫ్రికాలోనూ అమలవుతుండటం గర్వకారణం. ఏపీ ప్రభుత్వంతో అపోలో గ్రూప్స్ భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉంది. అపోలో కార్యకలాపాలకు సీఎం జగన్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. మనమంతా చూస్తున్నట్లుగా ఏపీవైపు అన్ని పరిశ్రమలు కలసి వస్తున్నాయి. రాష్ట్రంలో అత్యుత్తమ ఆరోగ్య ప్రమాణాలు అందించేందుకు ఒక కుటుంబంగా సహకరిస్తామని హామీ ఇస్తున్నా.

రూ.5 వేల కోట్ల పెట్టుబడులు

– హరిమోహన్ బంగూర్, శ్రీ సిమెంట్



జీఎస్‌డీపీలో 11.43 శాతంతో అగ్రభాగంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ దేశ జీడీపీలో 5 శాతం వాటా సాధించినందుకు అభినందనలు తెలియచేస్తున్నా. సీఎం జగన్ కృషితో విద్య, సామాజిక, ఇంజనీరింగ్ రంగాల్లో పరిశ్రమల్ని ఆకర్షించే అద్భుతమైన వనరులున్న రాష్ట్రంగా ఏపీ అడుగులు వేస్తోంది. మౌలిక సదుపాయాలతో పాటు మానవ వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్న రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్ది పారిశ్రామిక వర్గాల్ని ఆకర్షిస్తున్నారు. దాదాపు 50 మిలియన్ టన్నుల సామర్థ్యంతో శ్రీసిమెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. 55 శాతం గ్రీన్ ఎనర్జీ వినియోగిస్తూ దేశంలోని సిమెంట్ ప్రాజెక్టుల్లో నంబర్ వన్‌గా ఉన్నాం. ప్లాంట్‌లు మరిన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. మా సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతంగా భావిస్తున్నాం. రూ.3,000 కోట్లతో గుంటూరులో దేశంలోనే మొదటి గ్రీన్ సిమెంట్ ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టి 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.1,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాం.

ప్రభుత్వ సహకారంతో 18 నెలల్లోనే పూర్తి

– సుమిత్ బిదానీ, కెనాఫ్ సంస్థ సీఈవో



పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పేందుకు మేమే నిదర్శనం. శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు 2019లో ఒప్పందం కుదుర్చుకున్నాం. దేశంలోనే అతిపెద్ద ప్లాంట్‌గా 40 మిలియన్ డాలర్ల ప్రాథమిక పెట్టుబడితో 24 ఎకరాల్లో నిర్మించాం. 200 మందికి నేరుగా ఉపాధి కల్పించాం. సీఎం జగన్ సహకారం, ప్రోత్సాహంతో పెట్టుబడుల ఒప్పందం జరిగిన 18 నెలల్లోనూ మా ప్రాజెక్టుని పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాం. ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని అనుమతుల్ని తేలికగా పొందాం. శ్రీసిటీలో విద్యుత్ సరఫరా చాలా అద్భుతంగా ఉంది. ముడిపదార్థాలు, ఇతర వస్తువుల్ని దిగుమతి చేసుకునేందుకు పలు పోర్టులు 100 కి.మీ. లోపు ఉండటం, బహుళ రహదారుల అనుసంధాన వ్యవస్థ కూడా ఉపయోగపడుతోంది. రాష్ట్రంలో రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్ సౌకర్యం ఎంతో మెరుగ్గా ఉన్నాయి. ఇన్వెస్టర్స్ సమ్మిట్ పారిశ్రామికవేత్తలకు బాగా ఉపయోగపడుతుంది.

భవిష్యత్తు విస్తరణ ఏపీలోనే

– సజ్జన్ భజాంకా, సెంచురీ ప్లై చైర్మన్



ఏపీలో 14 నెలల క్రితం మా కలల ప్రయాణం ప్రారంభమైంది. సీఎం జగన్‌ను మొదటిసారి కలసినప్పుడు మా ప్లాంట్ ఎలా ఎస్టాబ్లిష్ చేయాలనే ఆలోచనతో వెళ్లాం. ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఏ మోడల్స్ ఉత్పత్తి చేయాలి? నోడల్ ఆఫీసర్లు ఎవరు..? ఇలా అన్నీ ఒక్క మీటింగ్‌లోనే డిసైడ్ అయిపోయాయి. అన్నీ కుదిరితే 2024 కల్లా ప్లాంట్‌లో ఉత్పత్తులు ప్రారంభించగలమని అనుకున్నాం. సీఎం ప్రోత్సాహంతో కేవలం రెండేళ్లలోనే 2021 డిసెంబర్‌లో ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. ఏపీలో మా ప్రయాణం చాలా సౌకర్యవంతంగా, సులభంగా మారింది. ఇక్కడ వాతావరణం చూసిన తర్వాత ఇది మా రాష్ట్రం, మా ప్రాంతం అనే భావనకు వచ్చేశాం. ప్రతి ఒక్క అధికారి, రాజకీయ ప్రతినిధులు పూర్తి సహకారం అందిస్తున్నారు. మరో రెండు ప్లాంట్ల పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. ఏపీని మా ఫస్ట్ చాయిస్‌గా మార్చేశారు.

రూ.10 వేల కోట్లకు కియా పెట్టుబడులు

– కబ్ డాంగ్‌లీ, కియా మోటర్స్



రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ ప్లాంట్ నిర్మించాం. పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతు మరువలేనిది. ఇండియన్ ఆటోమొబైల్ రంగంలో కియా ఇండియా లీడింగ్ కంపెనీగా మారడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో ఉంది. 2023 చివరి నాటికల్లా ఈవీ–6 తయారు చేస్తాం. ఏపీలో 2027 నాటికల్లా కియా పెట్టుబడులు రూ.10 వేల కోట్లకు చేరుకోనున్నాయి. నిరంతర విద్యుత్, స్కిల్డ్ మానవ వనరులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కనెక్టివిటీ అందించారు. కోవిడ్ సమయంలో మా ఉద్యోగులు, ముడి సరుకులను తరలించడంలో సీఎం జగన్ ప్రభుత్వం అందించిన సహకారానికి కృతజ్ఞతలు. రాష్ట్రంలోని సుదీర్ఘ తీరం వెంట పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాల్ని వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలను కోరుతున్నా.

ప్రభుత్వ సహకారానికి సాహో

– మసహిరో యమగుచీ, టోరే ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ ఎండీ



శ్రీసిటీలో ప్లాంట్ ఏర్పాటు సమయంలో సీఎం జగన్ సహకారం మరువలేనిది. అనుమతులన్నీ అతి తక్కువ సమయంలోనే మంజూరు చేశారు. ఫస్ట్ ఫేజ్‌లో 2019లోనే ఉత్పత్తులు ప్రారంభించాం. రెండో ఫేజ్‌లో రూ.200 కోట్ల పెట్టుబడులతో ప్లాంట్‌ను అభివృద్ధి చేసి ఉత్పత్తుల్ని ఈ ఏడాది మొదలు పెట్టాం. ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయో, నానో టెక్నాలజీ, పాలిమర్ కెమిస్ట్రీ కోర్ టెక్నాలజీతో ప్రారంభిస్తున్నాం. శ్రీసిటీలో హైక్వాలిటీ ఉత్పత్తులు ఉత్పత్తి చేస్తున్నాం. 132 కేవీ విద్యుత్ లైన్ని ప్రత్యేకంగా మాకోసం అందించారు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ అద్భుతంగా అమలు చేస్తున్నారు.

స్టార్టప్, గ్రీన్ ఎనర్జీపై ఆసక్తి..

– మార్టిన్ ఎబర్‌హార్డ్, టెస్లా కో ఫౌండర్



టెస్లా ప్రారంభించినప్పుడు ఎవరికీ ఎలక్ట్రిక్ కార్లు తయారు చేస్తారనే ఆలోచన లేదు. ఈ రోజు ప్రతి దిగ్గజ కార్ల కంపెనీకి ఈవీ కార్ల గురించి తెలుసు. ప్రపంచవ్యాప్తంగా ఈవీ స్టార్టప్ కంపెనీలకు గొప్ప ఎకో సిస్టమ్ ఉంది. ఏపీలో స్టార్టప్స్‌తో పాటు గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో సదస్సుకు హాజరయ్యా. ఈవీ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా మొదలైంది. గ్రీన్ రివల్యూషన్‌కి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక్కడికి వచ్చిన ప్రతి స్టార్టప్ కంపెనీ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు ఒక్కటే చెబుతున్నా.. ఓడిపోయామని వదలొద్దు.. విజయం సాధించే వరకూ అడుగులు వేస్తూనే ఉండాలి.

విజనరీ సీఎం నేతృత్వంలో ముందడుగు

– నవీన్ జిందాల్, జేఎస్‌పీఎల్ గ్రూప్ చైర్మన్



రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములుగా మారుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇన్‌ఫ్రా బేస్, వ్యాపార అనుకూల వాతావరణానికి రాష్ట్రం అనుకూలమైంది. విజనరీ లీడర్ షిప్‌తో ప్రోగ్రెసివ్ పాలసీ, పారిశ్రామిక అభివృద్ధి పాలసీ, ఇండస్ట్రీస్ ఎకోసిస్టమ్, పెట్టుబడిదారులకు అనుకూలమైన సింగిల్ విండో విధానాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. జిందాల్ గ్రూప్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోంది. పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల్లోనూ వృద్ధిలోనూ ఏపీ ముందడుగు వేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 140 మెగావాట్ల యూనిట్ల ఉత్పత్తి ప్రాజెక్టుని ప్రారంభిస్తున్నాం. కృష్ణపట్నం సమీపంలో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 10 వేల మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేలా స్టీల్‌ప్లాంట్‌కు ఇటీవలే భూమి పూజ చేశాం. ఏపీకి యంగ్, డైనమిక్ లీడర్ వైఎస్ జగన్ సీఎంగా ఉన్నారు. సీమపురి ఎనర్జీ ప్లాంట్ నుంచి 6 నెలల్లో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి అందించనున్నాం. కడప స్టీల్‌ప్లాంట్‌కు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ శంకుస్థాపన చేసింది. సోలార్, హైడ్రో, విండ్ పవర్, సిమెంట్ ప్రాజెక్టు ఎంవోయూలు కూడా ఏపీ ప్రభుత్వంతో చేసుకున్నాం. సమృద్ధిగా వనరులు, అపార అవకాశాలతో ఏపీ స్వర్గధామంలా ఉంది. సీఎం జగన్ నిరంతర శ్రమకు నిదర్శనంగా దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా జీడీపీ వృద్ధి రేటులో ఏపీ అగ్రగామిగా ఉండటం శుభపరిణామం.

అపార వనరులున్న రాష్ట్రమిది

– బుగ్గన రాజేంద్రనాథ్, ఆర్థిక శాఖ మంత్రి



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ అగ్రగామిగా ఉంది. సహజ వనరులు పుష్కలంగా ఉన్న రాష్ట్రమిది. వివిధ రంగాల్లో లాజిస్టిక్స్ అద్భుతంగా ఉన్నాయి. నైపుణ్యం కలిగిన మానవ వనరులకు ఆంధ్రప్రదేశ్‌లో కొదవలేదు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు అద్భుత అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాపార, వాణిజ్య రంగాలపై మంచి దార్శనికతతో ఉన్నారు. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నాం.

వేగంగా అనుమతులు..

– అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమల మంత్రి



రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలకు పుష్కల అవకాశా లున్నాయి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు అనుమతుల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చిన మాదిరిగానే సీఎం నాయకత్వంలో రాష్ట్రానికి వచ్చే ప్రతి పరిశ్రమకు సంపూర్ణ సహకారం అందిస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్‌లో సమృద్ధిగా వనరులు

రాష్ట్రంలో వ్యాపారావకాశాలు, పెట్టుబడులపై విదేశీ ప్రతినిధులతో ఏపీ అధికారులు



భావనపాడు పోర్టు నమూనా

డొండపర్తి (విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులు సమృద్ధిగా ఉన్నాయని పరిశ్రమల శాఖ, ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు అధికారులు విదేశీ ప్రతినిధులకు వివరించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా శుక్రవారం మ.3 గంటలు తరువాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్ దేశాల ప్రతినిధులతో ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఇందులో పరిశ్రమలు, మారిటైం బోర్డు అధికారులు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ఇక్కడ వర్క్‌ఫోర్స్, ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలను వారికి విశదీకరించారు. ముఖ్యంగా దేశంలోనే రెండో అతిపెద్ద తీర ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో ఉందని.. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మూడు పోర్టులను సైతం నిర్మిస్తోందని వివరించారు. అలాగే, నెదర్లాండ్స్‌లో పోర్టుల నిర్మాణాలు, వాటి నిర్వహణకు గల అవకాశాలను ఆ దేశ ప్రతినిధులు ఇక్కడి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో పాటు అదాని, ఇతర ప్రైవేటు సంస్థ ప్రతినిధులకు వివరించారు. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయిలో సమీక్ష జరిపి వ్యాపార అవకాశాలపై నిర్ణయం తీసుకుంటామని నెదర్లాండ్స్ ప్రతినిధులు తెలిపారు.



ADVANTAGE ANDHRA PRADESH

సాక్షి

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023
మార్చి 3-4, విశాఖపట్నం..
www.advantageap.in

విశాఖ–భోగాపురం ఆరులేన్ల రహదారి

రూ.6,300 కోట్లతో నిర్మిస్తాం

జీఐఎస్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన

(గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన హామీ నిచ్చారు. సుదీర్ఘ తీరరేఖ కలిగిన ఏపీలో పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణానికి రూ.20 వేల కోట్లతో ప్రాజెక్టులను చేపడుతున్నామన్నారు. విశాఖలో శుక్రవారం ప్రారంభమైన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్–2023'లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు పోర్టులను అనుసంధానిస్తూ 12,350 కి.మీ మేర రహదారుల నిర్మాణానికి 22 ప్రాజెక్టు పనులు ప్రారంభించామన్నారు. మరో మూడు పోర్టులను అనుసంధానిస్తూ 120 కి.మీ. రహదారుల నిర్మాణానికి ఆరు ప్రాజెక్టులను ఆమోదించామన్నారు.



కీలకంగా సూరత్ - కర్నూలు ఎక్స్‌ప్రెస్ హైవే

రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోందని గడ్కరీ తెలిపారు. విశాఖపట్నం–రాయ్‌పూర్, బెంగళూరు– చెన్నై, హైదరాబాద్ – విశాఖపట్నం, చిత్తూరు –కన్నూరు, బెంగళూరు– విజయవాడ, విజయవాడ – నాగ్‌పూర్, ఖమ్మం–దేవరపల్లి హైవేల నిర్మాణంతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి ఊపందుకుంటుందన్నారు. ఉత్తర, దక్షిణ భారతాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న సూరత్ – కర్నూలు ఎక్స్‌ప్రెస్ హైవే రానున్న రోజుల్లో అత్యంత కీలకంగా మారనుందన్నారు. ఈ హైవేలను ఆనుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తుండటం రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కారిడార్లలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు నిర్మిస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం, అనంతపురంలో లాజిస్టిక్ పార్కుల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. జాతీయ రహదారులను ఆనుకుని భూమి ఇస్తే రాష్ట్ర ప్రభుత్వంతో కలసి మరిన్ని మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతిలో ఇంట్రామోడల్ బస్ స్టేషన్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. సరుకు రవాణా వ్యయం తగ్గింపు, కాలుష్య నియంత్రణ కోసం సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించాలని గడ్కరీ అభిప్రాయపడ్డారు. దేశంలో 16 శాతంగా ఉన్న సరుకు రవాణా వ్యయాన్ని 9 శాతానికి తగ్గించడమే తమ లక్ష్యమన్నారు. సముద్రంలో 100 నాటికల్ మైళ్ల దూరం వరకు చేపలవేట సాగించేందుకు మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీకి జ్ఞాపిక అందిస్తున్న శ్రీసిటీ ప్రతినిధి. పక్కన సీఎం జగన్



గ్రీన్ ఎనర్జీ గురించి తెలుసుకుంటున్న కేంద్రమంత్రి గడ్కరీ, సీఎం జగన్

సీఎం జగన్ కలల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలల ప్రాజెక్ట్ అయిన విశాఖపట్నం–భోగాపురం ఆరులేన్ల రహదారి ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేశామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఏపీ అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి జగన్ తనతో చాలాసార్లు చర్చించినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమిని సమకూర్చడంతోపాటు కొన్ని రాయితీలను కూడా ఇస్తోందన్నారు. మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ నిర్మాణం కోసం 157 ఎకరాలను కేంద్రానికి ఇచ్చేందుకు ఆమోదం తెలుపుతూ లేఖ కూడా అందచేసిందన్నారు. విశాఖపట్నం –భోగాపురం మధ్య 55 కి.మీ. మేర ఆరు లేన్ల రహదారిని రూ.6,300 కోట్లతో నిర్మించాలని నిర్ణయించినట్లు గడ్కరీ తెలిపారు.

సీఎం జగన్ ఇమేజ్‌తోనే ఈ పెట్టుబడులు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



దొండపర్తి (విశాఖ దక్షిణ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇమేజ్‌తోనే రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదిక వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 14 రంగాల్లో పెట్టుబడులు వస్తాయని ఆశించగా, అవి 20 వరకు పెరగడం మరింత ఆనందంగా ఉందన్నారు. రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులను తీసుకురావడం సీఎం జగన్ ఘనత అని చెప్పారు. ప్రస్తుతం వచ్చిన పెట్టుబడుల్లో కనీసం 90 % గ్రౌండ్ అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ఒక్కో పరిశ్రమకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చూడాలని సీఎం గట్టిగా చెప్పారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని పారిశ్రామికవేత్తలు విశ్వసిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సహజ వనరులను, వర్క్‌ఫోర్స్‌ని చూసి ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి తరలివచ్చారని వెల్లడించారు. అంబానీ, అదాని, జిందాల్, ఒబెరాయ్, జీఎంఆర్, కృష్ణ ఎల్లా, భజంగా వంటి పారిశ్రామిక ప్రముఖులు రాష్ట్రంలో పారిశ్రామిక రంగంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, అందిస్తున్న సహకారంపై ప్రశంసలు కురిపించడాన్ని తెలుగు ప్రజలంతా చూశారన్నారు. రాష్ట్రంలో వ్యాపార, పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందనడానికి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుందని ప్రశ్నించారు. పారిశ్రామిక సదస్సు ఇంత పెద్ద ఎత్తున, విజయవంతంగా జరుగుతున్నా కొంతమంది విమర్శలు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇమేజ్‌ని దెబ్బతీయటానికి ప్రయత్నిస్తున్నవారు నేటి సదస్సుకు వచ్చిన పారిశ్రామిక ప్రముఖులను ఎప్పుడైనా చూశారా అని మంత్రి ఎద్దేవా చేశారు. అధికారంలో లేకపోతే రాష్ట్రానికి మంచి జరగకూడదని టీడీపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారన్నారు.

అద్భుత ఆతిథ్యం

రాష్ట్ర ప్రభుత్వ ఆత్మీయతకు అచ్చెరువొందిన పారిశ్రామిక దిగ్గజాలు

స్వాగతం నుంచి విందు వరకు అంతా ప్రత్యేకమే

- ఎయిర్‌పోర్టులో సాదర స్వాగత ఏర్పాట్లు
- ప్రతి ఒక్కరికీ పూల దండలు, నుదుట బొట్టు, నృత్యాలతో స్వాగతం
- వేదికపైన సాంస్కృతిక కార్యక్రమాలు



జీఐఎస్ ప్రాంగణంలో ఆహూతులను ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన



ఎయిర్‌పోర్టులో అతిథులకు కళాకారుల స్వాగతం

సాక్షి, విశాఖపట్నం : పెట్టుబడుల సదస్సుకు హాజరైన పారిశ్రామిక దిగ్గజాలు, ప్రతినిధులు అచ్చెరువొందేలా రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చింది. సదస్సుకు స్వాగతం మొదలుకొని.. రాత్రి విందు వరకు అడుగడుగునా అద్భుతమనేలా ఏర్పాట్లు చేసింది. తెలుగు సంప్రదాయాల మేళవింపుతో సాగిన స్వాగత కార్యక్రమాలకు దేశ, విదేశీ ప్రతినిధులు సాహో అన్నారు. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీతో పాటు కరణ్ అదానీ, నవీన్ జిందాల్ తదితర పారిశ్రామికవేత్తలు ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సాదరంగా ఆహ్వానం పలికింది. ఎయిర్‌పోర్టులో దిగిన వారికి కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి, పూల దండ, కుంకుమ బొట్టుతో ఆత్మీయంగా ఆహ్వానించారు. తొలిసారి విశాఖకు వచ్చిన ముఖేష్ అంబానీ విమానాశ్రయం నుంచి వేదిక వద్దకు చేరుకునేందుకు భారీ కాన్వాయ్ ఏర్పాటు చేశారు. సదస్సు జరిగే ఏయూ మైదానానికి చేరుకున్న ప్రతి ఒక్కరూ అక్కడ ఏర్పాటు చేసిన సంప్రదాయ స్వాగత కార్యక్రమాలకు ముగ్ధులయ్యారు. కోయ నృత్యం, కొమ్ము నృత్యం, కోలాటం, తప్పెటగుళ్లు, థింసా, కూచిపూడి, డప్పుల నృత్యాలతో అందరికీ స్వాగతం పలికారు. వేదికపై మా తెలుగు తల్లికి గీతాలాపనతో సదస్సుని ఘనంగా ప్రారంభించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం, ఏపీలో ఉన్న వనరులు, అపార అవకాశాలని వివరిస్తూ అడ్వాంటేజ్ ఏపీని ప్రమోట్ చేసేలా రూపొందించిన లేజర్ షో వేదికపై ఉన్న ప్రముఖులతో పాటు ప్రతినిధులందర్నీ ఆకట్టుకుంది. సాయంత్రం వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరించాయి.

అదరగొట్టిన డ్రోన్ షో... పసందైన విందు

సాయంత్రం పారిశ్రామికవేత్తల కోసం సాగరతీరంలో ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కులోని ఎంజీఎం గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విందు ఏర్పాటు చేసింది. మంత్రులు, ఉన్నతాధికారుల సమక్షంలో దేశ, విదేశీ ప్రతినిధులకు అద్భుతమైన విందు అందించారు. ఈ సందర్భంగా 500 డ్రోన్లతో డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్, లోగో, ఏపీ మ్యాప్‌ని ఫోకస్ చేస్తూ ప్రదర్శించిన డ్రోన్ షో చూసి అందరూ అచ్చెరువొందారు.

ఆహా ఏమి రుచి!

- ఆంధ్ర వంటల ఘుమ ఘుమలు
- అతిథులకు నోరూరించిన వంటకాలు



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన అతిథుల కోసం వండిన ఆంధ్ర వంటలు ఘుమఘుమలాడాయి. దేశ, విదేశాల నుంచి వచ్చిన వారికి నోరూరించాయి. తొలిరోజు శుక్రవారం మధ్యాహ్నం భోజనంలో నాన్‌వెజ్ వంటకాల్లో బొమ్మిడాయల పులుసు, గుంటూరు కోడివేపుడు, రొయ్యల మసాలా, మటన్ కూర, చికెన్ పలావ్, వెజ్ రకాల్లో మష్రూం, క్యాప్సికం కూర, ఆలూ గార్లిక్ ఫ్రై, కేబేజీ మటర్ ఫ్రై, వెజ్ పలావ్, రోటీ, కుల్చా, పన్నీర్ బటర్ మసాలా, మెంతికూర–కార్న్ రైస్, మిర్చి కా సలాన్, టమాటా పప్పు, బీట్‌రూట్ రసం, మజ్జిగ పులుసు, గోభి ఆవకాయ, నెయ్యి, వడియాలు, ద్రాక్షపండ్ల పచ్చడి, చల్లమిర్చి తదితర వంటకాలను వడ్డించారు. ఉదయం సదస్సు ప్రారంభోత్సవం, అతిథుల ప్రసంగాలు, ఎంవోయూలు మార్చుకోవడం వంటివి ముగిశాక భోజన విరామానికి సమయం ఇచ్చారు. రాష్ట్రేతరులు, విదేశీయులు ఈ ఆంధ్ర రుచులను ఆస్వాదిస్తూ తిన్నారు. మనసు దోచుకున్న వంటకాల పేర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా జున్ను, గుంటూరు కోడి వేపుడు, బొమ్మిడాయల పులుసు వంటివి కొంతమంది ప్రతినిధులకు బాగా రుచించాయి. రెండోరోజు శనివారం లంచ్‌లో నాన్‌వెజ్ రకాల్లో ఆంధ్రా చికెన్ కర్రీ, చేప ఫ్రై, గోంగూర–రొయ్యల కూర, ఎగ్ మసాలా, మటన్ పలావ్, వెజ్ ఐటమ్స్‌లో వెజ్ బిర్యాని, కరివేపాకు రైస్, కడాయ్ పన్నీరు కూర, క్యారెట్–బీన్స్–కొబ్బరి ఫ్రై, వంకాయ మెంతికారం, బెండకాయ–జీడిపప్పు ఫ్రై, పప్పుచారు, మిరియాల రసం, మజ్జిగ పులుసు, ఉలవచారు–క్రీం వంటివి వడ్డించనున్నారు.

–సాక్షి, విశాఖపట్నం

కనువిందు చేసిన హస్తకళలు



రాష్ట్రంలో విభిన్న సంస్కృతులను ప్రతిబింబిస్తూ విభిన్న ప్రాంతాల్లో రూపుదిద్దుకున్న హస్తకళలు లేపాక్షి స్టాల్‌లో కొలువుదీరాయి. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల హస్తకళలను ప్రదర్శనలో ఉంచారు. కేవలం వస్తువులను మాత్రమే కాకుండా ఆయా ప్రాంతాలకే ప్రత్యేకమైన వంటకాలను సైతం ప్రదర్శించారు. ముఖ్యంగా బొబ్బిలి వీణ, పాయకరావుపేట, కాకినాడ చీరలు, ఏటికొప్పాక బొమ్మలు, తిరుపతి చెక్క ఆకృతులు, వైఎస్సార్ జిల్లాకు చెందిన బ్రాస్ వస్తువులు, చిత్తూరుకు చెందిన టెర్రాకోట సామానులు, ఆళ్లగడ్డ రాతి ఆకృతులు, అన్నమయ్య జిల్లాకు చెందిన రాజారాణి బొమ్మలు ఇలా అనేకం అందరి మనసును చూరగొన్నాయి.

ఆలోచింపచేసిన గ్రీన్‌కో పునరుత్పాదక పవర్ ప్రాజెక్టు



కాకినాడలో గ్రీన్‌కో గ్రీన్ హైడ్రోజన్ అండ్ అమ్మోనియా ఫెసిలిటీ ప్రాజెక్టు, కర్నూల్‌లో పునరుత్పాదక విద్యుత్ నిల్వ కేంద్రం నమూనాలు అందరినీ అబ్బురపరిచాయి. గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియాలతో విద్యుత్ ఉత్పత్తితో పాటు దాన్ని నిల్వచేసేందుకు ఏర్పాటుచేస్తున్న స్టోరేజ్ ఫెసిలిటీ సెంటర్ పనితీరును వివరిస్తూ ఏర్పాటుచేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విద్యుత్ ఉత్పత్తిలో నూతన సాంకేతికతను వివరిస్తూ గ్రీన్‌కో సంస్థ సిబ్బంది సందర్శకులకు అవగాహన కల్పించారు.

సందర్శకులను కట్టిపడేసిన స్టాల్స్

ఐటీ నుంచి ఈవీ వరకు అన్ని రంగాల స్టాల్స్ ఏర్పాటు

రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు.. కొత్తగా ఏర్పాటయ్యే ప్రాజెక్టుల ప్రదర్శన

దొండపర్తి (విశాఖ దక్షిణ) : రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు.. కొత్తగా రాబోతున్న ప్రాజెక్టుల నమూనాలు.. యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకులు.. రాష్ట్రంలో అన్ని జిల్లాల హస్తకళలు.. పసందైన వంటకాలు.. ఇలా ఒకటేమిటి.. ఐటీ నుంచి ఈవీ వరకు అన్ని రంగాల స్టాల్స్ విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో అందరినీ ఆకట్టుకున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో శుక్రవారం ప్రారంభమైన జీఐఎస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. కేవలం సందర్శకులను ఆకట్టుకునేలా మాత్రమే కాకుండా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న వనరులు.. అందుకు జిల్లాల వారీగా ఉన్న స్థలాల వివరాలు.. ప్రభుత్వం అందజేస్తున్న మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు వంటివి పారిశ్రామికవేత్తలకు తెలిసేలా స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలో సుమారు 20 రంగాలకు చెందిన స్టాల్స్‌తోపాటు స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు వారికి కూడా అవకాశం కల్పించారు.

కొత్త పోర్టుల నమూనాలతో ఏపీ మారిటైమ్ స్టాల్



రాష్ట్రంలో కొత్త పోర్టుల నమూనాలు, వాటి నిర్మాణంతో లభించే ఉపాధి అవకాశాలను తెలిపేలా ఏపీ మారిటైమ్ బోర్డు స్టాల్స్‌ను ఏర్పాటుచేసింది. నాలుగేసి బెర్తులతో నిర్మిస్తున్న ఈ పోర్టుల నమూనాలు ఏరియల్ వ్యూలో చూస్తున్న అనుభూతిని సందర్శకులకు కలిగించాయి. వీటి ద్వారా సుమారు 3 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రాజెక్టు మేనేజర్ దొరబాబు సందర్శకులకు వివరించారు. వీటితో పాటు వైఎస్సార్ కడప జిల్లాలో రూ.8.8 వేల కోట్లతో చేపట్టే జేఎస్ డబ్ల్యూ స్టీల్‌ప్లాంట్ నమూనాను ప్రదర్శనలో ఉంచారు.

సందడి చేసిన రోబోలు



స్టార్టప్‌లకు కూడా ఈ ప్రదర్శనలో అవకాశం కల్పించారు. విశాఖలో ఇన్నోవేషన్ హబ్‌లో స్టార్టప్ సంస్థ రోబోకప్లర్ సాంకేతికత ఆధారంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రోబోలు తయారుచేస్తోంది. ఈ సంస్థ రూపొందించిన రోబోలు ప్రదర్శనలో సందడి చేశాయి. ఇప్పటికే హోటల్‌లో సర్వింగ్ కోసం తీర్చిదిద్దిన రోబోతో పాటు కొత్తగా అరకులో కాఫీ ప్రత్యేకతలను అక్కడకు వచ్చే సందర్శకులకు వివరించేందుకు సీత అనే పేరుతో రోబోను తయారుచేశారు. త్వరలోనే ఈ రోబో అరకు కాఫీ మ్యూజియంలో పర్యాటకులను పలకరించనుంది. వీటితో పాటు మరెన్నో రంగాలకు చెందిన స్టాల్స్ సందర్శకులను కట్టిపడేశాయి.

ఈ తరహా సదస్సులు కొనసాగించాలి



కోవిడ్ తరువాత రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపట్టింది. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై దృష్టిపెట్టి, స్మార్ట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో మన సామర్థ్యాలను చెప్పగలిగితే మరింత పెట్టుబడులు పెరిగే అవకాశాలుంటాయి. ఏఐ, ఆర్చనాయిడ్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తును మార్చివేస్తాయి. మన సామర్థ్యాలను చాటిచెప్పడానికి ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఇటువంటి సదస్సులను భవిష్యత్తులోనూ కొనసాగించాలి.

– డాక్టర్ రవిశంకర్ సరిపల్లి, డైరెక్టర్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్

ఇది శుభపరిణామం



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జీఐఎస్‌కు దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలు విశాఖకు వచ్చారు. ఇందులో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించారు. ఇది శుభపరిణామం. రాష్ట్రానికి భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు ఇది ఆరంభంగా చెప్పవచ్చు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న ఈ ప్రయత్నాలు కార్యరూపం దాలిస్తే రాష్ట్రాభివృద్ధికి దోహదంగా నిలుస్తాయి.

– జి. రవికుమార్, ఏటీసీ గ్రీన్‌టెక్, సింగపూర్

జీఐఎస్‌తో రాష్ట్రానికి బ్రాండింగ్



అన్ని రంగాలకు అనువైన, అవసరమైన మౌలిక సదుపాయాలు, వనరులు, మానవ నైపుణ్యాలు సమృద్ధిగా ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇప్పటివరకు ఏపీలో ఐటీ సంస్థలు లేకపోవడంతో తెలుగువారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ జీఐఎస్ ద్వారా సాఫ్ట్‌వేర్ సంస్థలు రాష్ట్రానికి రావడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ సదస్సు రాష్ట్రానికి ఒక బ్రాండింగ్ ఏర్పడడానికి దోహదపడుతుంది.

– ఆర్‌ఎల్ నారాయణ, చైర్మన్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్, ఐటీఏపీ

స్టార్టప్‌లకు చేయూత సంతోషకరం



సదస్సులో కేవలం పెద్ద సంస్థలకే కాకుండా కొత్తగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టే స్టార్టప్‌లకు కూడా ప్రాధాన్యత కల్పించారు. ఇది మంచి నిర్ణయం. పెద్ద పారిశ్రామికవేత్తలు రావడంవల్ల పెట్టుబడులు పెరిగే అవకాశముంటుంది. స్టార్టప్‌లకు కూడా అవకాశమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తూ ప్రోత్సహించడం సంతోషకరం.

– జి.వరుణ్, వ్యవస్థాపకుడు, గ్రీన్ జామ్స్ స్టార్టప్

చిన్న పరిశ్రమలకు మేలు



భారీ పెట్టుబడులు వస్తే స్థానికంగా ఉండే చిన్న పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు లభిస్తాయి. భారీ పరిశ్రమలకు అవసరమైన అనేక ముడి ఉత్పత్తులను తయారుచేసి అందించే అవకాశాలు ఏర్పడతాయి. తద్వారా ఎంఎస్‌ఎంఈలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి. జీఐఎస్ నిర్వహించడం రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలకు శుభపరిణామం. అలాగే, నిరుద్యోగులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది.

– పి.ప్రవీణ్, కార్యదర్శి, నెల్లిమర్ల ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్

పారిశ్రామిక ప్రగతికి ఉపయుక్తం



రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఇటువంటి సదస్సులు ఉపయుక్తంగా నిలుస్తాయి. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రముఖులు విశాఖకు వచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం శుభపరిణామం. దీని ద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. అలాగే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతుంది.

– ఆచార్య బోస్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి, జీవీపీ పీజీ కళాశాల

పెట్టుబడులతో కొత్త ఉత్సాహం



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జీఐఎస్ ద్వారా రాష్ట్రానికి అనేక భారీ కంపెనీలు రావడానికి ఆసక్తి చూపించాయి. ఇది మాలాంటి యువతకు ఉత్సాహాన్నిచ్చే అంశం. పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లకుండా యువతకు ఇక్కడే ఉద్యోగావకాశాలు లభిస్తాయన్న నమ్మకం కలుగుతోంది. ఇటువంటి సదస్సులు ఆర్గనైజేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోడానికి ఉపయుక్తంగా ఉంటాయి.

– జాహ్నవి, ఎంబీఏ విద్యార్థిని,

గర్వంగా భావిస్తున్నా..



మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రయోగశాలగా నిలుస్తుంది. విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను కలుసుకోవడం సాధ్యపడింది. వారితో సంభాషించడం, రాష్ట్ర, విశాఖ నగర ప్రత్యేకతలు వివరించే అవకాశం కలిగింది. విభిన్న సంస్కృతులు, ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో కలిసి పనిచేసే అరుదైన అవకాశం లభించడం గర్వంగా భావిస్తున్నా.

– ఎస్.తేజ, ఎంబీఏ విద్యార్థి, సదస్సు వలంటీర్,

విశాఖ ఖ్యాతి విశ్వవ్యాప్తం అవుతుంది



ఇటువంటి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖను వేదికగా ఎంపిక చేయడం మంచి పరిణామం. విశాఖ ఖ్యాతి అంతర్జాతీయంగా పెరుగుతుంది. రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగే అవకాశాలు ఇటువంటి కార్యక్రమాలతో మెరుగవుతాయి. ఇలాంటి సదస్సులు ఏటా నిర్వహించాలి.

– ఎం.ప్రీతం లూక్, సెక్రటరీ, కరస్పాండెంట్, సెయింట్ లూక్స్ విద్యా సంస్థలు,

పెట్టుబడులకు రాష్ట్రంలో అవకాశాలు పుష్కలం



ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా వనరులున్నాయి. పెట్టుబడులకు, వాటి విస్తరణకు చాలా అవకాశముంది. 'అడ్వాంటేజ్ ఏపీ' అనే నినాదం ఈ రాష్ట్రానికి నూరు శాతం వర్తిస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇలాంటి ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించడం మంచి పరిణామం. స్టార్టప్‌లకు ప్రోత్సాహం లభిస్తుంది. వీటి ద్వారా కూడా ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

– కె. బాలాజీ, ఫౌండర్ సీఈఓ, నయగాజీ ఎలక్ట్రికల్స్, బెంగళూరు

లాజిస్టిక్స్‌కు ఏపీ అనుకూలం

కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సుమితా దోరా

సాక్షి, విశాఖపట్నం: లాజిస్టిక్స్‌కు ఆంధ్రప్రదేశ్ ఎంతో అనుకూలంగా ఉందని కేంద్ర ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి సుమితా దోరా చెప్పారు. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా 'ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లాజిస్టిక్స్ రంగానికి అనుకూలమైన పాలసీని తీసుకువచ్చిందని చెప్పారు. ఈ పాలసీతో సత్వరమే అనుమతులు ఇచ్చేలా సింగిల్ విండో విధానం అమలవుతోందని తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ విశాఖ పోర్టులోనూ పెట్టుబడులకు కావలసిన స్థలాలు ఉన్నాయని తెలిపారు. జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ జీఎం జీవీఎస్ రాజు మాట్లాడుతూ భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు మూడు, నాలుగు నెలల్లో మొదలవుతాయని చెప్పారు. ఏపీలో వేర్ హౌసింగ్‌ను విస్తృతం చేయడానికి అనువైన వనరులు పుష్కలంగా ఉన్నాయని ఆ రంగ ప్రతినిధి శుక్లా పేర్కొన్నారు.




ఇక ఈవీలు.. ఏఐ

ఈ-మొబిలిటీ, కృత్రిమ మేధదే భవిష్యత్తు

ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీపైనా దృష్టి పెట్టాలి

విశాఖ జీఐఎస్ సెషన్లలో పరిశ్రమ వర్గాల సూచన



(గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 ' ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులు లాంటి ఈ-మొబిలిటీదేనని ఎలక్ట్రిక్ వాహన రంగ పరిశ్రమ ప్రముఖులు పేర్కొన్నారు. వాహనాల ధరలు తగ్గి చార్జింగ్ పరమైన సదుపాయాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాలపై నిర్వహించిన సెషన్‌లో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ కేవీ ప్రదీప్, కియా మోటార్స్ ఇండియా వీపీ హర్‌దీప్ బ్రార్, టెస్లా సహ వ్యవస్థాపకుడు మార్టిన్ ఎబర్‌హార్డ్ తదితరులు పాల్గొన్నారు. ఈవీల బ్యాటరీలు దిగుమతి చేసుకోవడం కొనసాగినంత కాలం వాహనాల ధర అధిక స్థాయిలోనే ఉంటుందని, దేశీయంగా తయారీ చేస్తే భారం తగ్గుతుందని స్పష్టం చేశారు. ఈవీల మార్కెట్ యూరప్, అమెరికాలో గణనీయంగా ఉండగా భారత్‌లో ప్రస్తుతం 1-2 శాతం స్థాయిలోనే ఉందని హర్‌దీప్ తెలిపారు. సంప్రదాయ ఇంధనాలతో నడిచే వాహనాలతో పోలిస్తే వీటి ధర 80 శాతం అధికంగా ఉండటం, చార్జింగ్ సమస్యలు, మైలేజీపరమైన ఆందోళనే ఇందుకు కారణమన్నారు. ఈ సవాళ్లను అధిగమించేలా దేశీ పరిశ్రమ సరైన దిశలో ముందుకు సాగుతోందని వివరించారు. 2025 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వాటా 5 శాతానికి, అటుపైన 2030 నాటికల్లా 30 శాతానికి పెరుగుతుందని అంచనాలున్నట్లు హర్‌దీప్ చెప్పారు. 2025 నాటికే 45 పైచిలుకు ఈవీల మోడళ్లు లభ్యమవుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల 5,600 బస్సుల కోసం కేంద్ర ప్రభుత్వం టెండర్లు ప్రకటించగా కంపెనీలు పోటీపడి బిడ్లు వేయడం ఈవీల మార్కెట్లో వస్తున్న మార్పులకు నిదర్శనమన్నారు.

ఇక ఎలక్ట్రిక్ కార్లే: మార్టిన్ ఎబర్‌హార్ట్, టెస్లా సహ వ్యవస్థాపకుడు

త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్లే ఉంటాయని అమెరికన్ విద్యుత్ వాహనాల దిగ్గజం టెస్లా సహ వ్యవస్థాపకుడు మార్టిన్ ఎబర్‌హార్డ్ చెప్పారు. కేవలం టెస్లా కార్లే కాకుండా ఇతర కంపెనీలూ ఈ విభాగంలో గణనీయంగా పురోగతి సాధించాయని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద వాహనాల మార్కెట్లలో భారత్ కూడా ఒకటని ఎబర్‌హార్డ్ తెలిపారు. త్వరలోనే ఇక్కడ కూడా పూర్తిగా ఎలక్ట్రిక్ కార్లనే చూడవచ్చన్నారు. దీన్ని గుర్తించి అవకాశాన్ని అందిపుచ్చుకునే సంస్థలు లబ్ధి పొందుతాయన్నారు. చార్జింగ్, మౌలిక సదుపాయాల కొరత అనేది సమస్యే కాదన్నారు. కియా సంస్థ ఏపీలో అద్భుతమైన కార్లను ఉత్పత్తి చేస్తోందని ప్రశంసించారు.

ఆరంభంలో అన్నీ సమస్యలే..

ఎలక్ట్రిక్ కార్లు తొలిసారిగా తెరపైకి వచ్చినప్పుడు ఆకర్షణీయంగా లేకపోవడంతో ప్రజలు ఇష్టపడే వారు కారని ఎబర్‌హార్డ్ చెప్పారు. దీంతో వాటికి స్పోర్ట్స్' లుక్ కల్పించేందుకు తాము ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు. సగం మంది సిబ్బందిని ఆటోమోటివ్ రంగం నుంచి, మిగతా వారిని సిలికాన్ వ్యాలీ నుంచి నియమించుకున్నట్లు చెప్పారు. 2 దశాబ్దాల క్రితం తాము ఎలక్ట్రిక్ వాహనాలను తెరపైకి తెచ్చినప్పుడు పలు సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. 'ఉత్పత్తి సంస్థల నుంచి పరికరాల సరఫరా సరిగా ఉండేది కాదు. లిథియం అయాన్ బ్యాటరీల భద్రతపరంగా పలు సవాళ్లు ఎదుర్కొన్నాం. క్రాష్ టెస్టులు నిర్వహించాలన్నా కష్టంగా ఉండేది. ఆటో డీలర్ల ఫ్రాంచైజీల పరంగానూ సమస్యలు తలెత్తాయి. నెమ్మదిగా వాటిని అధిగమించాం. వాటాల విక్రయం ద్వారా నిధులు సమీకరించుకున్నాం. అప్పట్లో ఎలక్ట్రిక్ కార్లకు భవిష్యత్ లేదని అంతా పెదవి విరిచారు. ప్రస్తుతం భవిష్యత్తంతా వాటిదే అన్నట్లుగా పరిస్థితి మారుతోంది' అని తెలిపారు.

చైనా ప్లస్ వన్‌తో భారత్‌కు ప్రయోజనం

ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కోసం ఇన్నాళ్లు చైనాపై ఆధారపడిన దేశాలు కోవిడ్ పరిణామాల నేపథ్యంలో ఇతర ప్రత్యామ్నాయాలపై (చైనా ప్లస్ వన్ విధానం) దృష్టి పెడుతున్నాయని సాల్‌కాంప్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా ఎండీ శశికుమార్ గంధం తెలిపారు. మన దేశం అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో చిన్న, మధ్య తరహా సంస్థలను (ఎంఎస్ఎంఈ) భాగస్వాములుగా చేయాలన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంగా ఎలక్ట్రానిక్స్‌పై నిర్వహించిన సెషన్‌లో ఎఫ్‌ట్రానిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ, బ్లూస్టార్ క్లైమేటెక్ ప్రెసిడెంట్ పీవీ రావు తదితరులతో కలసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి విధానపరంగా పరిశ్రమకు మంచి మద్దతు లభిస్తోందని, ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) లాంటి స్కీములు ప్రయోజనకరంగా ఉన్నాయని సాల్‌కాంప్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా ఎండీ శశికుమార్ పేర్కొన్నారు. వీటి ఊతంతో దీర్ఘకాలంలో నిలదొక్కుకునేందుకు పరిశ్రమ తగిన ప్రయత్నాలు చేయాలని సూచించారు.

నిర్దిష్టంగా దృష్టి సారిస్తే..

ఎలక్ట్రానిక్స్ తయారీకి సంబంధించి అన్ని ఉత్పత్తులు కాకుండా నిర్దిష్టంగా 2-3 విభాగాలను ఎంచుకుని వాటిపైనే ప్రధానంగా దృష్టి పెట్టడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు పొందుతుందనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రధానంగా పీసీ బోర్డుల తయారీ, ఇతర పరికరాలపై దృష్టి పెట్టాలన్నారు. తాము దక్షిణాదిలో ప్లాంటు కోసం అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ అత్యంత ఆకర్షణీయంగా కనిపించిందని పీవీ రావు చెప్పారు. ప్రభుత్వం అత్యుత్తమ సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పించిందని, తమ కార్యకలాపాలను మరింత విస్తరించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తమ ప్లాంటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,000 మందికి పైగా ఉపాధి లభిస్తుండగా విస్తరణ అనంతరం ఇది రెట్టింపు స్థాయికి చేరుకుంటుందని తెలిపారు.

అన్నింటా కృత్రిమ మేధ

వైద్యం విద్య తదితర అన్ని విభాగాల్లో కృత్రిమ మేధకు (ఏఐ) ప్రాధాన్యం పెరుగుతోంది. ఏఐపై పట్టు సాధించేందుకు యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించి పాఠశాల, కళాశాల స్థాయి నుంచి అవగాహన పెంపొందించాలి. ప్రధానంగా గణితంపై మరింత పట్టు సాధించేలా ప్రోత్సహించాలి అని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) అంశంపై జరిగిన సెషన్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐఐటీలు, ఎయిమ్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలెన్నో ఉన్నాయని చెప్పారు. మాస్ మ్యూచువల్ హెడ్ రవి తంగిరాల, ఐట్యాప్ ప్రెసిడెంట్ శ్రీధర్ కొసరాజు, టెక్నోజెన్ సీఈవో లక్స్ రావు చేపూరి, టెక్ బుల్స్ డైరెక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు ఈ సెషన్‌లో పాల్గొన్నారు.

తొలిరోజు 92 ఒప్పందాలు..

సంస్థల వారీగా పెట్టుబడుల మొత్తం.. ఎంతమందికి ఉపాధి వివరాలు.. (పెట్టుబడి రూ.కోట్లలో)

సంస్థ	ఒప్పందాలు	పెట్టుబడి	ఉపాధి
ఎన్టీపీసీ	3	2,35,000	77,000
ఏబీసీ లిమిటెడ్	1	1,20,000	7,000
రిన్యూ పవర్	2	97,500	16,550
ఇండోసోల్	2	76,033	13,200
ఏసీఎంఈ	1	68,976	3,900
టెప్సోల్ ప్రాజెక్టు లిమిటెడ్	1	65,000	5,500
జేఎస్‌డబ్ల్యూ గ్రూపు	6	50,632	9,500
హంచ్ వెంచర్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ (పార్లె)	1	50,000	20,000
అవాడా గ్రూప్	1	50,000	7,300
గ్రీన్‌కో	4	47,600	10,000
ఓసీఓఆర్	1	40,000	10,000
హీరో ఫ్యూచర్ ఎనర్జీస్	1	30,000	10,000
వైజాగ్ టెక్‌పార్కు	2	21,844	39,815
అదానీ గ్రీన్ ఎనర్జీ	2	21,820	14,000
ఎకోరెన్ ఎనర్జీ ఇండియా	2	15,500	4000
సెరెంటికా రెన్యూవబుల్ ఇండియా	1	12,500	2000
ఎన్‌హెచ్‌పిఎస్	1	12,000	2000
అరబిందో గ్రూప్	5	10,365	5,250
ఓ2 పవర్	1	10,000	1500
ఏజీపీ సిటీ గ్యాస్	1	10,000	8000
జాషన్ ఇన్‌ఫ్రా (అకార్డ్ గ్రూప్)	1	10,000	5000
ఆదిత్య బిర్లా	2	9,300	2850
షిర్డీసాయి ఎలక్ట్రికల్స్	1	8,855	1600
శ్యామ్ గ్రూప్	2	8,500	5750
ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్	1	8,240	4000
జిందాల్ స్టీల్	1	7,500	2500
సెంబాకార్ప్	1	7,500	1500
ఏఎంపీ ఎనర్జీ ఇండియా	1	5,800	700
శ్రీ సిమెంట్స్	2	5,500	1000
టీసీఎల్	2	5,500	6000
ఏఎం గ్రీన్ ఎనర్జీ	1	5,000	1000
ఉత్కర్ష అల్యూమినియం దాతు నిగం	1	4,500	1800
ఐఓసీఎల్	1	4,300	1500
వర్షిణీ పవర్ ప్రాజెక్ట్స్ ఇండియా	1	4,200	700
ఆశ్రయం ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్	1	3,500	8,900
మైహోం సిమెంట్స్	2	3,100	3100
వెనికా జై విద్యుత్	1	3,000	600
డైకిన్	1	2,600	5000
సన్నీ అపోటెక్	1	2,500	10,000
భూమి వరల్డ్	1	2,500	20,000
అల్ట్రాటెక్	1	2,500	2000
ఆంధ్ర పేపర్	1	2,000	2,300
మాండలేజ్	1	1,600	150
యాంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్	1	1,500	600
గ్రిడ్ ఎడ్జివర్క్స్	1	1,500	2500
టీవీఎస్ ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్ పార్క్స్	1	1,500	500
హైజెన్‌కో	1	1,500	500
వెల్‌స్పన్	1	1,500	4,500
ఓబెరాయ్ గ్రూప్	1	1,350	1350
దేవభూమి రోప్‌వేస్	1	1,250	100
సాగర్ పవర్	1	1,250	250
లారస్ గ్రూపు	2	1,210	1700
ఎలక్ట్రోస్టీల్ కేస్టింగ్స్	1	1,113	2350
డెక్కన్ ఫైన్ కెమికల్స్	1	1,100	1050
దివీస్	2	1,100	3700
డ్రీమ్ వేలీ గ్రూప్	2	1,080	7600
భ్రమరాంబ గ్రూప్	2	1,038	1700
మంజీర హోటల్స్ అండ్ రిసార్ట్స్	1	1,000	450
ఏస్ అర్బన్ డెవలపర్స్	1	1,000	100
శర్దా మెటల్స్ అండ్ అల్లాయ్స్	1	1,000	500
ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇండస్ట్రీస్	1	1,000	2000
సెల్‌కాన్ రిసొల్యూట్	1	1,000	5000
తులి హోటల్స్	1	1,000	100
విష్ణు కెమికల్స్	1	1,000	1000
మొత్తం	92	11,87,756	3,92,015



సీఎం సమక్షంలో ఎంవోయూ పత్రాలను చూపుతున్న జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్, ప్రభుత్వ ప్రతినిధులు



మంజీరా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో



సెరెంటికా రెనివబుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో



ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో



వర్షిణి పవర్‌ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో



ఒప్పంద ప్రతాలను చూపుతున్న ఎన్టీపీసీ అధికారి



ఒప్పంద పత్రాలతో మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు



సీఎం వైఎస్ జగన్‌తో నెదర్లాండ్స్ ప్రతినిధుల బృందం



సీఎం జగన్‌తో ఆస్ట్రేలియా ప్రతినిధులు



సీఎం జగన్‌తో యూరోపియన్ యూనియన్ బృందం



సీఎం వైఎస్ జగన్‌తో జపాన్ ప్రతినిధుల బృందం



భూమి వరల్డ్



ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్



దేవ్‌భూమి రోప్ వేస్



వెనికా జైన్ విద్యుత్



గ్రీన్ కో ఐఆర్ఈపీ గ్రూప్



మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్



ఏస్ అర్బన్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్



సెల్‌కాన్ రిసొల్యూట్



శర్దా మెటల్స్ అండ్ అల్లాయిస్



జేసన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్



షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్




అదానీ గ్రీన్ ఎనర్జీ



అల్ట్రా టెక్ ప్రైవేట్ లిమిటెడ్

ముందు చూపే మందు



మెదడు వ్యాధులపై అప్రమత్తత అవసరం

- ఎక్కువగా సోకుతున్న ఎన్‌సెఫలైటీస్‌లు
- ఇన్‌ఫెక్షన్, శరీరంలో యాంటీబాడీలు పెరగడమే కారణం
- తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చు
- అశ్రద్ధ చేస్తే కోమాలోకి.. ప్రాణాపాయమూ ఏర్పడవచ్చు
- ప్రభుత్వాస్పత్రికి పెరిగిన మెదడు జబ్బుల రోగులు
- ప్రైవేటు ఆస్పత్రులకూ క్యూ కడుతున్న వైనం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): శరీరంలో అతి ముఖ్యమైనది మెదడు. దాని పనితీరు బాగుంటేనే ఎవరైనా చురుగ్గా పనిచేయగలుగుతారు. ఇటీవలి కాలంలో మెదడుకు సోకుతున్న వ్యాధులు పెరిగాయి. ముఖ్యంగా పలు రకాల ఎన్‌సెఫలైటీస్‌లతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. అలా వస్తున్న వారిలో ఆటో ఇమ్యూన్ ఎన్‌సెఫలైటీస్, హెర్పిస్ ఎన్‌సెఫలైటీస్, జపనీస్ ఎన్‌సెఫలైటీస్‌లతో పాటు, రెసిస్టెన్స్ ఎపిలెప్సీ, అటాక్సియా వంటి సమస్యలతో వస్తున్న వారు ఎక్కువగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాతే ఆస్పత్రులకు వస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి నెలకు 20 నుంచి 30 మంది మెదడు సంబంధిత సమస్యలతో వస్తుండగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం ఇటీవల ఈ కేసులు ఎక్కువ వస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయని, సకాలంలో ఆస్పత్రిలో చేరితే ప్రాణాపాయం లేకుండా బయట పడవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల సోకుతున్న ఎన్‌సెఫలైటీస్‌లు, వాటి లక్షణాలు, చికిత్సలు ఇలా..

ఆటోఇమ్యూన్ ఎన్‌సెఫలైటీస్

శరీరంలోని యాంటీబాడీస్ ఒక్కోసారి కండరాలతో పాటు మెదడుపై ప్రభావం చూపుతాయి. దీంతో ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. ఎక్కువగా వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకిన వారు, కొన్ని రకాల క్యాన్సర్లు ఉన్న వారు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, పలు రకాల కీళ్లవాతం సమస్యలు, ఫ్లూ వ్యాక్సిన్ వేయించుకున్న వారికి ఈ వ్యాధి రావచ్చు. ఇది సోకిన వారికి మొదటి స్టెరాయిడ్స్, ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజక్షన్స్‌తో పాటు, అవసరమైతే డయాలసిస్ చేసి యాంటీబాడీస్‌ను అదుపుచేస్తారు. ప్రస్తుతం ఈ వ్యాధికి మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

హెర్పిస్ ఎన్‌సెఫలైటీస్

ఇది హెర్పిస్ వైరస్ కారణంగా సోకే తీవ్రమైన మెదడు వాపు జబ్బు. పిల్లలు, పెద్దలు ఎవరికైనా రావచ్చు. తీవ్రమైన జ్వరంతో ప్రారంభమై, ఫిట్స్ రావడం, 24 గంటల్లోనే స్పృహ కోల్పోవడం జరుగుతుంది.

రెసిస్టెన్స్ ఎపిలెప్సీ

సరిగా మందులు వాడని ఫిట్స్ రోగులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన వారికి మెదడు మొద్దుబారిపోవడంతో మందులు సరిగా పనిచేయక ఫిట్స్ వెంట వెంటనే వచ్చేస్తుంటాయి. మందులు వేసినప్పటికీ పనిచేయవు. స్పృహ కూడా కోల్పోవచ్చు. ఇలాంటి వారికి ఎక్కువ సమయం పనిచేసే మందులు ఇస్తారు. బ్రెయిన్ స్కాన్ చేసి, మెదడు ఎంత వరకు డ్యామేజీ అయిందో నిర్ధారిస్తారు. అవసరమైతే శస్త్ర చికిత్స కూడా చేస్తారు. అందువలన ఫిట్స్ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడటం మంచిది.

దీనిని వెంటనే గుర్తిస్తే నయం చేసేందుకు మంచి మందులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. వ్యాధి సోకితే కోలుకోవడానికి వారం నుంచి పదిరోజులు పడుతుంది. తొలిదశలో గుర్తించకపోతే ఒక్కోసారి ప్రాణాపాయం కూడా ఏర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు.

అటాక్సియా

ఇది సోకిన వారు నడిచేటప్పుడు, నిల్చున్నప్పుడు బ్యాలెన్స్ తప్పుతుంటారు. నడవడం కష్టంగా మారుతుంది. పిల్లలు, పెద్దవారిలో ఎవరికైనా రావచ్చు. కొన్ని రకాల ఇన్ఫెక్షన్స్, జన్యు లోపం, క్రోమోజోముల్లో తేడాలతో ఈ వ్యాధి సోకుతుంది. కొందరిలో పుట్టుకతోనే ఈ రకమైన జన్యుపరమైన లోపం ఉంటుంది. దీనిని గుర్తించి చికిత్స పొందితే నయం చేయవచ్చు.



చికిత్సతో నయం చేయొచ్చు

ఇటీవల ఎన్‌సెఫలైటీస్ రోగులు తరచూ వస్తున్నారు. ప్రభుత్వాస్పత్రి ఓపీకి నెలలో 20 మందికి పైగా ఇలాంటి రోగులు వస్తున్నారు. తీవ్రమైన జ్వరంలో ఫిట్స్ రావడం, మాట కోల్పోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలతో వస్తున్నారు. వారు ఏ రకమైన ఎన్‌సెఫలైటీస్‌తో బాధపడుతున్నారో ముందుగా నిర్ధారించి చికిత్స చేస్తున్నాం. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. ఆటో ఇమ్యూన్ ప్రాబ్లమ్స్‌కు తొలుత స్టెరాయిడ్స్ ఇచ్చి, తగ్గకుంటే ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజక్షన్స్ ఇస్తాం

–డాక్టర్ దారా వెంకటరమణ,
న్యూరాలజీ విభాగాధిపతి, విజయవాడ ప్రభుత్వాస్పత్రి

కృష్ణానది ఏటిపాయలో ప్రమాదం

- ఇద్దరు మృతి.. ఒకరు గల్లంతు
- మద్యం సేవించి నదిలో ఈతకు దిగిన స్నేహితులు



మృతులు ఖలీషా, అబ్దుల్ రహీంబాషా. గల్లంతైన కిరణ్

పెనమలూరు: మిత్రులంతా కలసి సరదాగా మద్యం సేవించి ఈతకు దిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా పెనమలూరు మండలం చోడవరం ఘాట్ కృష్ణానదిలో చోటుచేసుకుంది. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని జారా రెస్టారెంట్ యజమాని అబ్దుల్‌రహీంబాషా (34) గురువారం రాత్రి తాను కొత్తగా కొన్న ఏపీ 39 ఆర్‌క్యూ 0786 కారులో విజయవాడ క్రీస్తురాజపురానికి చెందిన మిత్రులు ఈవెంట్స్ నిర్వహించే షేక్ ఖలీషా అలియాస్ పండు (30), కస్తూరిబాయిపేటకు చెందిన తాళ్లూరి కిరణ్ (37)తో కలిసి గురువారం రాత్రి చోడవరం ఘాట్ వద్దకు వచ్చారు. వీరు ఘాట్ సమీపంలో కృష్ణానది పాయ వద్ద మద్యం సేవించారు. ఆ తరువాత ముగ్గురు కృష్ణానదిలో ఈతకు దిగారు. ఈతకు దిగిన ముగ్గురు నదిలో గల్లంతయ్యారు.

ఉదయం వెలుగు చూసిన ఘటన..

కాగా శుక్రవారం ఉదయం నదిలో చేపలు పట్టడానికి వచ్చిన వ్యక్తులకు నది పాయవద్ద ఖరీదైన కారు, మద్యం సీసాలు, దుస్తులు కనబడ్డాయి. వారికి అనుమానం వచ్చి నదిలో చూడగా అప్పటికే ఖలీషా మృతదేహం నదిలో తేలుతూ కనబడింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగంలోకి దిగి కారు వివరాలు మహిళా సంరక్షణ కార్యదర్శుల వాట్సాప్ గ్రూప్‌లో పెట్టారు. గ్రూపుల్లో ఈ సమాచారం వ్యాపించడంతో కారు యజమాని అబ్దుల్‌రహీంబాషా వివరాలు తెలిశాయి. దీంతో కుటుంబ సభ్యులు నది వద్దకు చేరుకున్నారు. నది ఒడ్డున ఉన్న దుస్తులు, చెప్పులు చూసి తమ వారేనని ధ్రువీకరించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే గజ ఈతగాళ్లను, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. నీటిలో తేలుతున్న ఖలీషాను ఆ తరువాత వీరి గాలింపులో కారు యజమాని రహీంబాషా మృతదేహాన్ని బయటకు తీశారు. గల్లంతైన కిరణ్ ఆచూకీ తెలియలేదు. గల్లంతైన కిరణ్ కోసం శనివారం నదిలో గాలిస్తామని అధికారులు తెలిపారు.

మాజీ ముత్తవలి హఫీజ్‌పాషా అరెస్ట్

- బాలికపై లైంగికదాడికి యత్నం కేసులో..
- నిందితుడు ఏఎస్‌పేట దర్గా మాజీ పీఠాధిపతి



హఫీజ్‌పాషా (ఫైల్)

లంగర్‌హౌస్/ఆత్మకూరు: మంత్రాలనెపంతో బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమేగాక లైంగికదాడికి యత్నించి పారిపోయిన కేసులో ఏపీలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట దర్గా మాజీ పీఠాధిపతి (ముత్తవలి) హఫీజ్ పాషాను హైదరాబాద్ లంగర్‌హౌస్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. లంగర్‌హౌస్ ఎండీలైన్స్‌లో నివాసం ఉంటున్న బాలిక మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలువురు వైద్యులను సంప్రదించినా ప్రయోజనం కనిపించలేదు. బంధువుల సూచనమేరకు ఏపీలోని ఏఎస్‌పేట రెహమతాబాద్ షరీఫ్ దర్గా పెద్ద షా గులామ్ నక్స్‌బాంద్ హఫీజ్‌పాషాను సంప్రదించారు. మంత్రాలతో ఆమె వ్యాధి నయం చేస్తానని పలుమార్లు నెల్లూరుకు రప్పించాడు. తాను కూడా తరచు హైదరాబాద్ వచ్చి మలక్‌పేటలో ఉంటూ బాధితులను కలిసేవాడు. మంత్రాలు చదువుతూ వ్యాధి నయం చేస్తున్నట్లు నటిస్తూ నెల్లూరులో పలుమార్లు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. జనవరిలో హైదరాబాద్‌లోని బాధితురాలి ఇంటికి వచ్చిన బాబా ఆమె కుటుంబీకులను బయటికి పంపి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పగా, ఆమెకు పిచ్చి ముదిరిందని బాబా చెప్పడంతో వారు అతడి మాటే నమ్మారు. ఫిబ్రవరి మొదటి వారంలో మరోసారి బాబా ఆమెను కలవాలని చెప్పడంతో కుటుంబసభ్యులు అతడికి తెలియకుండా ఆ గదిలో సీసీ కెమెరాలను అమర్చారు. గదిలోకి వెళ్లిన బాబా బాలికతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని గుర్తించిన కుటుంబీకులు అతడిని నిలదీయగా ఆమెను వివాహం చేసుకుంటానని చెప్పాడు. ఫిబ్రవరి 11న వివాహానికి ఏర్పాట్లు చేయగా అనారోగ్యం పేరుతో ఆస్పత్రిలో చేరిన అతడు కొందరు పెద్దల సహకారంతో అక్కడి నుంచి పరారయ్యాడు. గొడవ పెద్దది కావడంతో మతపెద్దలు, వక్ఫ్‌బోర్డు నిర్వాహకులు జోక్యం చేసుకుని నిందితుడిని దర్గా నిర్వహణ బాధ్యతల నుంచి తొలగించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం హఫీజ్‌పాషాను మలక్‌పేటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడికి తుది వీడ్కోలు

అధికార లాంఛనాలతో అంత్యక్రియల నిర్వహణ



దహన సంస్కారాల ముందు గౌరవవందనం సమర్పిస్తున్న పోలీసులు. చిత్రంలో చంద్రబాబు

సాక్షి,అమరావతి/మచిలీపట్నం టౌన్: టీడీపీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అంత్యక్రియలు శుక్రవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. మల్కాపట్నంలోని బచ్చుల నివాసంలో భౌతికకాయానికి టీడీపీ అధినేత చంద్రబాబు నివాళులర్పించారు. మృతదేహంపై టీడీపీ జెండాను కప్పారు. అర్జునుడు భార్య శివపార్వతి, కుమారులు సుభాష్ చంద్రబోస్, నాగబాబును పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంతిమయాత్ర బచ్చుల స్వస్థలమైన బందరుకోట వైపుగా సాగింది. నగరంలోని ప్రధాన రహదారి గుండా సాగిన ఈ అంతిమ యాత్రలో చంద్రబాబు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే పేర్ని నాని, మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొని బచ్చులకు నివాళులర్పించారు.

సీఎం సంతాపం

ఎమ్మెల్సీ బచ్చుల మృతి పట్ల సీఎం వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

పునరుత్పాదక ఇంధనానికి ఏపీ ప్రోత్సాహం

- స్వచ్ఛ ఇంధనానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ టాప్
- ఐఈఈఎఫ్ఏ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: స్వచ్ఛ ఇంధన వినియోగానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ టాప్‌లో నిలిచింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ ఎకనామిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలిసిస్(ఐఈఈఎఫ్ఏ) తన అధ్యయనంలో ఈ విషయాన్ని వెల్లడించింది. విద్యుత్ రంగంలోని డీకార్బనైజేషన్, పవర్ సిస్టమ్ పనితీరు, పవర్ ఎకోసిస్టమ్ సంసిద్ధత, విధానాలు అనే ప్రధాన అంశాలను ఆధారంగా చేసుకుని ఈ అధ్యయనం జరిగింది. ఇందులో 'శిలాజ శక్తి నుంచి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లుతున్న రాష్ట్రాలు' విభాగంలో ఏపీ ముందు వరుసలో నిలిచింది. దేశంలోని పెద్ద రాష్ట్రాలను కూడా ఏపీ ఈ విషయంలో వెనక్కి నెట్టి జాతీయ స్థాయిలో నంబర్ వన్‌గా నిలిచింది. ప్రస్తుతం ఏపీలో పునరుత్పాదక విద్యుత్ స్థాపిత సామర్థ్యం 10,825.28 మె.వా కు చేరింది. ఇందులో 4,096.65 మెగావాట్లు పవన, 4,390.48 మెగావాట్లు సౌర, 1,610 మెగావాట్లు భారీ జల విద్యుత్, 566.04 మెగావాట్లు బయో పవర్, 162.11 మెగావాట్లు చిన్న జల విద్యుత్, 900.72 మెగావాట్లు ఇతర పునరుత్పాదక ప్రాజెక్టులున్నాయి. 2026–27 నాటికి డిస్కంలు కొనుగోలు చేసే విద్యుత్‌లో 24% పునరుత్పాదక విద్యుత్ ఉండాలని ఏపీఈఆర్సీ పేర్కొంది. అయితే రాష్ట్రంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో పునరుత్పాదక విద్యుత్ వాటా సుమారు 37 శాతంతో ఇప్పటికే ఏపీ ముందంజలో ఉంది.

జిల్లా వార్తలు

పసుపు వర్ణంలో ఎర్ర బంగారం

- పసుపు రంగు మిర్చితో అధిక లాభాలు
- ప్రయోగాత్మకంగా ఇద్దరు రైతులు సాగు చేసిన వైనం
- రైతులను ఆకర్షిస్తున్న పంట



సుబ్బాయిగూడెంలో లాజర్ పసుపు రంగు మిర్చిని ఆసక్తిగా చూస్తున్న రైతులు

పెనుగంచిప్రోలు: మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తగా వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల పంటల్లో ఇప్పటికే ఎన్నో రకాల ప్రయోగాలు చూశాం. అనేక ఉత్పత్తులు సాధారణంగా మనకు కన్పించే వాటికి భిన్నంగా పండిస్తున్నారు. ఉదాహరణకు ఎర్రగా ఉండే మిరపకాయలు మాత్రమే చాలా మందికి తెలుసు. కానీ తాజాగా కొందరు రైతులు పసుపు వర్ణంలో ఉండే మిరపను పండిస్తున్నారు. మామూలు మిర్చి లాగే దిగుబడులు, ధరలు పసుపు రంగు మిరపకు ఉన్నాయని అంటున్నారు. ఎర్ర బంగారంగా పిలిచే మిరప పసుపు వర్ణంలోనూ రావడంపై రైతులు సైతం ఆసక్తిగా గమనిస్తున్నారు.

యువ రైతుల ప్రయోగం....

మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామంలో మీసాల లాజర్, శివాపురం గ్రామంలో లగడపాటి సురేష్ అనే యువ రైతులు ప్రయోగాత్మకంగా చెరొక ఎకరం పసుపు రంగు మిరప సాగు చేశారు. సాగు చేసిన మొదటి ఏడాదే ఫలితం ఆశాజనకంగా ఉండటంతో పలువురు రైతులు పసుపు మిర్చిని చూసేందుకు వస్తున్నారు. సాగు వివరాలను తెలుసుకుంటున్నారు.

సాగు విధానం యథాతథం....

మామూలు ఎరుపు మిర్చి ఎలా సాగు చేస్తామో అలానే పసుపు రంగు మిర్చి సాగు చేయవచ్చని రైతులు అంటున్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, సాగు విధానం అంతా ఒకేలా ఉంటుందన్నారు. నీటి వసతి ఉండి అన్నీ సక్రమంగా ఉంటే ఈ మిర్చి కూడా ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుంది. ఈ మిర్చి ఎదుగుదల కూడా బాగుంటుందని రైతులు అంటున్నారు. ఎరుపు రకాలు సాగు చేసిన రైతులు తామర పురుగుతో అల్లాడుతున్నారు. పెట్టుబడులు పెరిగి దిగుబడి తగ్గుతున్నాయి. అయితే పసుపు రంగు మిర్చి సాగు వలన వైరస్ కొంత కంట్రోల్ అవుతుందని, దిగుబడి తక్కువ ఉన్నా ధర ఉండటం రైతుకు కలిసి వస్తుందని చెబుతున్నారు.



శివాపురంలో రైతు సురేష్ సాగు చేసిన పసుపు రంగు మిర్చి తోట

క్వింటా రూ.40 వేలు పైనే....

పసుపు మిర్చికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కింటా మిర్చి రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకు ఉంటుందని రైతులు అంటున్నారు. ఈమిర్చి పౌడర్‌ను లేస్, కురుకురే, అప్పడాలు, ఔషధాలు, రంగుల తయారీకి వినియోగిస్తున్నారు. గుంటూరు, వరంగల్ మార్కెట్‌లో అమ్మకాలు ఉన్నాయని అంటున్నారు.

మొక్క రూ.2 కు తెచ్చాను



సీజన్ ముగుస్తున్న సమయంలో ఎవరో చెబితే రెడ్డిగూడెం నుంచి ఒకో మొక్క రూ.2 చొప్పున నారు తెచ్చి ఎకరంలో సాగు చేశాను. ఎకరానికి 12 వేల మొక్కలు నాటడం జరిగింది. పెట్టుబడి రూ.1.50 లక్షలు అయింది. ఈఏడాది పసుపు మిర్చి 8 క్వింటాళ్లు వస్తుందని అనుకుంటున్నాను. ప్రస్తుతం పసుపు మిర్చి కింటా రూ.34 వేలు ఉందని అంటున్నారు. గత ఏడాది ఇదే సమయంలో రూ.50 వేలకు పైగా ఉంది. ముందస్తుగా సాగు చేసినట్లయితే దిగుబడి పెరిగేది. స్థానికంగా రైతులు ఎంతో ఆసక్తితో పసుపు రంగు మిర్చిని చూస్తున్నారు.

– మీసాల లాజర్, రైతు, సుబ్బాయిగూడెం

ఎరుపు రంగు మిర్చికి, పసుపు రంగు మిర్చికి తేడా...

	ఎరుపు రంగు మిర్చి	పసుపు రంగు మిర్చి
ధర	కింటా రూ.20 వేలు నుంచి రూ.23 వేలు	కింటా రూ.40 వేలు
దిగుబడి	25 నుంచి 30 కింటాళ్లు	15 నుంచి 20 కింటాలు
సాగు ఖర్చులు	ఎకరానికి రూ.2 లక్షలు	రూ.2 లక్షలు

రైతుభరోసా కేంద్రాలతో రైతులకు ఉన్నత సేవలు



ప్రసంగిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు

పెనమలూరు: రైతు భరోసా కేంద్రాలతో రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు అన్నారు. పోరంకి రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సార్వాలో రైతులు పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించామన్నారు. కొందరు రైతులకు రావాల్సిన రవాణా, హమాలీ చార్జిలను కూడా వెంటనే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్బీకేల్లో ఏప్రిల్ నాటికి పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పసుపు పంట కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యావసాయాధికారి కనకమేడల శైలజ, గ్రామ వ్యవసాయ సలహామండలి చైర్మన్ మంచినేని పరమేష్, వ్యవసాయ సహాయకురాలు స్మైలీ, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బుల్లెట్ వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కృష్ణలంక, బాలాజీనగర్‌కు చెందిన లంకలపల్లి సీతామహాలక్ష్మి(60) శుక్రవారం సాయంత్రం తన స్నేహితురాలు నాగమణితో కలిసి బందరు కాలువ గట్టున ఉన్న చర్చికి వెళ్లారు. తిరిగి 5.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు బందరు కాలువ వైపు నుంచి బాలాజీనగర్‌లోని రామకృష్ణ టవర్స్ వైపు జాతీయ రహదారి దాటుతున్నారు. ఆ సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి వారధి వైపు వేగంగా వెళ్తున్న బుల్లెట్ వాహనం వారిని ఢీకొట్టింది. దీంతో వారిద్దరు కిందపడిపోయారు. సీతామహాలక్ష్మి తలకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో నాగమణి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగమ సలహా మండలి చైర్మన్‌గా సత్యశ్రీనివాస అయ్యంగార్



అయ్యంగార్‌ను సత్కరిస్తున్న కమిషనర్ హరిజవహర్‌లాల్

నరసరావుపేట ఈస్ట్: దేవదాయశాఖ ఆగమ సలహా మండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన వైఖానస ఆగమ పండితుడు డాక్టర్ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గొల్లపూడిలోని దేవదాయశాఖ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. 12 ఆగమాలకు సంబంధించి 12మంది సభ్యులతో కూడిన సలహామండలికి అయ్యంగార్ తొలి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దేవాలయ వ్యవస్థ, అర్చక వ్యవస్థలో శాస్త్రీయబద్ధమైన మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అయ్యంగార్‌ను పట్టణానికి చెందిన వైఖానస ప్రతినిధులు రొంపిచర్ల ఆంజనేయులు, వి.వి.కె.ఎస్.అయ్యంగార్, పి.వి.రంగాచార్యులు, పి.రామకృష్ణమాచార్యులు అభినందించారు.

సింహవాహనంపై మంగళాద్రిపతి

శోభాయమానంగా నారసింహుని బ్రహ్మోత్సవాలు



సింహవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవంలో సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో సింహవాహనంపై కొలువుదీరిన బ్రహ్మాండనాయకుడు నృసింహస్వామి భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చి దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నరసింహుని వేషాలు, భజనలు, నృత్యాలు, కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మల్లాది విష్ణులు స్వామి వారికి పూజలు నిర్వహించి రథాన్ని లాగి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి కళాకారులను అభినందించారు. ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

నేడు హంస, గజవాహనాలపై..

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్న శ్రీవారు అదేరోజు రాత్రి ఏడు గంటలకు గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈవో తెలిపారు.

విజయ గీతం.. ఉత్సాహ నాదం

- కన్నీటిని నాట్యంగా మార్చగలిగే దేవుడు ఏసుక్రీస్తు
- రెండో రోజు సభలో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం
- కొనసాగుతున్న గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



గీతాలు ఆలపిస్తున్న బ్రదర్ అబ్రహాం, పాస్టర్లు జాన్‌వెస్లీ, ఫ్రైడీపాల్, రమేష్

గుంటూరు రూరల్: పశ్చాత్తాపంతో విడిచే కన్నీరు దేవునికి చేరుతుందని, అటువంటి హృదయాలను దేవుడు అంగీకరించి, వారి కన్నీటిని నాట్యముగా మారుస్తాడని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం అన్నారు. నగర శివారులోని గోరంట్ల గ్రామంలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం కొనసాగాయి. పిడుగురాళ్లకు చెందిన పాస్టర్ ఇమ్మానుయేలు ప్రార్థన చేసి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో సండే స్కూల్ చిన్నారులు, హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్స్, సిస్టర్స్ బృందం స్తుతి గీతాలను ఆలపించారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ బ్రదర్ అబ్రహాం మాట్లాడుతూ ప్రభువు మన వైపు చూస్తున్నాడని.. ఆయన మన జీవితాన్ని మార్చగలడన్నారు. తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సి.లాజరస్ సందేశాన్నిస్తూ ఎటువంటి పరిస్థితిలోనైనా కలవరపడకూడదని చెప్పారు. ఏసుక్రీస్తు అందరినీ ఆదరించే దేవుడన్నారు.

పరిశుద్ధాత్మ కుమ్మరింపు..

ఉదయం జరిగిన ప్రత్యేక ప్రార్థనలను వినుకొండకు చెందిన పాస్టర్ జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కడపకు చెందిన పాస్టర్ జాన్ పాల్ మాట్లాడుతూ ఏసు క్రీస్తునందు నమ్మకమైన దాసులుగా ఉండాలన్నారు. కర్నూలుకు చెందిన పాస్టర్ ఫ్రైడీపాల్ సందేశాస్తూ దేవుని పరిశుద్ధాత్మ మనపై కుమ్మరిస్తారని తెలిపారు. ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు క్రీస్తుని సందేశాన్ని విశ్వాసులకు అందజేస్తూ ఏసు క్రీస్తు మరణ శాసనాన్ని రద్దు పరుస్తాడన్నారు. ఆయన మరణాన్ని గెలిచిన దేవుడని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో రెండో రోజు సుమారు 2 లక్షలకు పైగా భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోసం భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పోలీస్, ఆర్‌టీసీ, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా...

ప్రముఖ రచయిత్రి రామలక్ష్మి మృతికి సీఎం సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ రచయిత్రి కె.రామలక్ష్మి మృతికి సీఎం వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆ 8 ప్రశ్నల పూర్తి వివరాలు సమర్పించండి

పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు, హోంశాఖకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షలో 8 ప్రశ్నలకు సరైన జవాబులను నిర్ణయించలేదని, ఈ వ్యవహారాన్ని నిపుణుల కమిటీకి నివేదించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్, హోం శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది పీవీజీ ఉమేష్ చంద్ర వాదనలు వినిపిస్తూ... ప్రిలిమ్స్‌లో 8 ప్రశ్నలకు సరైన జవాబులను ఇవ్వనందున దీనిని నిపుణుల కమిటీకి పంపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13 నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయని, వాటికి పిటిషనర్లను అనుమతించేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయమూర్తి పూర్తి వివరాలను తమ ముందుంచాలని రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్, హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 7కి వాయిదా వేశారు.

ఆ మహిళలిద్దరినీ వారి ఇళ్ల వద్దే విచారించండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై నమోదు చేసిన కేసులో.. తమ ముందు హాజరు కావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ, ఆయన సతీమణి రమాదేవి, నారాయణ విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ పొత్తూరి ప్రమీల హైకోర్టును ఆశ్రయించారు. ఆ నోటీసులను కొట్టేయాలని కోరుతూ ముగ్గురూ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లలో ఇద్దరు మహిళలున్నారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహిళలను వారి ఇంటి వద్దే విచారించాల్సి ఉంటుందన్నారు. ఇదే కేసులో నారాయణను ఆయన ఇంటి వద్దే విచారించాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మహిళలిద్దరినీ వారి ఇళ్ల వద్దే విచారించాలని సీఐడీని ఆదేశించారు.

సింగిల్ జడ్జి తీర్పుపై సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల అప్పీల్

విచారణ 6కి వాయిదా

సాక్షి, అమరావతి : తమ కుమారుడు సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మృతుడి తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణలు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ అకుల వెంకటశేషసాయి, జస్టిస్ ప్రతాప వెంకటజ్యోతిర్మయి ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణను ఈ నెల 6కి వాయిదా వేసింది. అంతకు ముందు అప్పిలెట్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ నిందితుడు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అని, దీంతో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరపడం లేదన్నారు. దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి మూడు నెలల్లో సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారని, ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయాయన్నారు. చార్జిషీట్ దాఖలు చేస్తే ఈ అప్పీల్ నిరర్థకం అవుతుందని, అందువల్ల ఈ వ్యాజ్యంలో తగిన ఉత్తర్వులివ్వాలని కోరారు.

97.17 శాతం మందికి పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 61,86,141 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర సామాజిక పింఛనుదారులకు శుక్రవారం సాయంత్రం వరకు ప్రభుత్వం రూ.1,704.73 కోట్లు పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఉన్న 63.66 లక్షల మంది సామాజిక పింఛను లబ్ధిదారులకు మార్చి ఒకటో తేదీ నుంచి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.1.754.64 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మూడు రోజులుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వలంటీర్లు వెళ్లి 97.17 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారని సెర్ప్ అధికారులు తెలిపారు. మిగిలిన వారికి శని, ఆదివారాల్లో పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

విశాఖలో ‘అండర్ కరెంట్’

రూ.720 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్

- పనులు చేపట్టిన ఏపీఈపీడీసీఎల్
- ఇప్పటికే తీరప్రాంతంలో 28 సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు
- నగరంలో విద్యుత్ వ్యవస్థను భూగర్భ విద్యుత్‌గా మార్చే ప్రయత్నం
- రూ.157 కోట్లతో మూడు జీఐఎస్, 35 ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం
- అత్యంత సురక్షిత వ్యవస్థతో మెరుగైన విద్యుత్ సరఫరా







సాక్షి, అమరావతి: విశాఖలో విద్యుత్ వ్యవస్థను సంపూర్ణంగా మారుస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అత్యంత సురక్షిత విద్యుత్ సరఫరాకు భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. తుపానులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు వచ్చినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నిరంతరం వెలుగులు ప్రసరించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) రూ.720 కోట్లతో ఈ పనులు చేపట్టింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. నగరంలో విద్యుత్ వ్యవస్థ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భూగర్భ విద్యుత్ లైన్లతో రీప్లేస్ చేయాలని ఏపీఈపీడీసీఎల్ భావిస్తోంది.

నగానికి తగ్గనున్న ప్రసార నష్టాలు

భూగర్భ విద్యుత్ కేబుల్ ప్రాజెక్టులో భాగంగా విశాఖ సముద్రతీర ప్రాంతంలోని 28 సబ్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు 115 కిలోమీటర్ల 33 కేవీ లైన్లు, 349 కిలోమీటర్ల 11 కేవీ లైన్లు, 940 కిలోమీటర్ల ఎల్‌టీ లైన్లు, 660 రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్‌ఎంయు)లు, 986 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు), 1,498 ఫీడర్ పిల్లర్లు, 9,179 సర్వీస్ పిల్లర్లు నిర్మించారు. 1,03,281 సర్వీసులను భూగర్భ విద్యుత్ వ్యవస్థతో అనుసంధానించారు. దీంతో ఎంవీపీ కాలనీ, పాండురంగాపురం, సాగర్‌నగర్, బీచ్ రోడ్, జాతీయ రహదారి-16 ప్రాంతాల్లో ఇటీవల తుపాన్ల సమయంలోను నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంది. నగరంలోని మిగతా ప్రాంతాల్లో బహిరంగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, లైన్లను తొలగించి భూగర్భంలోకి మార్చనున్నారు. ఇందుకోసం రూ.157 కోట్లతో మూడు గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ (జీఐఎస్)లు, 35 ఇండోర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్లను నిర్మించాల్సి ఉంది. వీటికోసం 613.31 కిలోమీటర్ల మేర కొత్తగా 33 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టును నాలుగు భాగాలుగా విభజించారు. ఏపీఈపీడీసీఎల్ ప్రస్తుత ప్రసార నష్టాలు 6 శాతంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాల శాతాన్ని సగానికి తగ్గించవచ్చని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాదు.. కరెంటు తీగలకు తగులుతున్నాయని చెట్లను నరికేయాల్సిన అవసరం ఉండదు. కొత్త మొక్కలను కూడా నాటి నగరాన్ని పచ్చదనంతో నింపవచ్చు.

ఈ కేబుళ్లు ప్రత్యేకం

నేషనల్ ఎలక్ట్రిక్ కోడ్ ప్రమాణాలకు అనుగుణంగా భూగర్భ విద్యుత్ లైన్లు ఉండాలి. సరైన వైర్, కేబుల్ ఎంచుకోవడంపైనే ప్రాజెక్టు ఆధారపడి ఉంటుంది. అందువల్ల వాటి ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. కేబుల్‌ను ఎక్కడ ఉపయోగిస్తారు, గేజ్ పరిమాణం, స్ట్రాండ్ సాలిడ్, వోల్టేజ్ రేటింగ్, ఇన్సులేషన్, జాకెట్ రంగు వంటివి పరిగణనలోకి తీసుకోవాలి. వైర్లు, కేబుల్స్ రెండింటినీ భూగర్భ నిర్మాణంలో ఉపయోగించవచ్చు. భూగర్భ తీగను రాగి, అల్యూమినియంతో తయారు చేస్తారు. రాగి తీగ సురక్షితంగా భూమిలో మనగలుగుతుంది. దీనిచుట్టూ అత్యంత భద్రతనిచ్చే పొర ఉంటుంది. ఈ కేబుళ్లు కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోగలవు. వైర్‌కు మట్టికి మధ్య ఒక కండ్యూట్ (గొట్టం) యాంత్రిక అవరోధంగా పనిచేస్తుంది.

సరికొత్త విశాఖను చూస్తాం

విశాఖ సాగరతీర ప్రాంతంలో ఇప్పటికే భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చాలా వరకు పూర్తయింది. నగరంలో మిగిలిన ప్రాంతాల్లోను భూగర్భ విద్యుత్ లైన్లు వేస్తున్నాం. మొత్తం పనులు పూర్తయితే విశాఖలో విద్యుత్ సరఫరా వ్యవస్థ స్వరూపమే మారిపోతుంది. సరికొత్త విశాఖను చూస్తాం. ప్రజలకు అత్యంత సురక్షితంగా, నాణ్యమైన నిరంతర విద్యుత్ అందుతుంది. డిస్కం పరిధిలోని ఉత్తరాంధ్ర జిల్లా శ్రీకాకుళంలోను 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థలోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కె.సంతోషరావు, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

చింతపల్లి మాక్స్ కాఫీకి రికార్డు ధర

- పాచ్‌మెంట్ కాఫీ గింజలు కిలో రూ.312
- ఫ్లోట్ చెర్రీ కాఫీ గింజలు కిలో రూ.142



బహిరంగ వేలం నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ది విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మాక్స్ ఉత్పత్తి చేసిన కాఫీ గింజలు బహిరంగ వేలంలో రికార్డు ధర పలికాయి. కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో 135.25 మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజలు, 17.60 మెట్రిక్ టన్నుల ఫ్లోట్ చెర్రీ కాఫీ గింజల అమ్మకాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీ నుంచి తొమ్మిది ట్రేడర్లకు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సమక్షంలో వ్యాపారులు కొనుగోలు ధరలను ప్రకటించారు. పాడేరుకు చెందిన మోదమాంబ ట్రేడర్స్ అత్యధికంగా ధర ప్రకటించి బిడ్ దక్కించుకుంది. పాచ్‌మెంట్ కాఫీ గింజలకు కిలో రూ.312, చెర్రీ రకానికి కిలో రూ.142 చొప్పున రికార్డు ధర లభించింది. గతేడాది పాచ్‌మెంట్‌కు కిలో రూ.294, చెర్రీకి కిలో రూ.116 ధర మాత్రమే లభించింది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

పార్టీ జెండా కట్టిన వాహనాలతో ప్రభుత్వ పాఠశాలల్లోకి ప్రవేశం



చంద్రంపాలెం హైస్కూల్ గ్రౌండ్‌లో పార్క్ చేసి ఉంచిన టీడీపీ జెండా కట్టిన వాహనం

మధురవాడ (భీమిలి): తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. మధురవాడలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆ పార్టీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, ఆయన అనుచరులు చంద్రపాలెం పాఠశాలలోకి టీడీపీ జెండాలు కట్టిన నాలుగు వాహనాలతో ప్రవేశించారు. అంతటితో ఆగకుండా స్టాఫ్ రూమ్‌లో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పాఠశాల పని వేళల్లో గొలగాని సన్యాసిరావు, గొల్లంగి ఆనందబాబు తదితరులు టీడీపీ టీ షర్టులు, కండువాలు వేసుకుని ప్రవేశించి ప్రచారం నిర్వహించారు.

సత్ఫలితాలిస్తున్న కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్

- మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించి 2022లో నమోదైన 108 కేసుల్లో ఏడురోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు
- 48 కేసుల్లో కోర్టు విచారణ పూర్తి
- నేరస్తులకు జీవితఖైదు, 25 సంవత్సరాల వరకు జైలుశిక్ష



సాక్షి, అమరావతి: దిశ స్ఫూర్తితో మహిళలపై జరిగిన నేరాల్లో బాధ్యులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా రాష్ట్ర పోలీస్ శాఖ అవలంబిస్తున్న కన్విక్షన్ బేస్ పోలీసింగ్ విధానం సత్ఫలితాలిస్తోంది. ఈ విధానాన్ని గత ఏడాది జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెచ్చారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన పోక్సో, మహిళలు హత్య, అత్యాచారం, ఇతర వేధింపులకు గురైన కేసులను జిల్లాకు ఐదు చొప్పున ఎంపికచేసి ఏడురోజుల్లో దర్యాప్తు పూర్తిచేసి, దాదాపు 108 కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేశారు. దీంతో 48 కేసుల్లో కోర్టు విచారణ పూర్తయి నేరస్తులకు జీవితఖైదుతో పాటు, ఏడు నుంచి 25 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడింది. 13 కేసుల్లో విచారణ పూర్తయి తీర్పులు రిజర్వ్ అయ్యాయి. 47 కేసుల్లో విచారణ ముగింపుదశలో ఉంది. మరోవైపు గత ఏడాది నమోదైన 101 పోక్సో కేసుల్లో నేరస్తులకు కోర్టుల్లో కఠిన శిక్షలు పడ్డాయి. దిశ స్ఫూర్తితో పోలీస్ శాఖ చేసిన కృషితో ఈ ఏడాది రాయచోటి, కోనసీమల్లో మహిళలు అత్యాచారం, హత్యకు గురైన కేసులు, ఏలూరు జిల్లాలో తల్లీకూతుళ్ల అమానుష హత్య, బాపట్లలో ప్రేమ పేరుతో వేధింపులకు గురై యువతి హత్యాయత్నం సహా పలు కేసుల్లో ఏడురోజుల్లోనే పోలీసులు దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేశారు.

కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ఇలా..

ఈ విధానంలో ఎస్పీలు తమ పరిధిలో నమోదైన మహిళలు, యువతులు, చిన్నారులపై జరిగిన ఐదు తీవ్రమైన నేరాల కేసులను ప్రాధాన్యమైనవిగా ఎంపిక చేస్తారు. ఈ కేసులను.. ప్రతిరోజు షెడ్యూల్ మేరకు కోర్టులో జరుగుతున్న కేసు ట్రైల్ పురోగతిపై సమీక్షిస్తారు. తద్వారా కేసు ట్రైల్ సమయాన్ని తగ్గించి స్వల్పకాల వ్యవధిలోనే నేరస్తులకు శిక్షపడటమేగాక ఒక్క నేరస్తుడు కూడా తప్పించుకోకుండా అవకాశం ఉంటుంది. ఈ కేసులపై ఐపీఎస్ అధికారి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతో నేరస్తులు సాక్షులను బెదిరించే ఘటనలకు ఆస్కారం ఉండదు. డీజీపీ సైతం తన రోజువారీ ఎస్పీల టెలీకాన్ఫరెన్స్‌లో ప్రత్యేకంగా ఈ కేసులపై చర్చిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు.

సమష్టి కృషితోనే సాధ్యం



కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానం సత్ఫలితాలిస్తోంది. నేరస్తులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది నుంచి అన్ని స్థాయిల్లోని అధికారుల సమష్టికృషితోనే ఇది సాధ్యం అవుతోంది. మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోంది.

– కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ

టీడీపీ అధికారంలోకొస్తే పాల ధరలు పెంచుతాం

పాదయాత్రలో నారా లోకేశ్

పుంగనూరు (చిత్తూరు జిల్లా): వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకొస్తే పాల ధరలు, మామిడి ధరలు పెంచి.. పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని నారా లోకేశ్ చెప్పారు. పుంగనూరు నియోజకవర్గంలోని మంగళంపేటలో శుక్రవారం జరిగిన సభలో లోకేశ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు సీఎం అయితే మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని, పాల రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఈ ప్రభుత్వంలో పరిశ్రమలు, రిజర్వాయర్లు ఏర్పాటుకాలేదని, స్వార్థం కోసం పనులు చేస్తున్నారంటూ ఆరోపించారు. టీడీపీ అధికారంలో వస్తే మదనపల్లెను జిల్లా చేస్తానని, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలను ఆ జిల్లాలో కలుపుతామని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఆరోపణలు చేస్తూ ప్రసంగాన్ని కొనసాగించారు. పర్యటనలో స్థానికేతరులను పిలిపించినా రాకపోవడంతో పాదయాత్ర పేలవంగా సాగింది.

• తెలంగాణ

ఒలింపియాడ్‌లో నారాయణ విద్యా సంస్థలకు ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: హెచ్‌బీసీఎస్‌ఈ, భారత ప్రభుత్వం సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్, ఇంటర్నేషనల్ మ్యాథమేటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన 38 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూరనారాయణ, శరణి నారాయణ తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జరిగిన ఈ పోటీలో మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు 12 మంది, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌కు తొమ్మిది మంది, ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఐదుగురు, సైన్స్ ఒలింపియాడ్‌కు ఏడుగురు, ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌కు ఐదుగురు ఓరియంటేషన్ క్యాంప్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. సైన్స్ ఒలింపియాడ్‌లో తెలంగాణ నుంచి ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌కు ఎంపికైన ఒకే ఒక్కరు తమ విద్యా సంస్థకు చెందిన వారేనని పేర్కొన్నారు.

గుండెపోటుతో 18 ఏళ్ల ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

హైదరాబాద్ కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలో విషాదం

మేడ్చల్: వయసుతో పనిలేకుండా ప్రాణాలు తీస్తున్న గుండెపోటు 18 ఏళ్ల విద్యార్థిని బలిగొంది. రాష్ట్రంలో వరుసగా గుండెపోటుతో మరణిస్తున్న వారి జాబితాలో సచిన్ అనే విద్యార్థి చేరాడు. రాజస్తాన్‌కు చెందిన సచిన్ హైదరాబాద్ శివార్లలోని సుచిత్రలో తల్లితండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడు కండ్లకోయలోని సీఎంఆర్ 4 క్యాంపస్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలకు వచ్చిన సచిన్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో తరగతి గది నుంచి బయటకు వచ్చి భవనం ఆవరణలో ఉండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. తనకు ఛాతీలో నొప్పి వస్తోందంటూ స్నేహితులకు చెబుతూనే అక్కడే కూలిపోయాడు. స్నేహితులు వెంటనే పక్కనే ఉన్న సీఎంఆర్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే సచిన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సచిన్ మృతదేహాన్ని కళాశాల యాజమాన్యం తల్లితండ్రులకు అప్పగించింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు.

బడి బయటి పిల్లల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు

- 11,331 మంది చిన్నారుల కోసం ఏర్పాటు
- టీచర్ వలంటీర్ల ద్వారా నిర్వహణ
- వీరికి డీఈడీ, బీఈడీ అర్హతలు తప్పనిసరి
- పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, తదితర వస్తువులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బడుల్లో చేరని బాలల కోసం నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లు (ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ) ఏర్పాటు చేయాలని సమగ్ర శిక్ష విభాగం రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం.. 6 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయాలన్న లక్ష్యం మేరకు సమగ్ర శిక్ష విభాగం ఈ ప్రత్యేక శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరంలో ఏ స్కూల్‌లోనూ నమోదు కాకుండా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారికి ప్రాథమిక విద్యను ఈ కేంద్రాల ద్వారా అందించనున్నారు. ఇలా బడి బయట ఉన్న పిల్లలు రాష్ట్రవ్యాప్తంగా 11,331 మంది ఉన్నట్లు సమగ్ర శిక్ష విభాగం గుర్తించింది. వీరికి నాన్ రెసిడెన్షియల్ విధానంలో 3, 6, 9 నెలల కాల వ్యవధితో ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. విద్యార్థులు ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. వీటిలో టీచర్ వలంటీర్లను నియమించి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించనున్నారు. అనంతరం ఆ విద్యార్థులను వారి వయసుకు తగ్గ తరగతుల్లో చేర్చనున్నారు. సమగ్ర శిక్ష విభాగం జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తల ద్వారా టీచర్ వలంటీర్లను నియమించనున్నారు.

టెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యత

ప్రత్యేక శిక్షణా కేంద్రాలకు సంబంధించి ప్రాథమిక స్థాయిలో టీచర్ వలంటీర్లకు ఇంటర్మీడియెట్‌తో డీఈడీ, ప్రాథమికోన్నత స్థాయిలో డిగ్రీ, బీఈడీ పూర్తిచేసి ఉండాలి. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణులకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. టీచర్ వలంటీర్లకు నెలకు రూ.7,500 చొప్పున అందిస్తారు. వలంటీర్లకు ఐదు రోజులపాటు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కింద ప్రతి సెంటర్‌కు రూ.1,000 విలువైన వస్తువులు అందిస్తారు. ఇవికాకుండా ప్రతి కేంద్రంలోని పిల్లలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇస్తారు. పిల్లలకు సంబంధించిన స్టేషనరీకి రూ.200, బ్యాగుకు రూ.200, చెప్పులకు రూ.100 చొప్పున అందిస్తారు. పిల్లలకు కావాల్సిన వివిధ సబ్జెక్టుల పుస్తకాలను సమగ్ర శిక్ష విభాగం అందజేస్తుంది.

ప్రతి కేంద్రంలో కనిష్టంగా 20 మంది

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 1 నుంచి 3 కిలోమీటర్ల దూరంలోపు ఉన్న పిల్లల కోసం ఈ ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. కొండలు, నదులు, వాగులు వంటి ఆటంకాలు ఉన్న చోట స్కూల్ పాయింట్‌లోనే వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఎంఈవోలు, హెడ్మాస్టర్ల పర్యవేక్షణలోనే ఇవి కొనసాగాలని, ఎన్‌జీవోల ద్వారా నిర్వహించరాదని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో కనిష్టంగా 20 మంది విద్యార్థులు ఉండాలని సూచించారు. మారుమూల, కొండ ప్రాంతాల్లో వీరి సంఖ్య 13 వరకు ఉండొచ్చన్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీ ఈ కేంద్రాలకు అనుమతి మంజూరు చేస్తుంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత మండలం, పంచాయతీ, గ్రామానికి చెందిన వారికి ప్రాధాన్యమిస్తారు. అర్హులైనవారు లేనిపక్షంలో మండల పరిధిలో లేదా డివిజన్ పరిధిలో ఇతరులకు అవకాశం కల్పిస్తారు.

సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా చారుసిన్హా

తొలి మహిళా ఐజీగా రికార్డు

సాక్షి, హైదరాబాద్: సీఆర్పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) సదరన్ సెక్టార్ ఐజీగా 1996 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి చారు సిన్హా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రస్తుత ఐజీ మహేశ్‌చంద్ర లడ్డా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా కూడా చారు సిన్హా రికార్డు సొంతం చేసుకున్నారు. కేంద్ర సర్వీసులకు వెళ్లకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, చిత్తూరు, తూర్పు గోదావరి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లలో ఎస్పీగా పనిచేశారు. యూఎన్ మిషన్ కోసం కోసావ్‌లోనూ పనిచేశారు. అక్కడ స్థానిక ముస్లిం, క్రిస్టియన్ తెగల మధ్య వివాదాల పరిష్కారంలో కీలకంగా పనిచేశారు. ఏసీబీ డైరెక్టర్‌గా, అనంతపురం రేంజ్ డీఐజీ అనంతపురం, చిత్తూరు జిల్లా పరిధిలో శాంతిభద్రతల నిర్వహణలో అత్యంత కీలకంగా పనిచేశారు. తెలంగాణ కేడర్ చారుసిన్హా తన కెరీర్‌లో అత్యంతకీలకమైన పోస్టుల్లో పనిచేసి విజయవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అప్పటి వరకు మహిళా ఐపీఎస్‌లు నిర్వర్తించని బాధ్యతలతో తనపేరిట అరుదైన రికార్డులను నెలకొల్పారు. ఉగ్రవాద ప్రభావిత ప్రాంతమైన జమ్మూ సెక్టార్ ఐజీగా, శ్రీనగర్ సెక్టార్‌లో కలిపి మూడున్నరేళ్లపాటు విజయవంతంగా పనిచేశారు. అంతకు ముందు సీఆర్పీఎఫ్ బిహార్ కమాండ్ ఐజీగా నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లు చేపట్టారు.



కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వృద్ధురాలు చిన్నక్కకు పింఛను అందజేస్తున్న వలంటీర్



నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో వలిపి లోకేష్‌కు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్



గుంటూరుకు చెందిన మస్తాన్‌వలికి వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్



ఒంగోలులో వృద్ధురాలు డి.సరోజనమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్



ఏలూరులో మంచం దిగలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు గెద్దపు కన్నమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్


లైఫ్@360

బెటర్ మిల్క్



మజ్జిగను బటర్ మిల్క్ అంటాం కదా.. వేసవి వచ్చేసరికి ఇది కాస్తా బెటర్ మిల్క్‌గా మారుతుంది. అదెలాగంటే... మజ్జిగ తాగేవాడికి ఏ వ్యాధులూ కలగవనీ, వచ్చిన వ్యాధులు తగ్గి, తిరిగి తలెత్తకుండా ఉంటాయనీ, చర్మరోగాలు, దీర్ఘకాలిక వ్యాధులు, కొవ్వు, అమిత వేడి తగ్గిపోతాయనీ, శరీరానికి మంచి వర్చస్సు కలుగుతుందనీ ఆయుర్వేద నిపుణులు, పెద్దలు చెబుతారు.

- మజ్జిగ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అధిక దాహం తీరుతుంది. అంతేకాదు, వడ దెబ్బ తగలకుండా ఉంటుంది.
- జీలకర్ర, ధనియాలు, అవిసెగింజలు, సైంధవ లవణం మెత్తగా పొడి చేసుకుని మజ్జిగలో కలుపుకుని తాగితే మంచిది. ఇలా తయారు చేసుకున్న మజ్జిగని లంచ్‌తో లేదా మధ్యాహ్నం 3–4 గంటల సమయంలో తాగడం వల్ల సులువుగా బరువు తగ్గవచ్చు.





- ధనియాలు, జీలకర్ర, శొంఠి ఈ మూడింటినీ 100 గ్రాముల చొప్పున దేనికదే మెత్తగా దంచి, మూడింటినీ కలిపి తగినంత ఉప్పు కూడా చేర్చి, దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోండి. ఎండలో తప్పనిసరి అయి బయటకు వెళ్లేటప్పుడు... ఒక గ్లాసు పాలు తీసుకొని, కాచి చల్లార్చి అందులో రెండుగ్లాసుల పుల్లని మజ్జిగ కలపండి.

ఇందులో పంచదార, ఉప్పు బదులుగా పైన చెప్పుకున్న మిశ్రమాన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగండి, వడదెబ్బ కొట్టదు, పేగులకు బలాన్నిస్తుంది, జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది, వేసవిలో కలిగే జలుబుని నివారిస్తుంది,

- సాధ్యమైనంత వరకు మజ్జిగని ఫ్రిజ్‌లో పెట్టకూడదు. అలా పెట్టడం వల్ల ఇందులో ఉండే మేలు చేసే బాక్టీరియా నిరర్థకం అవుతుంది, అదేవిధంగా ప్యాక్ చేసిన మజ్జిగ బదులు అప్పటికప్పుడు తయారు చేసుకున్న తాజా మజ్జిగ తాగడం ప్రయోజనకరం. బయటకు వెళ్లినప్పుడు శీతల పానీయాల బదులు కనీసం ప్యాక్ చేసిన మజ్జిగ తాగినా ఫరవాలేదు.

వేసవిలో విద్యుత్ ఇలా ఆదా..

మార్చి అడుగు పెట్టిందో లేదో వేసవి వచ్చేసింది. సూర్యుడి చురచురలు షురూ అయ్యాయి. ఈ చికాకులను చల్లార్చేందుకు ఫ్యాన్‌లు, కూలర్‌లు, ఏసీలు విధి నిర్వహణలో బిజీగా ఉంటాయి. కరెంటు మీటరు కూడా దాని పని అది చేసుకుపోతుంటుంది. ఈ మూడు నెలలూ వచ్చే బిల్లు చూసి గుండె గుభిల్లుమనకుండా కొన్ని చిట్కాలు పాటించడం వల్ల కరెంటు బిల్లులో కోత పెట్టవచ్చు. అవేంటో చూద్దాం.



- అవసరం లేనప్పుడు లైట్లను, ఇతర విద్యుత్ పరికరాలను స్విచ్ ఆఫ్ చేయడం, పగటి పూట విద్యుత్ వాడకాన్ని నిరోధించడం, గోడలకు, సీలింగ్‌లకు లైట్ కలర్స్ వేయడం వల్ల విద్యుత్ ఆదా అవుతుంది.
- సీలింగ్ ఫ్యాన్‌లకున్న ఎలక్ట్రానిక్ రెగ్యులేటర్ల స్థానంలో కన్వెన్షనల్ రెగ్యులేటర్లను అమర్చాలి.
- ఫ్యాన్, ఏసీని ఆపకుండా తలుపులు మాటి మాటికి తెరుస్తూ మూస్తూ ఉండటం వల్ల బోలెడంత విద్యుత్ వృథా జరుగుతుంది. తలుపులు కిటికీలు మూసేసి ఏసీని కాసేపు ఆన్ చేసి ఉంచాలి. గది చల్లబడ్డ తర్వాత ఏసీ ఆఫ్ చేయాలి. అలాగే ఉపయోగంలో లేనప్పుడు ఎలక్ట్రికల్ పరికరాలను ఆపివేయాలి. దీంతో విద్యుత్తు వృథా చేయకుండా ఉండగలుగుతారు.
- పాత ఫిలమెంట్, సిఎఫ్ఎల్ బల్బ్‌లు చాలా విద్యుత్తును వినియోగిస్తాయి. వాటిని ఎల్ఈడీ బల్బులతో భర్తీ చేస్తే విద్యుత్ బిల్లు తగ్గడమే కాకుండా కాంతి కూడా రెట్టింపవుతుంది.
- ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్ మొదలైన వాటిని కొనుగోలు చేసేటప్పుడు 5 నక్షత్రాల రేటింగ్ ఉన్న వాటినే కొనుగోలు చేయడం మంచిది. వీటి ప్రారంభ ధర కొంచెం ఎక్కువగా ఉన్నా, విద్యుత్ బిల్లు తక్కువే వస్తుంది.

ఎయిర్ కండీషనర్ ఎల్లప్పుడూ 24 డిగ్రీల ఉష్ణోగ్రత వద్దే నడపాలి. టైమర్ సెట్ చేస్తే గది చల్లగా ఉన్నప్పుడు ఏసీ దానంతట అదే ఆగిపోతుంది.



- ఏసీ/ ఫ్యాన్/కూలర్ లో దుమ్ము పేరుకుని పోయినప్పుడు సరిగా పని చేయక విద్యుత్ వృథా అవుతుంది. అందువల్ల ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం ఉత్తమం.

ఇలా చేస్తే ఇల్లంతా శుభ్రమే!



ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ సోఫా, మ్యాట్రెసెస్, టేబుల్స్, చైర్స్ ఇలా చాలా రకాల ఫర్నీచర్ ఉంటుంది. వీటిని శుభ్రం చేయకపోతే దుమ్ము, ధూళి పేరుకుని పోయి చాలా అపరిశుభ్రంగా కనిపిస్తాయి. అంతేకాదు, వీటివల్ల డస్ట్ అలర్జీ ఉన్న వారికి ఎంతో ఇబ్బంది కలుగుతుంది. వీటిలో దాగి ఉండే సూక్ష్మక్రిముల వల్ల రకరకాల అనారోగ్యాలు వస్తుంటాయి. వీటిని క్లీన్ చేసేందుకు కొన్ని టిప్స్ పాటించాలి. దీనివల్ల ఫర్నీచర్ శుభ్రంగా కనిపించడంతోపాటు ఎక్కువకాలం మన్నుతుంది కూడా. ఫర్నీచర్‌ను శుభ్రం చేసేందుకు ఏం చేయాలో చూద్దాం.

సోఫా: ఆరు టీస్పూన్ల బాత్ సోప్ పౌడర్ తీసుకోండి. ఈ పొడికి కప్పు వేడి నీరు కలపండి. సబ్బు నురగ వచ్చిన తర్వాత దానికి రెండు టీస్పూన్ల అమ్మోనియా లేదా తేనె జోడించండి. ఈ ద్రావణం చల్లబడిన తర్వాత దానిని బాగా కలపండి. దీంతో నురగ వస్తుంది. ఒక క్లాత్ లేదా స్పాంజ్ సహాయంతో ఈ నురగతో సోఫా పై భాగంలో శుభ్రం చేయండి. దీని తరువాత సోఫాను ఫ్యాన్ కింద ఆరనివ్వండి. దీంతో ఫ్యాబ్రిక్ సోఫా కొత్తగా కనిపిస్తుంది.

లెదర్ సోఫా: లెదర్ సోఫాను క్లీన్ చేసే ఏకైక మార్గం మైల్డ్ క్లీనర్‌తో శుభ్రం చేయడమే. ఇందుకోసం ఎప్పుడూ మృదువైన బ్రష్.. వాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించాలి. శుభ్రం చేయడానికి నీటితో కలిపిన వెనిగర్ ద్రావణాన్ని ఉపయోగించవచ్చు.

డైనింగ్ టేబుళ్లు, చెక్క కుర్చీలు తదితర ఉడెన్ ఫర్నీచర్‌ని తుడిచేందుకు పొడి వస్త్రాన్ని వాడండి. వీటిని మరింతగా మెరిసేలా చేయాలంటే వ్యాక్స్, పాలిష్ కూడా చేయొచ్చు. అదే విధంగా దుమ్ముని క్లీన్ చేయాలంటే డిష్ వాష్‌ని నీటిలో కలిపి అందులో మెత్తటి బట్టను ముంచి బయటికి తీసి పిండి దానితో ఫర్నీచర్‌ని రుద్దాలి. తర్వాత పొడిబట్టతో చక్కగా తుడవండి. ఇలా క్లీన్ అయిన ఫర్నీచర్‌ని పూర్తిగా ఆరబెట్టండి.

కొన్ని వస్తువులు పాత పాలిష్‌తో చూడ్డానికి అంత బాగుండవు. వీటిని క్లీన్ చేయాలంటే.. ముందుగా కొద్దిగా టీ బ్యాగ్స్ తీసుకుని వేడినీటిలో వేసి డికాషన్ చేయాలి. ఇది గోరువెచ్చగా అయ్యే వరకూ ఉంచి గుడ్డపై దీనిని పోస్తూ కొద్దికొద్దిగా తుడవాలి. టీ డికాక్షన్‌లోని యాసిడ్ ఉడ్‌ని క్లీన్ చేస్తుంది.

మరకలు దూరమవ్వాలంటే..

కొన్నిసార్లు డైనింగ్ టేబుల్‌పై ఫుడ్ ఐటమ్స్ మూలాన మరకలు పడుతుంటాయి. వాటిని తొలగించాలంటే... మరకలు పడ్డ చోట కాస్తంత టూత్‌పేస్ట్ అప్లై చేసి దానితో రుద్దాలి. ఆరిన తర్వాత ఒక తడిబట్టతో శుభ్రంగా తుడిచెయ్యండి. మరకలు మొండిగా ఉంటే బేకింగ్ సోడా, టూత్‌పేస్ట్‌లను సమానంగా కలిపి వాటితో రుద్దండి. కాసేపయ్యాక తడిగుడ్డతో తుడిచి ఆరబెట్టండి.

సీలింగ్ ఫ్యాన్‌లు

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లు ఎక్కువ ఎత్తులో అమర్చుతారు. అందువల్ల ముందుగా మీరు టేబుల్ పైకి ఎక్కి ఫ్యాన్‌ను తీసేయండి. ఆ తర్వాత ఫ్యాన్ బ్లేడ్‌ని తీసి విడిగా శుభ్రం చేయండి. రెక్కలను కూడా సబ్బుతో రుద్ది శుభ్రంగా కడిగిన తర్వాత పొడి వస్త్రంతో తుడవాలి.

రెండో విధానం.. పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలలో ఒకదానిని కవర్ చేయాలి. ఇప్పుడు కవర్ పైనుంచి చేతులతో రుద్దాలి. అదే విధంగా మూడు రెక్కలను శుభ్రం చేయాలి. రెక్కలపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి, బూజు అంతా కవర్ లోపల పడిపోతుంది. తర్వాత దాన్ని పారవేసి పిల్లో కవర్‌ను ఉతుక్కుంటే సరిపోతుంది.



గుర్తుంచుకోవాల్సింది.. ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరవాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు కళ్లకి ప్లెయిన్ గ్లాసెస్ లేదా సన్ గ్లాసెస్ ధరిస్తే కంట్లో దుమ్ము పడకుండా ఉంటుంది. అలాగే ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి లేదంటే డస్ట్ అలర్జీ వచ్చే ప్రమాదం ఉంది. ఫ్యాన్‌ని క్లీన్ చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం మరచిపోవద్దు.

గోడలపై ఇంక్ మరకలు, పెన్ను గీతలు

టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాలో కొద్దిగా నీరు కలిపి పేస్ట్‌లా చేయండి. ఈ పేస్ట్‌ని మరకలపై పట్టించి రుద్ది తడిగుడ్డతో తుడిచెయ్యాలి.

దీనికి మరో పద్ధతి ఉంది. అదేంటంటే... గిన్నెలో కాసిన వేడినీళ్లు తీసుకోవాలి. అందులో కొన్ని చుక్కల షాంపూ వేసి బాగా కలపాలి. గోరువెచ్చగా అయిన తర్వాత ఆ నీటిలో ఒక క్లాత్‌ను ముంచి మరకలు పడ్డ చోట రుద్దండి. ఆరిన తర్వాత తడిబట్టతో తుడవండి. మరకలు పలచబడతాయి. కొద్దిరోజుల తర్వాత మరోసారి ఇలాగే చేయాలి. ఇలా ఒకటి రెండుసార్లు చేయడం మంచిది.

ఉడెన్ ఫర్నిచర్: చెక్కతో చేసిన గృహోపకరణాలు పాడు కాకుండా ఉండాలంటే టీ డికాషన్‌లో మెత్తటి క్లాత్‌ను నానబెట్టి పిండి దాంతో తుడవండి. ఇలా చేస్తే రంగు వెలిసిన ఫర్నీచర్‌కు కూడా తిరిగి మెరుపు వస్తుంది.

చెక్కపై నీటి మరకలు దాని అందాన్ని పాడు చేస్తాయి. నీటి మరకలు పడినచోట వైట్ టూత్ పేస్ట్ (జెల్ పేస్ట్ కాదు) రాయండి. తర్వాత మెత్తని బట్టతో రుద్దాలి. అప్పుడు టూత్‌పేస్ట్‌ను తీసివేసి.. తడిబట్టతో తుడిచేయాలి.

చెక్క ఫర్నిచర్‌పై మసి ఉంటే.. టీస్పూన్ బేకింగ్ సోడాను నీటిలో వేసి కరిగించండి. మసి ఉన్న ప్రాంతంపై దీన్ని అప్లై చేయండి. తర్వాత మెత్తని పొడిబట్టతో తుడవండి.

సినిమా

క్రేజీ కాంబినేషన్ సెట్



● సందీప్, అల్లు అర్జున్

'పుష్ప'తో పాన్ ఇండియా స్టార్ లిస్ట్‌లో చేరిపోయారు మాస్ హీరో అల్లు అర్జున్. తొలి సినిమా 'అర్జున్ రెడ్డి'తో యూత్‌కి దగ్గర కావడంతో పాటు తనలో మంచి మాస్ డైరెక్టర్ ఉన్న విషయాన్ని నిరూపించుకున్నారు సందీప్ రెడ్డి వంగ. ఒక మాస్ హీరో.. మాస్ డైరెక్టర్ కాంబినేషన్ అంటే కచ్చితంగా క్రేజీ అనే చెప్పాలి. అల్లు అర్జున్ హీరోగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా అధికారిక ప్రకటన శుక్రవారం వెల్లడయింది. టీ సిరీస్ ప్రొడక్షన్స్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్స్ పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. గతంలో పలు సందర్భాల్లో తన తొలి చిత్రం 'అర్జున్ రెడ్డి'లో అల్లు అర్జున్ నటించి ఉండి ఉంటే ప్రభావం బలంగా ఉండి ఉండేదని పేర్కొన్నారు సందీప్. ఇప్పుడు ఈ హీరోతో ఎలాంటి సినిమా ప్లాన్ చేశారో చూడాలి.

మాస్ యాక్షన్ షురూ

గోపీచంద్ కెరీర్‌లో 31వ చిత్రం పూజా కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మించనున్నారు. రాధామోహన్ మాట్లాడుతూ – ''మా బేనర్‌లో 14వ చిత్రాన్ని గోపీచంద్, హర్ష కాంబినేషన్‌లో నిర్మించడం ఆనందంగా ఉంది. కన్నడలో పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హర్ష ఈ భారీ బడ్జెట్ చిత్రంతో తెలుగులోకి అడుగు పెడుతున్నారు. ఇప్పటివరకూ గోపీచంద్ పలు భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లు చేశారు. ఈ చిత్రం వాటికి భిన్నంగా ఉంటుంది. మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న మాసీవ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ నెలలోనే షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: స్వామి .జె.



● గోపీచంద్ ఎ. హర్ష

అవార్డు అందనుంది!

గత ఏడాది డిసెంబరులో 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు 'స్పాట్‌లైట్' అవార్డును ప్రకటించింది హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). ఈ అవార్డుల ప్రదానోత్సవం ఫిబ్రవరి 25న కాలిఫోర్నియా వేదికగా జరిగింది. ఈ వేడుకకు ఓ ప్రజెంటర్‌గా వెళ్లారు రామ్‌చరణ్. అలాగే ఈ అవార్డుల ప్రదానోత్సవంలో తనకు రావాల్సిన 'హెచ్‌సీఏ' స్పాట్‌లైట్ అవార్డును స్వీకరించారు రామ్‌చరణ్. దీంతో 'హెచ్‌సీఏ స్పాట్‌లైట్ అవార్డు కేవలం రామ్‌చరణ్‌కే వచ్చిందా? ఎన్టీఆర్‌కు రాలేదా?' అంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు స్పందించారు. ఈ విషయంపై ట్విటర్ వేదికగా 'హెచ్‌సీఏ' ప్రతినిధులు స్పందించారు. ''హెచ్‌సీఏ స్పాట్‌లైట్ అవార్డును స్వీకరించేందుకు ఎన్టీఆర్‌కూ ఆహ్వానం పంపాం. అయితే కొత్త సినిమా షూటింగ్ కారణంగా ఆయన హాజరు కాలేదు'' అని హెచ్‌సీఏ ప్రతినిధులు పేర్కొన్నారు. కాగా ఎన్టీఆర్, ఆలియా భట్‌లకు వారి హెచ్‌సీఏ స్పాట్‌లైట్ అవార్డ్స్‌ను వచ్చే వారం అందించనున్నామని 'హెచ్‌సీఏ' ప్రతినిధులు ట్వీట్ చేసి, ఆ అవార్డు ఫోటోలను షేర్ చేశారు. 'హెచ్‌సీఏ' అవార్డుల ప్రదానోత్సవంలో 'బెస్ట్ స్టంట్స్', 'బెస్ట్ యాక్షన్ మూవీ', 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్', 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్' విభాగాల్లో 'ఆర్ఆర్ఆర్'కు అవార్డులు వచ్చిన సంగతి తెలిసిందే.



● ఎన్టీఆర్

ఆస్కార్‌కి ఆహ్వానం



● దీపికా పదుకోన్

బాలీవుడ్ ప్రముఖ నటి దీపికా పదుకోన్‌కు ఆస్కార్ అవార్డు కమిటీ నుంచి ఆహ్వానం అందింది. మార్చి 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13) లాస్ ఏంజిల్స్‌లో ఆస్కార్ వేదికపై మెరవనున్నారామె. జిమ్మి కెమ్మల్ హోస్ట్‌గా జరగనున్న 95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో ఓ ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు దీపికా పదుకోన్. ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవ తొలి దశ ప్రెజెంటర్స్ 16 మంది జాబితాను నిర్వాహకులు ప్రకటించారు. రిజ్ అహ్మద్, ఎమిలీ బ్లంట్, మైఖేల్ బి జోర్డాన్, గ్లెన్ క్లోజ్, శ్యామ్యుల్ ఎల్. జాక్సన్, డ్వేన్ జాన్సన్, జోయ్ సాల్డానా, జెన్నిఫర్ కొన్నెల్లీ తదితర హాలీవుడ్ తారలు ఉన్న ఈ జాబితాలో దీపికా పదుకోన్ ఉన్నారు. ఇక 2017లో జరిగిన ఆస్కార్ ఆఫ్టర్ పార్టీ (అవార్డుల ప్రదానోత్సవం తర్వాత జరిగే పార్టీ)లో పాల్గొన్న దీపికా ఈసారి ఓ ప్రెజెంటర్‌గా ఈవెంట్‌కు వెళ్తుండటం విశేషంగా చెప్పుకోవచ్చు. అలాగే ప్రెజెంటర్స్ మలి జాబితాలోనూ ఇండియన్ స్టార్స్ ఉంటారా? అనే విషయం తెలియాలంటే కొంత సమయం వేచి ఉండాలి. ఇక 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో అవార్డు కోసం 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాట నామినేట్ అయిన సంగతి తెలిసిందే. ఆస్కార్ వేదికపై లైవ్‌లో ఈ పాట పాడనున్నారు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్. కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా ప్రేమ్‌రక్షిత్ కొరియోగ్రఫీ చేశారు.

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' గత ఏడాది మార్చిలో విడుదలైన సంగతి తెలిసిందే.

మొదలైన ఓటింగ్

ఆస్కార్ అవార్డు విజేతలకు సంబంధించిన ఆన్‌లైన్ ఓటింగ్ గురువారం ఆరంభమైంది. ఈ ఓటింగ్ మార్చి 7 వరకు జరుగుతుంది. ఆస్కార్ అకాడమీలో పదివేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ ఆన్‌లైన్‌లో ఓటింగ్ వేస్తారు. ఓటర్స్‌లో ఉన్న యాక్టర్స్ 'యాక్టింగ్' విభాగానికి, ఎడిటర్స్ 'ఎడిటింగ్' విభాగానికి.. ఇలా ఇతర విభాగాలకు చెందినవారు ఆ విభాగానికి ఓట్లు వేస్తారు. కానీ 'ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్', 'యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్' విభాగాల ఓటింగ్‌కు మాత్రం ప్రత్యేక నియమ నిబంధనలున్నాయి. అలాగే బెస్ట్ పిక్చర్స్ విభాగానికి ఆస్కార్ ఓటర్స్ అందరూ ఓటు వేయొచ్చు. ఓటింగ్ పూర్తయ్యాక ఆ ఫలితాలు ప్రైస్‌వాటర్ హౌస్‌కూపర్స్ సంస్థ వద్దే ఉంటాయి. అవార్డులను అధికారికంగా ప్రకటించడానికి ముందు ప్రైస్ వాటర్‌హౌస్‌కూపర్స్ (ఆస్కార్ ఆన్‌లైన్ ఓటింగ్ రిజల్ట్స్ సెక్యూరిటీని చూసే వారు)కు చెందిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే విజేతలు ఎవరో తెలుస్తుందని అవార్డు కమిటీ పేర్కొంది.

బెస్ట్ పిక్చర్ ఓటింగ్ ఇలా..

బెస్ట్ పిక్చర్ విభాగంలో నామినేషన్ దక్కించుకున్న చిత్రాలకు ఆస్కార్ ఓటర్లు 1, 2, 3.. అంటూ ర్యాంకింగ్‌లు ఇస్తారు. ఓటర్లందరూ ర్యాంకింగ్‌లు ఇచ్చిన తర్వాత ఏ చిత్రం యాభైశాతం ఓటర్ల ఫేవరెట్‌గా నిలుస్తుందో అదే బెస్ట్ పిక్చర్‌గా నిలుస్తుంది.

'ఆర్ఆర్ఆర్'కు స్టాండింగ్ ఒవేషన్

ఆస్కార్ ప్రమోషన్స్‌లో భాగంగా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌లో హీరో రామ్‌చరణ్ (మరో హీరో ఎన్టీఆర్ సోమవారం అమెరికా వెళ్తారని తెలిసింది), దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి, సినిమాటోగ్రాఫర్ సెంథిల్‌కుమార్ అమెరికాలో ఉన్నారు. అమెరికాలో 'ఆర్ఆర్ఆర్'ను ఈ నెల 3న రీ రిలీజ్ చేశారు. ఇందులో భాగంగా లాస్ ఏంజిల్స్‌లోని ప్రముఖ ఏస్ హోటల్ థియేటర్‌లో 'ఆర్ఆర్ఆర్'ను ప్రదర్శించారు. షో పూర్తయ్యాక 'ఆర్ఆర్ఆర్'కు స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ - ''ఓ నటుడిగా ఈ క్షణాలను ఎంతగానో ఆస్వాదిస్తున్నాను. ఎంత కష్టపడైనా సరే ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలన్నదే నా లక్ష్యం. రాజమౌళిగారితో పని చేస్తే సినిమాల పట్ల నాలెడ్జ్ ఇంకా పెరుగుతుంది. ఆయన నాకు ప్రిన్సిపాల్, గురువు లాంటివారు. 'ఆర్ఆర్ఆర్'తో తారక్ (ఎన్టీఆర్) నాకు ఇంకా ఇంకా దగ్గరయ్యాడు'' అన్నారు.



● సెంథిల్, కీరవాణి, రాజమౌళి, రామ్‌చరణ్

చమ్కీలా అంగీలేసి..



● నాని, కీర్తీ సురేష్

నాని, కీర్తీ సురేష్ జంటగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన చిత్రం 'దసరా'. ఈ చిత్రంలోని 'చమ్కీలా అంగీలేసి..' అంటూ సాగే మూడో పాటను ఈ 8న రిలీజ్ చేయనున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''పెళ్లిళ్ల సీజన్‌లో పాడుకునే జానపద పాట ఇది. సంతోష్ నారాయణన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ నెల 30న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 'దసరా'ని రిలీజ్ చేయ నున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

యాంటీ లవ్‌స్టోరీ

రామ్ కార్తీక్, ప్రిష జంటగా డీవీకే నాగేశ్వరరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఔను.. నేనింతే'. యంఏ సత్తార్ సమర్పణలో జీవీ చౌదరి, నాగరాజు చిర్రా నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నటులు అనీష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, పృథ్వీ క్లాప్ కొట్టారు. యంఏ సత్తార్ గౌరవ దర్శకత్వం వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ– ''ఇదొక యాంటీ లవ్‌స్టోరీ. రివర్స్ స్క్రీన్ ప్లేతో రాసుకున్న కథ. తల్లితండ్రులు తమ పిల్లలతో కలసి చూసేలా ఉంటుంది'' అన్నారు. ''ప్రతి ఒక్కర్నీ ఆలోచింపజేసేలా మా చిత్రం ఉంటుంది'' అన్నారు జీవీ చౌదరి, నాగరాజు చిర్రా.



● ప్రిష, రామ్ కార్తీక్

తెలుగు తెరకు ప్రపంచ సుందరి



● మానుషి

మాజీ మిస్ వరల్డ్ మానుషీ చిల్లర్ తెలుగు తెరకు పరిచయం కానున్నారు. 2017లో 'ప్రపంచ సుందరి' కిరీటం దక్కించుకున్న ఈ నార్త్ బ్యూటీ హిందీలో 'సామ్రాట్ పృథ్వీరాజ్' చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయ్యారు. ఇప్పుడు వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతున్న చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో మానుషీని కథానాయికగా తీసుకున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రం ద్వారా యాడ్ ఫిల్మ్‌మేకర్, సినిమాటోగ్రాఫర్ శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ''యథార్థ ఘటనల ప్రేరణతో రూపొందిస్తున్న యాక్షన్ డ్రామా ఇది. ఇందులో వరుణ్ తేజ్ భారతీయ వైమానిక దళ పైలట్‌గా, రాడార్ ఆఫీసర్‌గా మానుషి చేస్తున్నారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో వైమానిక దళం ఎదుర్కొనే సవాళ్లను చూపిస్తున్నాం. శుక్రవారం షూటింగ్ ఆరంభించాం'' అని చిత్రబృందం పేర్కొంది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినై సన్స్ పిక్చర్స్ సంస్థలపై సందీప్ ముద్ద నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: నందకుమార్ అబ్బినేని.

సాక్షి బిజినెస్
శనివారం
4-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
900	272
59,809	17,594

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,617	▲ 154
డోజోన్స్	33,245	▲ 241
ఎఫ్‌టీఎస్ఈ 100	7,947	▲ 3
డాక్స్	15,578	▲ 251
షాంఘై	3,328	▲ 18
నికాయ్	27,927	▲ 429

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్)	56,103 ▲	16
బంగారం (22 క్యారెట్)	55,878 ▲	15
వెండి (కిలో)	64,139 ▲	433

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	81.59	83.26
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	96.96	100.27
€	యూరో	ఎకటి	85.86	88.94
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	59.36	61.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	54.45	56.80
S$	సింగపూర్ డాలర్	ఎకటి	60.21	62.15
SAR	సౌదీ రియాల్	[illegible]	20.86	22.53
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.42	23.21
¥	చైనా యువాన్	[illegible]	10.75	12.82

ఏఐ సునామీని హెచ్‌ఆర్ గుర్తించింది

టెక్‌ఫైండర్ గ్లోబల్ డైరెక్టర్ పాల్



సదస్సులో పాల్గొన్న పాల్ గై (మధ్య) తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) ప్రకారం భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిశ్రమ 20.2 శాతం వార్షిక వృద్ధితో 2025 నాటికి 7.8 బిలియన్ డాలర్లుగా నిలుస్తుందని అంచనా. ఈ సునామీ మార్పును మానవ వనరుల విభాగాలు గుర్తించాయని అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ టెక్‌ఫైండర్ గ్లోబల్ మార్కెటింగ్ డైరెక్టర్ పాల్ గై అన్నారు. హెచ్‌ఆర్ సవాళ్లను అధిగమించడంపై హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'హెచ్‌ఆర్ రంగంలో ఏఐ అప్లికేషన్లు అమితాదరణ పొందుతున్నాయి. ప్రతిభావంతులను సొంతం చేసుకోవడమనేది సాంకేతికాధారిత హెచ్‌ఆర్ కార్యక్రమంగా మారింది. వ్యాపారాలలో ఏఐ వినియోగం పెరుగుతోందనడానికి ఇదే నిదర్శనం' అని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం, అనిశ్చితి, నియామకాలలో మందగమనం, తగిన నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతులను ఆకర్షించడంలో పోటీ వంటివి హెచ్‌ఆర్ నిపుణులు ఎదుర్కొంటున్న కొన్ని సాధారణ సమస్యలని సదస్సు అభిప్రాయపడింది.

మోల్డ్‌టెక్ బోర్డులోకి ప్రసాద్ రాజు

MOLD-TEK Technologies Limited

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సర్వీసెస్ కంపెనీ మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ డైరెక్టర్ల బోర్డులోకి కోసూరి ప్రసాద్ రాజు చేరారు. ప్రస్తుతం కంపెనీ యూఎస్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. మోల్డ్‌టెక్ టెక్నాలజీస్‌లో ప్రసాద్ రాజు తొలి ఉద్యోగి కావడం విశేషం. రెండు దశాబ్దాలుగా ప్లానింగ్, ప్రొడక్షన్ బాధ్యతలతోపాటు యూఎస్‌ఏ మార్కెటింగ్, న్యూ బిజినెస్ డెవలప్‌మెంట్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఆయన కృషి, దూరదృష్టి, అంకితభావం మోల్డ్‌టెక్ టెక్నాలజీస్‌ను ఉన్నత దిశలోకి నడిపిస్తాయని కంపెనీ సీఎండీ జె.లక్ష్మణ రావు పేర్కొన్నారు.

భారత్ 'సేవలు' భేష్...

- ఫిబ్రవరిలో 12 ఏళ్ల గరిష్టం
- 59.4 వద్ద పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఫిబ్రవరిలో చక్కటి పనితీరు ప్రదర్శించింది. దేశ ఎకానమీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న ఈ రంగానికి సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 59.4 వద్ద ముగిసింది. గత 12 ఏళ్లలో ఈ స్థాయి పురోగతి ఇదే తొలిసారి. దేశంలో డిమాండ్ పరిస్థితులు, కొత్త వ్యాపారాలు ఊపందుకోవడం వంటి అంశాలు దీనికి కారణమని గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. సూచీ జనవరిలో 57.2 వద్ద ఉంది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన చూస్తే, సేవల రంగం వరుసగా 19 నెలల నుంచి వృద్ధిలోనే కొనసాగుతోంది. కాగా, ఉపాధి అవకాశాల పరిస్థితులు మాత్రం ఇంకా మందగమనంలోనే ఉన్నట్లు డీ లిమా తెలిపారు.

సేవలు–తయారీ కలిపినా... పురోగతి!

తయారీ, సేవల రంగం కలిపిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా ఫిబ్రవరిలో పటిష్ట స్థాయిలో 59 వద్దకు చేరింది. జనవరిలో సూచీ 57.5 వద్ద ఉంది. ఇది 11 ఏళ్ల గరిష్టం. ఒక్క తయారీ రంగాన్ని చూస్తే మాత్రం సూచీ ఫిబ్రవరిలో 55.3 వద్ద ఉంది. జనవరికన్నా (55.4) సూచీ స్వల్పంగా వెనుకబడింది.

ఫిషింగ్ కట్టడికి తాన్లా పరిష్కారం

- సైబర్ మోసాలకు ఇక చెక్
- వీఐ నెట్‌వర్క్‌లో పరీక్షలు
- కంపెనీ ఫౌండర్ ఉదయ్ రెడ్డి



బార్సిలోనా: ఈ–మెయిల్స్, మొబైల్‌కు సైబర్ నేరగాళ్లు పంపే లింక్స్‌ను ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకుంటున్న ఘటనలు రోజూ చూస్తున్నాం. ఇలాంటి ఫిషింగ్ సందేశాలు సబ్‌స్క్రైబర్లకు చేరకుండా నిరోధించే టెక్నాలజీని క్లౌడ్ కమ్యూనికేషన్స్ సేవల్లో ఉన్న హైదరాబాద్ కంపెనీ తాన్లా ప్లాట్‌ఫామ్స్ అభివృద్ధి చేసింది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌లో పరీక్షలు జరుగుతున్నాయి. బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్–2023 సందర్భంగా ఈ సాంకేతికతను ట్రాయ్ చైర్మన్ పి.డి.వాఘేలా చేతుల మీదుగా ఆవిష్కరించారు. 'యాంటీ–ఫిషింగ్‌కు పరిష్కారాన్ని భారత్‌లో అభివృద్ధి చేశాం. సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉంది. తాన్లా యాంటీ–ఫిషింగ్ ప్లాట్‌ఫామ్ ఒక నిమిషంలో మోసాన్ని గుర్తిస్తుంది. ఈ సాంకేతికత కోసం అంతర్జాతీయంగా ఆసక్తి కనబరుస్తున్నారు' అని తాన్లా ప్లాట్‌ఫామ్స్ ఫౌండర్, చైర్మన్, సీఈవో డి.ఉదయ్ రెడ్డి తెలిపారు. మోసగాళ్లను ఏరివేయడానికి నియంత్రణ సంస్థలకు ఇది సాయపడుతుందని అన్నారు. వాయిస్ కాల్ ఆధారిత మోసాలకు చెక్ పెట్టేందుకు సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దీనిని వచ్చే రెండు త్రైమాసికాల్లో అందుబాటులోకి తెస్తామన్నారు.

30 కోట్ల మందికి ముప్పు..

భారత్‌లో కంపెనీ అంచనాల ప్రకారం దాదాపు 30 కోట్ల మంది ఫిషింగ్ దాడులకు గురయ్యే అవకాశం ఉందని ఉదయ్ రెడ్డి వెల్లడించారు. 'వీరిలో 5 లక్షల మంది మోసపోయే చాన్స్ ఉంది. బాధితుల్లో 7% మంది మాత్రమే వివిధ కారణాల వల్ల నేరం గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ఫేక్ ఎలక్ట్రిసిటీ బిల్ అలర్ట్, నో యువర్ కస్టమర్ వెరిఫికేషన్ వంటి 10–11 పద్ధతుల్లో ఫిషింగ్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సిమ్, యాప్స్‌ను మోసగాళ్లు వేదికగా చేసుకుంటున్నారు. స్కామ్ సందేశాలు వినియోగదారులకు చేరకుండా చూసుకోవాలి. ఇందుకోసం ఈ టెక్నాలజీని మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లతో మాత్రమే కాకుండా గూగుల్, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫామ్స్‌తో కూడా అనుసంధానించాం. ఫిషింగ్ సైట్స్‌ను నిరోధించే కొన్ని సర్వీస్ ఏజెన్సీలతో కూడా భాగస్వామ్యం చేసుకున్నాం' అని వివరించారు.

వారాంతాన బుల్ రంకెలు

- కలిసొచ్చిన జాతీయ, అంతర్జాతీయ సంకేతాలు
- అన్ని రంగాల షేర్లకు డిమాండ్
- నాలుగువారాల్లో అతిపెద్ద లాభం
- సెన్సెక్స్ 900 పాయింట్లు ప్లస్
- నిఫ్టీకి 272 పాయింట్ల లాభం



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో వారాంతాన బుల్ రంకెలు వేసింది. జాతీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాల అండతో శుక్రవారం స్టాక్ సూచీలు లాభాల జోరు కనబరిచాయి. ముఖ్యంగా అధిక వెయిటేజీ, కీలక రంగాలైన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో షార్ట్ కవరింగ్ చోటు చేసుకుంది. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన స్టాక్‌లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా సూచీలు నెల రోజుల్లో అతిపెద్ద లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 900 పాయింట్లు బలపడి 59,809 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272 పాయింట్లు పెరిగి 17,594 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లకు మోస్తరు స్థాయిలో రాణించడంతో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు అరశాతానిపైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.246 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,090 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ సేవారంగం పుంజుకోవడం, ఎఫ్ఐఐల రెండోరోజూ కొనుగోళ్లతో డాలర్ మారకంలో రూపాయి విలువ 63 పైసలు బలపడి నెల గరిష్టం 81.97 వద్ద స్థిరపడింది. అమెరికా మార్కెట్లు గురువారం ఒకశాతం బలపడ్డాయి. ఆసియా, యూరప్ సూచీలు ఒకటిన్నర శాతం ర్యాలీ చేశాయి. యూఎస్ స్టాక్ ఫ్యూచర్లు అరశాతం లాభంతో ట్రేడయ్యాయి.

రోజంతా లాభాలే...

ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం లాభంతో మొదలైంది. సెన్సెక్స్ 332 పాయింట్లు పెరిగి 59,241 వద్ద, నిఫ్టీ 129 పాయింట్లు బలపడి 17,451 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,058 పాయింట్లు దూసుకెళ్లి 59,967 వద్ద, నిఫ్టీ 323 పాయింట్లు ఎగసి 17,645 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి.

లాభాలు ఎందుకంటే..: అంతర్జాతీయ ఇన్వెస్టర్ జీక్యూజీ పాట్నర్ అదానీ గ్రూప్‌నకు చెందిన 2 బిలియన్ డాలర్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేయడంతో మార్కెట్ వర్గాలకు కొంత ఊరట లభించింది. జీక్యూజీ ఒప్పందంతో సమకూరిన నిధులను రుణాల చెల్లింపునకు వినియోగిస్తామని అదానీ గ్రూప్ తెలపడంతో ఎక్స్‌పోజర్ ఉన్న బ్యాంకింగ్ భారీగా ర్యాలీ చేశాయి. ఫిబ్రవరి సేవల రంగం 12 ఏళ్లలోనే బలమైన వృద్ధిని నమోదుచేసింది. డాలర్ మారకంలో రూపాయి విలువ నెల గరిష్టానికి చేరుకోవడం, విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా రెండోరోజూ కొనుగోళ్ల చేపట్టడం కూడా కలిసొచ్చాయి. వచ్చే ద్రవ్య పాలసీ సమావేశం నుంచి ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు 25 బేసిస్ పాయింట్లు మాత్రమే ఉండొచ్చని, అలాగే ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి రేట్ల పెంపు సైకిల్ ఆగిపోవచ్చంటూ అట్లాంటా ఫెడరల్ రిజర్వ్ ప్రెసిడెంట్ రాఫెల్ బోస్టిక్ వ్యాఖ్యలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి.

మార్కెట్‌లో మరిన్ని విశేషాలు..

- ఇన్వెస్టర్లు, నియంత్రణ సంస్థల్లో విశ్వాసాన్ని నింపేందుకు అదానీ గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలనిస్తున్నాయి. తాజాగా జీక్యూజీ పార్ట్‌నర్స్ రూ.15,446 కోట్ల కొనుగోలు ఒప్పందంతో శుక్రవారం ఈ గ్రూప్‌లో మొత్తం పది షేర్లూ లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా 17% దూసుకెళ్లింది. అదానీ పోర్ట్స్ 10%, అంబుజా సిమెంట్స్ 6%, ఏసీసీ, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్, అదానీ టోటల్, అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు 5% చొప్పున లాభపడ్డాయి. గత 3 ట్రేడింగ్ సెషన్లలో ఈ గ్రూప్‌లో రూ.1.42 కోట్ల సంపద సృష్టి జరిగింది.
- సెన్సెక్స్ ఒకటిన్నర శాతం ర్యాలీ చేయడంతో బీఎస్ఈలో రూ. 3.43 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ. 263 లక్షల కోట్లకు చేరింది. ఇదే సూచీలో 30 షేర్లలో టెక్ మహీంద్రా (2%), అల్ట్రాటెక్ (1%), ఏషియన్ పేయింట్స్ (0.19%), నెస్లే లిమిటెడ్ (0.17%) మాత్రమే నష్టపోయాయి.
- ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ డివ్‌జీ టార్క్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు నాటికి 5.44 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 38.41 లక్షల షేర్లను జారీ చేయగా 2.08 కోట్ల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి.

గ్రీన్‌కో రూ. 5,700 కోట్ల నిధుల సమీకరణ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ఉన్న హైదరాబాద్ కంపెనీ గ్రీన్‌కో రూ.5,700 కోట్ల నిధులను సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, జపాన్ కంపెనీ ఓరిక్స్ కార్పొరేషన్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీతోపాటు (ఏడీఐఏ) సంస్థ వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఈ మొత్తాన్ని సమకూర్చినట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. ఈ ఈక్విటీ నిధులను 25 గిగావాట్ అవర్ కంటే అధిక నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉండే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లకు ఉపయోగిస్తామని గ్రీన్‌కో గ్రూప్ జేఎండీ మహేశ్ కొల్లి వెల్లడించారు. తాజాగా అందుకున్న పెట్టుబడిలో జీఐసీ 51 శాతం, ఓరిక్స్ 16, ఏడీఐఏ 14, వ్యవస్థాపకులు 13 శాతం సమకూర్చినట్టు తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ప్రముఖ సంస్థల్లో ఒకటైన గ్రీన్‌కో గ్రూప్ ఖాతాలో భారత్‌లో 15 రాష్ట్రాల్లో 7.5 గిగావాట్ల సామర్థ్యం గల సౌర, పవన, జల విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి.

సాక్షి స్పోర్ట్స్



ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక ఓటమి

గోవాలో జరుగుతున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు మనిక బత్రా, సుతీర్థ ముఖర్జీ ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. 34వ ర్యాంకర్ మనిక బత్రా 6-11, 3-11, 11-9, 7-11తో 20వ ర్యాంకర్ కియాన్ తియాని (చైనా) చేతిలో... సుతీర్థ 5-11, 7-11, 5-11తో ఫు యు (పోర్చుగల్) చేతిలో ఓడిపోయారు.

జేసన్ రాయ్ సెంచరీ: ఇంగ్లండ్‌దే సిరీస్

బంగ్లాదేశ్‌తో శుక్రవారం మిర్పూర్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ 132 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. జేసన్ రాయ్ (132; 18 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించడంతో తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 326 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ 44.4 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది.



ఆనందం ఆస్ట్రేలియాదే...

- మూడో టెస్టులో భారత్‌పై విజయం
- డబ్ల్యూటీసీ ఫైనల్‌కూ అర్హత
- 18.5 ఓవర్లలోనే ముగిసిన లాంఛనం
- 9 నుంచి అహ్మదాబాద్‌లో చివరి టెస్టు

ఆస్ట్రేలియా ముందు అతిస్వల్ప విజయలక్ష్యం... అయినా సరే గత టెస్టులో 18 పరుగుల వ్యవధిలో 7 వికెట్లు, ఈ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు తీసిన తీరును బట్టి భారత శిబిరంలో ఏదో ఒక మూల కాస్త ఆశ, నమ్మకం... అందుకు తగినట్లుగానే ఇన్నింగ్స్ రెండో బంతికే వికెట్ కూడా దక్కింది. అయితే ఆపై ఆసీస్ ఎక్కడా తడబడలేదు. హెడ్, లబుషేన్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ పోయారు. డిఫెన్స్ ఆడి ఉత్కంఠ పెంచకుండా ఓవర్‌కు 4.14 రన్‌రేట్‌తో పరుగులు చేస్తూ మ్యాచ్‌ను వేగంగా ముగించేశారు. ప్రత్యర్థిని స్పిన్ గోతిలో పడేయబోయిన భారత్ చివరకు అదే వ్యూహానికి చిక్కి మ్యాచ్‌ను చేజార్చుకుంది. రెండు టెస్టులు ఓడి నిస్సహాయంగా కనిపించిన ఆస్ట్రేలియా ఒక్కసారిగా పుంజుకొని చెప్పుకోదగ్గ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అధికారికంగా ఆస్ట్రేలియా అర్హత సాధించింది. భారత్ కూడా ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే చివరిదైన నాలుగో టెస్ట్‌లో ఆసీస్‌పై గెలవాలి. ఒకవేళ మ్యాచ్ 'డ్రా' అయినా, భారత్ ఓడిపోయినా టీమిండియా ఫైనల్ అవకాశాలు న్యూజిలాండ్–శ్రీలంక టెస్ట్ సిరీస్ తుది ఫలితంపై ఆధారపడి ఉంటాయి.



మ్యాచ్ ముగిశాక ఆసీస్ ప్లేయర్లు లబుషేన్, హెడ్‌లను అభినందిస్తున్న జడేజా, కోహ్లి

ఇండోర్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. శుక్రవారం ముగిసిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా 9 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. సిరీస్‌లో భారత్ టీమిండియా ఆధిక్యాన్ని 2–1కి తగ్గించింది. 76 పరుగుల లక్ష్యంతో మూడో రోజు బరిలోకి దిగిన ఆసీస్ 18.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 78 పరుగులు చేసింది. ట్రవిస్ హెడ్ (53 బంతుల్లో 49 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (58 బంతుల్లో 28 నాటౌట్; 6 ఫోర్లు) జట్టును గెలిపించారు. నాథన్ లయన్ (11/99) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో చివరి టెస్టు ఈనెల 9 నుంచి అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

ప్రత్యర్థిని కుప్పకూల్చేందుకు స్పిన్ తప్ప మరో మార్గం లేదని భావించిన భారత్ మరో ఆలోచన లేకుండా అశ్విన్‌తోనే బౌలింగ్ మొదలు పెట్టింది. దానికి తగిన ఫలితం కూడా అందుకుంది. రెండో బంతికే తడబడిన ఉస్మాన్ ఖాజా (0) కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో టీమిండియా ఆశలు మరింత పెరిగాయి. అయితే హెడ్, లబుషేన్ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. తొలి 10 ఓవర్లలో ఆసీస్ స్కోరు 13 పరుగులే. ఈ దశలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బంతి సీమ్ దెబ్బ తినడంతో అంపైర్లు బంతిని మార్చాల్సి వచ్చింది. భారత బృందం దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసినా అదే బంతితో బౌలింగ్ చేయక తప్పలేదు. అశ్విన్ ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టి హెడ్ జోరు పెంచగా, జడేజా తర్వాతి ఓవర్లో లబుషేన్ రెండు ఫోర్లు కొట్టాడు. అశ్విన్ మరో ఓవర్లో మళ్లీ రెండు ఫోర్లు రాబట్టి వీరిద్దరు 15 ఓవర్లలో స్కోరును 56/1కు చేర్చారు. డ్రింక్స్ తర్వాత 23 బంతుల్లో 22 పరుగులు రాబట్టి కంగారూలు విజయాన్ని అందుకున్నారు.

స్కోరు వివరాలు: భారత్ తొలి ఇన్నింగ్స్: 109; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 197; భారత్ రెండో ఇన్నింగ్స్: 163; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖాజా (సి) భరత్ (బి) అశ్విన్ 0; హెడ్ (నాటౌట్) 49; లబుషేన్ (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (18.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 78. వికెట్ల పతనం: 1–0. బౌలింగ్: అశ్విన్ 9.5–3–44–1, జడేజా 7–1–23–0, ఉమేశ్ 2–0–10–0.

పిచ్ 'నాసిరకం'



మూడో టెస్టుకు ఆతిథ్యమిచ్చిన ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం పిచ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిని 'నాసిరకం పిచ్'గా గుర్తిస్తూ మూడు డీమెరిట్ పాయింట్లు శిక్షగా విధించింది. మూడో రోజు తొలి సెషన్‌లోపే ఈ టెస్టు ముగిసింది. 'పొడిగా ఉన్న ఈ పిచ్‌పై బంతికి, బ్యాట్‌కు మధ్య సమతుల్యత లోపించింది. మ్యాచ్ ఐదో బంతికే దుమ్ము రేగగా, ఆ తర్వాత పరిస్థితి మరింత దిగజారుతూ వచ్చింది' అని మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ నివేదిక ఇచ్చారు.

భారత పురుషుల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా ఫుల్టన్



న్యూఢిల్లీ: భారత పురుషుల హాకీ జట్టుకు కొత్త చీఫ్ కోచ్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన క్రెయిగ్ ఫుల్టన్‌ను నియమిస్తున్నట్లు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ప్రకటించారు. 48 ఏళ్ల ఫుల్టన్ దక్షిణాఫ్రికా తరఫున 195 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. క్రీడాకారుడిగా రిటైరయ్యాక కోచింగ్‌వైపు మళ్లిన ఫుల్టన్ 2014 నుంచి 2018 వరకు ఐర్లాండ్ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఫుల్టన్ శిక్షణలో ఐర్లాండ్ వందేళ్ల తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 2015లో ఆయన అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వార్షిక అవార్డుల్లో ఉత్తమ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఫుల్టన్ బెల్జియం జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా కూడా పని చేశాడు. శిక్షణ బృందంలో ఫుల్టన్ సభ్యుడిగా ఉన్నపుడు బెల్జియం 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2018 ప్రపంచకప్‌లో టైటిల్ సాధించింది. గత జనవరిలో స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు తొమ్మిదో స్థానంలో నిలిచింది. టీమిండియా నిరాశాజనక ప్రదర్శన నేపథ్యంలో చీఫ్ కోచ్ గ్రాహమ్ రీడ్ తన పదవికి రాజీనామా చేశాడు.

ఎఫ్1 సీజన్‌కు వేళాయె..



సాఖిర్ (బహ్రెయిన్): ఫార్ములావన్ (ఎఫ్1) 2023 సీజన్‌కు రంగం సిద్ధమైంది. 23 రేసుల ఈ సీజన్‌లో తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి ఆదివారం జరుగుతుంది. అంతకుముందు శనివారం ప్రధాన రేసుకు సంబంధించిన గ్రిడ్ పొజిషన్‌ను తేల్చేందుకు క్వాలిఫయింగ్ సెషన్‌ను నిర్వహిస్తారు. క్వాలిఫయింగ్ సెషన్‌లో అత్యంత వేగంగా ల్యాప్‌ను పూర్తి చేసిన డ్రైవర్ ప్రధాన రేసును 'పోల్ పొజిషన్' హోదాలో తొలి స్థానం నుంచి ప్రారంభిస్తాడు. ఈ సీజన్‌లో కూడా డిఫెండింగ్ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్ జట్టు) తన జోరు కొనసాగించే అవకాశముంది. అతనికి హామిల్టన్ (మెర్సిడెస్), లెక్‌లెర్క్ (ఫెరారీ) నుంచి గట్టిపోటీ ఎదురయ్యే చాన్స్ ఉంది. మొత్తం 10 జట్లు నుంచి 20 మంది డ్రైవర్లు మొత్తం 23 రేసుల్లో పాల్గొంటారు.

మహిళల లీగ్‌కు మోగిన నగారా!

- నేటి నుంచి డబ్ల్యూపీఎల్
- మొదటి మ్యాచ్‌లో ముంబైతో గుజరాత్ జెయింట్స్ 'ఢీ'

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం


స్మృతి మంధాన


హర్మన్‌ప్రీత్


మెగ్ లానింగ్


బెత్ మూనీ


అలీసా హీలీ

TATA WPL

ముంబై: ఎన్నాళ్లుగానో వేచిన క్షణం రానే వచ్చింది... భారత మహిళల క్రికెట్‌లోనూ ఐపీఎల్ లాంటి టోర్నీ ఉండాలని, అమ్మాయిలకు మరిన్ని అవకాశాలు రావాలని ఏళ్లుగా సాగిన చర్చ ఇప్పుడు వాస్తవ రూపం దాలుస్తోంది. అసలు మహిళల లీగ్ ఉంటుందా, ఉండదా, వాణిజ్యపరంగా సఫలం అవుతుందా అనే సందేహాలు... నిర్వహణపై ఏనాడూ స్పష్టత లేని స్థితి... ఇప్పుడు ఇవన్నీ గతం ... ఎట్టకేలకు బీసీసీఐ చొరవతో ఇప్పుడు అన్ని అడ్డంకులను దాటి... అదీ ఐపీఎల్ తరహా యాజమాన్యాల అండతో తొలి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) సన్నద్ధమైంది. **నేడు రాత్రి గం. 7:30 నుంచి జరిగే తొలి మ్యాచ్‌తో లీగ్‌కు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ విశేషాలు...**

బరిలో ఉన్న జట్లు (5), కెప్టెన్‌లు: (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు–స్మృతి మంధాన; ముంబై ఇండియన్స్–హర్మన్‌ప్రీత్ కౌర్; ఢిల్లీ క్యాపిటల్స్–మెగ్ లానింగ్; యూపీ వారియర్స్–అలీసా హీలీ; గుజరాత్ జెయింట్స్–బెత్ మూనీ).

వేదికలు: 2 (ముంబైలోనే; బ్రబోర్న్ స్టేడియం, డీవై పాటిల్ స్టేడియం)

మొత్తం మ్యాచ్‌లు: 22 (20 లీగ్ మ్యాచ్‌లతో పాటు ఒక ఎలిమినేటర్, ఫైనల్)

ఫార్మాట్: ప్రతీ టీమ్ ఇతర నాలుగు జట్లతో రెండేసి మ్యాచ్‌లు (మొత్తం 8) ఆడుతుంది. టాప్‌గా నిలిచిన టీమ్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంది. తర్వాతి రెండు టీమ్‌ల మధ్య 'ఎలిమినేటర్' మ్యాచ్ విజేత రెండో ఫైనలిస్ట్ అవుతుంది.

తుది జట్టులో విదేశీ ఆటగాళ్ల సంఖ్య: 4

మ్యాచ్ సమయం: ఐపీఎల్‌లాగే ఒక మ్యాచ్ ఉంటే రాత్రి గం 7:30 నుంచి... రెండు మ్యాచ్‌లు ఉన్న రోజు తొలి మ్యాచ్ గం. 3:30 నుంచి... రెండో మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి

డీఆర్ఎస్: అందుబాటులో ఉంది. ఒక్కో ఇన్నింగ్స్‌లో జట్టుకు రెండు అవకాశాలు ఉంటాయి.

లీగ్‌లో ఉన్న తెలుగు అమ్మాయిల సంఖ్య: 6 (స్నేహదీప్తి, అంజలి శర్వాణి, సబ్బినేని మేఘన, షబ్నమ్ (ఆంధ్రప్రదేశ్) అరుంధతి రెడ్డి, యషశ్రీ (హైదరాబాద్).

రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆధిక్యం


యశ్ దూబే

గ్వాలియర్: రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 112/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ 112.5 ఓవర్లలో 294 పరుగులకు ఆలౌటైంది. యశ్ దూబే (258 బంతుల్లో 109; 16 ఫోర్లు) సెంచరీ సాధించగా, సారాంశ్ జైన్ (150 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో పుల్కిత్ నారంగ్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన రెస్ట్ ఆఫ్ ఇండియా ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 18 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 85 పరుగులు సాధించింది. తమ ఓవరాల్ ఆధిక్యాన్ని 275 పరుగులకు పెంచుకుంది. కెప్టెన్ మయాంక్ డకౌట్ కాగా... యశస్వి జైస్వాల్ (58 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్), అభిమన్యు ఈశ్వరన్ (26 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

క్లుప్తంగా...

7న ఎంఎస్సీ కోర్సులకు రెండవ విడత కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నందు 2022–23 సంవత్సరానికి గానూ ఎంఎస్సీ కోర్సులు(అగ్రి, ఎంఎస్సీ), సామాజిక శాస్త్రం ఎంబీఏ (ఏబీఎం)ల్లో ప్రవేశాలకు ఈ నెల 7వ తేదీన రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన కేంద్రం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఈ కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అర్హత పత్రాలతో వ్యక్తిగతంగా కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పట్టాభి సహా 10 మందికి బెయిల్

భవానీపురం(విజయవాడపశ్చిమ)/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కృష్ణాజిల్లా గన్నవరం సీఐ కనకారావుపై హత్యాయత్నం చేసిన కేసులో టీడీపీ నాయకుడు కొమ్మారెడ్డి పట్టాభితోసహా పదిమందికి విజయవాడ 12వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు శుక్రవారం కండిషన్ బెయిల్ మంజూరు చేసింది. పట్టాభి, దొంతు చిన్న, జాస్తి ఆదిశేషు, లావు వంశీకృష్ణ, సీహెచ్.సందీప్‌చౌదరి, జి.దేవేంద్రరావు, ఎం.కార్తీక్, వి.వెంకటగురుమూర్తి, జి.బాబూరావు, కె.సూర్యప్రకాష్‌లకు రూ.25 వేల పూచీకత్తులపై న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వారంలో ఒకరోజు పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని, పోలీసుల విచారణకు సహకరించాలని వారిని ఆదేశించింది. ఈ కేసులో అరెస్టయిన వీరు ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నారు. వీరందరికి బెయిల్ మంజూరైనా, దానికి సంబంధించి కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉందని, శనివారం ఆ ప్రక్రియ పూర్తయిన తరువాత వారిని విడుదల చేస్తామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు శుక్రవారం రాత్రి తెలిపారు.



టెక్నాలజీ పెరిగింది.. జీవన విధానం మారుతోంది.. అన్ని రంగాల్లో ఒత్తిడి పెరిగింది.. ఫలితంగా మానసిక, పని ఒత్తిడితో 'సైకాలజీ' సమస్యలతో బాధపడేవారు అధికమయ్యారు. ప్రతీ ఏడుగురిలో ఒకరికి మానసిక సమస్యలు ఉన్నాయని డబ్ల్యూహెచ్ఓ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) చెబుతోందంటే ఏ స్థాయిలో ఈ సమస్యలు పెరుగుతున్నాయో స్పష్టమవుతోంది. అయితే, దీనికి తగ్గట్లు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు, చికిత్స చేసేందుకు ఆ స్థాయిలో సైకాలజిస్టులు మాత్రం లేరు. దేశంలో ప్రతీ 10 లక్షల మందికి ఏడుగురు మాత్రమే సైకాలజిస్టులు ఉన్నారు. దీంతో వారి కొరత పెరిగింది. అయితే ప్రస్తుతం సైకాలజీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఎంతలా అంటే.. దేశవ్యాప్తంగా వీరి సంఖ్య ఏకంగా 50 శాతం పెరిగింది.

దేశంలో భారీగా పెరుగుతున్న సైకాలజీ విద్యార్థుల సంఖ్య

మానసిక సమస్యలు పెరగడం, సైకాలజిస్టులు తక్కువగా ఉండటమే కారణం

డబ్ల్యూహెచ్ఓ ప్రకారం దేశంలో ప్రతీ ఏడుగురిలో ఒకరికి మానసిక సమస్య

కానీ, ప్రతీ 10 లక్షల మందికి ఏడుగురు మాత్రమే సైకాలజిస్టులు

గతంలో యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలో ఏటా 30-40వేల దరఖాస్తులు

రెండేళ్లుగా 50-60 వేలకు చేరిన దరఖాస్తులు

సై'కాలేజీ'కి డిమాండ్!

సాక్షి ప్రతినిధి కర్నూలు: దేశంలో సైకాలజీ ఎడ్యుకేషన్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతిష్టాత్మక కాలేజీలు ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ గ్రాడ్యుయేట్, డిప్లొమో, పీజీ కోర్సులు అందిస్తున్నాయి. డిగ్రీలో ఏ గ్రూపు చదివినా పీజీలో సైకాలజీని ఎంచుకోవచ్చు. గతంలో ఢిల్లీలోని రామానుజన్ కాలేజీతో పాటు యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలో సైకాలజీకి 30–40 వేల అప్లికేషన్లు మాత్రమే వచ్చేవి. 2020–21లో 50–60వేల దరఖాస్తులు వచ్చాయి. 2022లో 60వేలు దాటాయి. విద్యార్థులు ఎక్కువగా సైకాలజీపై ఆసక్తి చూపడంతో సైకాలజీ సీట్ల సంఖ్యను కూడా ఢిల్లీ యూనివర్సిటీ పెంచింది. ఇగ్నో (ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ)లో ఏటా 4–5వేల మంది చేరేవారు. ఇప్పుడు 10 వేల మంది అడ్మిషన్లు పొందుతున్నారు. అంటే సైకాలజీ చదివేవారి సంఖ్య రెట్టింపు అయింది. బెంగళూరు జైన్ డీమ్డ్ యూనివర్శిటీ, అమిటి, పూణేలోని సింబయాసిస్, యూనివర్శిటీ ఆఫ్ లక్నో, బెనారస్‌తో పాటు అన్ని వర్సిటీల్లో కూడా అడ్మిషన్లు 50% తక్కువ కాకుండా పెరిగాయి. కొన్నింటిలో రెట్టింపయ్యాయి. రాష్ట్రంలో ఆంధ్రా, తిరుపతి ఎస్వీ వర్సిటీలో ఈ కోర్సు ఉంది. దేశ వ్యాప్తంగా 9వేల మంది మాత్రమే సైకాలజిస్టులు ఉన్నారు. కోవిడ్- 19 తర్వాత సైకాలజిస్టులకు భారీ డిమాండ్ ఏర్పడింది. వీరికి భారీగా వేతనాలు కూడా ఇస్తున్నారు. దీంతో చాలామంది ఈ సబ్జెక్టుపై ఆసక్తి పెంచుకున్నారు. అటు వర్సిటీలు కూడా క్లినికల్ సైకాలజీ, కౌన్సెలింగ్ సైకాలజీ, చైల్డ్ సైకాలజీ, కాగ్నిటివ్ సైకాలజీ, కల్చరల్ సైకాలజీ, క్రిమినల్ సైకాలజీ, ఎడ్యుకేషన్ సైకాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, స్పోర్ట్స్ సైకాలజీ, న్యూరో సైకాలజీ పేరుతో ప్రత్యేక కోర్సులు అందిస్తున్నాయి.

రకరకాల కారణాలతో..

- పాతికేళ్ల కిందట మానసిక రోగం అంటే చాలామందికి తెలీదు. ఇప్పుడు 10మంది ఆస్పత్రికి వెళ్తే వారిలో నలుగురిని డాక్టర్లు సైకాలజిస్టుకు సిఫార్సు చేస్తున్నారు.
- అభద్రత, ఆత్రుత, తదితర బాధలు పెరుగు తున్నాయి. దీంతో ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు ఉత్పన్నమవు తున్నాయి.



- కార్పొరేట్ విద్య వచ్చాక పిల్లలను ఉద్యోగం సాధించే యంత్రాలుగా మాత్రమే యాజమాన్యాలు చూస్తున్నాయి. అందుకు తగ్గట్లే శిక్షణనిస్తున్నాయి. దాంతో వారిపైనా తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది.
- ముఖ్యంగా కోవిడ్–19 తర్వాత భర్తలను కోల్పోయిన భార్యలు, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు, అమ్మా, నాన్నను కోల్పోయిన పిల్లలున్నారు. వీరందరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే, కోవిడ్‌తో ఉపాధి కోల్పోయిన వారిదీ ఇదే పరిస్థితి.

- ప్రతీ కాలేజీలో సైకాలజిస్టు తప్పనిసరిగా ఉండాలని 2008లోనే సుప్రీంకోర్టు ప్రభుత్వానికి సూచించింది. కేరళలో స్కూలు స్థాయి నుంచే సైకాలజిస్టులు ఉన్నారు. అందుకే వారి చదువు, జీవన విధానం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సైకాలజీ కోర్సుకు డిమాండ్ పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం.

– సిరిగిరెడ్డి జయరెడ్డి, సైకాలజిస్టు, కర్నూలు



14 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- నోటిఫికేషన్ విడుదల

సాక్షి, అమరావతి: ఈ నెల 14వ తేదీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి శుక్రవారం నోటిఫికేషన్ జారీచేశారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయని అందులో పేర్కొన్నారు. తొలిరోజు ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. ఆ తర్వాత జరిగే బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలి, ఏ అంశాలపై చర్చించాలనే అంశాలను నిర్ణయించనున్నారు. శాసనసభలో రెండోరోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. శాసనమండలిలో రెండోరోజు సభ్యులు చల్లా భగీరథరెడ్డి, బచ్చుల అర్జునుడు మృతికి సంతాప తీర్మానం అనంతరం సమావేశం వాయిదా పడనుంది. మూడోరోజు నుంచి రెగ్యులర్‌గా మండలి సమావేశాలు జరుగుతాయి. 14 నుంచి 24వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మధ్యలో వారాంతపు సెలవులు, ఉగాది పోగా 7–8 రోజులు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అధికారికంగా ఈ అంశాలన్నింటినీ బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టాలనే అంశాన్ని ఆ సమావేశంలోనే ఖరారు చేయనున్నారు.

గ్రూప్–1 మెయిన్స్ ఆప్షన్ల నమోదుకు అవకాశం

- ఈనెల 15 వరకు గడువు

సాక్షి, అమరావతి: గ్రూప్–1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్ పరీక్ష కోసం ఈనెల 15లోగా ఆప్షన్లు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) శుక్రవారం ఒక ప్రకటనలో సూచించింది. మాధ్యమం, పోస్టు ప్రిఫరెన్సు, జోనల్ ప్రిఫరెన్సు, పరీక్షా కేంద్రం తదితరాలకు సంబంధించి ఆప్షన్లను నమోదు చేయాలని కోరింది. నోటిఫికేషన్‌లోని పేరా 1.8లోని అంశాల ప్రకారం అభ్యర్థులు తమ ప్రాధాన్యతలను తెలియజేయాలని సూచించింది. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్‌ను https:// psc. ap. gov.in లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. అభ్యర్థులు ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు ఇవ్వాలని సూచించింది. ఆప్షన్ల నమోదులో విఫలమయ్యే అభ్యర్థులకు.. అందుబాటులో ఉన్న వివరాలను అనుసరించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

రాష్ట్రానికి 4 సీబీఐపీ అవార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెన్నా డెల్టా ఆధునికీకరణలో భాగంగా నెల్లూరు, సంగం బ్యారేజ్‌ల ద్వారా 4.22 లక్షల ఎకరాలకు సమర్థంగా నీరు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) అవార్డు దక్కింది. దీంతోపాటు మరో మూడు విభాగాల్లోను ఏపీ ప్రభుత్వం సీబీఐపీ అవార్డులు గెల్చుకుంది. నీటి పునర్వినియోగ ప్రాజెక్టులో భాగంగా సమర్థమైన పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణతో పాటు సమర్థమైన–ఉత్తమ తాగునీటి సరఫరా విభాగాల్లో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ 2 అవార్డులు సొంతం చేసుకుంది. నీటివనరుల రంగంలో ఏపీకి సేవలందిస్తున్న ఉత్తమ కన్సల్టెన్సీ ప్రాజెక్టుల్లో కేపీఎంజీ అస్యూరెన్స్, కన్సల్టింగ్ సర్వీసెస్‌కు అవార్డు దక్కింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర విద్యుత్, సంప్రదాయేతర ఇంధనవనరుల శాఖ మంత్రి ఆర్కే సింగ్ రాష్ట్ర అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. దేశంలో నీటివనరులు, విద్యుత్, సంప్రదాయేతర ఇంధన వనరుల విభాగంలో సీబీఐపీ అత్యుత్తమ ప్రాజెక్టులకు అవార్డులు అందిస్తోంది. 2022 ఏడాదికిగాను మన రాష్ట్రం ఆరు విభాగాల్లో దరఖాస్తు చేయగా నాలుగు విభాగాలకు అవార్డులు రావడం విశేషం.



అవార్డు అందుకుంటున్న జీవీఎంసీ అధికారి

సచివాలయాల ద్వారా ముస్లిం వివాహ ధ్రువీకరణ పత్రాలు

సాక్షి, అమరావతి : ముస్లిం వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్లను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రభుత్వం జారీ చేయనుంది. ఇప్పటిదాకా వక్ఫ్ బోర్డుల ఆధ్వర్యంలో మాన్యువల్‌గా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక నుంచి గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. అలా అందిన దరఖాస్తు వివరాలను సచివాలయాల సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేసి.. వక్ఫ్ బోర్డుకు పంపుతారు. ఆ తర్వాత వక్ఫ్ బోర్డు సాధారణ పరిశీలన, ఆమోదం తర్వాత సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 4 । మార్చి । 2023

నేడు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం అమ్మవారికి ఖడ్గ మాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, పంచహారతుల సేవలు నిర్వహిస్తారు.





వెండి తాపడానికి విరాళం

పెనుగంచిప్రోలు: అంకమ్మ ఉపాలయ గోపురం వెండి తాపడం తయారీకి విజయవాడకు చెందిన న్యూరాలజిస్ట్ కొల్లి క్రాంతి కిషోర్, శైలజ దంపతులు రూ.లక్ష విరాళం ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు.



కమనీయం.. గజాననీయం

కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య వేదికపై శుక్రవారం హరికథా గానం, భక్తి రంజని, కూచిపూడి నృత్య ప్రదర్శనలు కొనసాగాయి. గజాననీయం నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ▸8లో

న్యూస్‌రీల్

వైభవంగా శత చండీ సహిత మహా రుద్రయాగం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై గల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శత చండీ సహిత మహా రుద్రయాగం రెండో రోజు శుక్రవారం వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న యాగాలను ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షించగా, ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు పాల్గొన్నారు. మహా గణపతి హోమం, మహా గణపతి పూజ, సూర్య నమస్కారాలు, నిత్య హోమాలు, మహా రుద్ర హవనం, చండీహోమం, మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 38 మంది రుత్వికులు హోమ, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహా రుద్రయాగాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు.

రేపు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరం మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎస్వీఆర్ పంక్షన్ హాల్లో ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి కృష్ణా జిల్లా ఫెన్సింగ్ స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగం సతీష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ అఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు ఈ సెలక్షన్స్‌కు అర్హులుగా పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీకి 13 ఏళ్ల నిండిన క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సెలక్షన్స్‌కు హాజరు కావాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9553528888, 9490798909 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లాలో 97.83 శాతం పింఛన్ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో మూడు రోజుల్లో వైఎస్సార్ పింఛను కానుక 97.83 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో మొత్తం 2,29,358 మందికి గాను 2,24385 మందికి పంపిణీ పూర్తయింది. అత్యధికంగా జి కొండూరు మండలంలో 98.75 శాతం, మైలవరం 98.19 శాతం, కొండపల్లి అర్బన్ 98.17 శాతం పంపిణీ చేశారు.

నేటి నుంచి మహిళా ఉత్సవ్‌-2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు శనివారం నుంచి ఈ నెల 12 తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్లో మహిళా ఉత్సవ్‌-2023 నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణకు హాజరైన మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నాబార్డు ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, వాసవ్య మహిళా మండలి కార్యదర్శి జి.రష్మి ఉత్సవ్‌ను ప్రారంభిస్తారన్నారు.

యార్డులో 98,597 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 90,137 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 98,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 పలికింది. తాలు రకం రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది.

పరిశ్రమలకు ప్రోత్సాహం

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటు
- పారిశ్రామికవేత్తలకు చేయూతనందిస్తున్న ప్రభుత్వం
- పరిశ్రమలకు అన్ని రకాల రాయితీలు
- యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు



మల్లవల్లి ఏపీఐఐసీ మెగా ఫుడ్ పార్కులోని శివతార ఆగ్రో ఫ్యాక్టరీ

సాక్షి ప్రతినిధి, విజయవాడ:ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం చేయూత నందిస్తోంది. చిన్న, మధ్య, భారీ పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సింగిల్ విండో విధానం ద్వారా వెంటనే అనుమతులు మంజూరు చేస్తున్నారు. పరిశ్రమల యజమానులకు అన్ని రకాల రాయితీలు అందిస్తున్నారు. దీంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. కృష్ణా జిల్లాలో ప్రధానంగా పంచదార, యంత్ర పరిశ్రమలు, పశువుల దాణా, రొయ్యలమేత, స్టీలు, పవర్ జనరేషన్, సిఐ కాస్టింగ్స్, ఆల్కహాల్, పామాయిల్, కాటన్ యార్న్, ఫుడ్, పాల ఉత్పత్తులు వంటి భారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఎడిబుల్ ఆయిల్, పీవీసీ పైపులు, రెడీమెడ్ గార్మెంట్స్ తయారీ, ప్లాస్టిక్ ఉత్పత్తులు, కలంకారీ పరిశ్రమలు, స్టీలు, గృహోపకరణ ఉత్పత్తులు, స్టోరేజ్ ట్యాంకులు, ఏసీ కండెక్టర్, తవుడు నుంచి నూనెలు, ఫ్లై యాష్ ఇటుకలు, ఐస్ ప్లాంట్లు, ఇమిటేషన్ జ్యూయలరీ, ఇంజినీరింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీలు, ఆక్వా ఉత్పత్తులు, రైస్ మిల్లులు వంటి చిన్నతరహా పరిశ్రమలు స్థాపించారు. వీటి ద్వారా 17,518 మందికి ఉపాధి కలుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఫార్మాస్యూటికల్స్, సిమెంట్, యంత్ర పరిశ్రమలు, వ్యాగన్ రిపేరింగ్, పశువుల దాణా, సిమెంట్ షీట్స్, స్టీల్ స్ట్రక్చర్లు, పవర్ జనరేషన్, ఆల్కహాల్, కాటన్‌యార్న్, పాల ఉత్పత్తులు, జనరల్ ఇంజినీరింగ్ వర్క్స్‌వంటి భారీ, మెగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. స్టీలు ఉత్పత్తులు, గృహోపకర ఉత్పత్తులు, అల్యూమినియం, ఉత్పత్తులు, స్టోరేజీ ట్యాంకులు, సిలిండర్ లైనర్స్, ఏసీ కండక్టర్లు, సిరామిక్, శానిటరీ, ఫ్లై యాష్ ఇటుకలు, పీవీపీ పైపులు, రెడీమేడ్ దుస్తులు, ఫ్యాబ్రికేషన్ పరిశ్రమలు, కోల్డ్‌స్టోరేజీ వంటి చిన్న తరహా పరిశ్రమలు స్థాపించారు. వీటి ఏర్పాటు ద్వారా 25,389 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

కృష్ణా జిల్లాలో అనుమతులు మంజూరు చేసిన పరిశ్రమలు :	268
పెట్టుబడులు :	రూ.3823.48 కోట్లు
ఎన్టీఆర్ జిల్లాలో అనుమతులు ఇచ్చిన పరిశ్రమలు :	184
పెట్టుబడులు :	రూ.1397.98 కోట్లు

కృష్ణా జిల్లాలో....

జిల్లాలో ఏప్రియల్ 2022 నుంచి డిసెంబరు 2022 వరకు పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చారు. మొత్తం 283 పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకోగా, 268 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారు. ఈ పరిశ్రమలను రూ.3823.48 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా 6875 మందికి ఉపాధి కలగనుంది. వీటితో పాటు 2595 చిన్న పరిశ్రమలను రూ.124 కోట్లతో స్థాపించారు. దీని ద్వారా 7708 మందికి ఉపాధి లభిస్తోంది. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పథకం కింద 66 పరిశ్రమలు ఏర్పాటుకాగా, వీటి ద్వారా రూ.1.88 కోట్ల మార్జిన్ మనీ విడుదల చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో....

జిల్లాలో ఏప్రియల్ 2022 నుంచి డిసెంబరు 2022 వరకు పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానంలో పలు పరిశ్రమలకు అనుమతి ఇచ్చారు. మొత్తం 196 పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకోగా 184 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారు. రూ.1397.98 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా 5237 మందికి ఉపాధి కలగనుంది. వీటితో పాటు 2025 చిన్న పరిశ్రమలను రూ.241.45 కోట్లతో స్థాపించారు. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ పథకం కింద పరిశ్రమలు ఏర్పాటుకాగా, వీటి ద్వారా రూ.1.77 కోట్ల మార్జిన్ మనీ విడుదల చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు విద్యుత్తు, వడ్డీ రాయితీ పెట్టుబడి, అమ్మకపు పన్ను రాయితీలు ఇస్తున్నారు. జిల్లాలో అనుమతి ఇచ్చిన పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

భారీగా పరిశ్రమల స్థాపనకు కృషి



జిల్లాలో భారీగా పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాం. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. చిన్న, మధ్య తరహా పరిశ్రమల యూనిట్లు స్థాపించేందుకు వీలుగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నాం. పారిశ్రామిక వేత్తలకు అన్ని రకాల రాయితీలు ఇస్తున్నాం.

–రంజిత్‌బాషా, కృష్ణా జిల్లా కలెక్టర్

సింగిల్ విండో ద్వారా అనుమతులు



జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అన్ని రకాల రాయితీలు కల్పిస్తూ కొత్త పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాల ప్రభుత్వం సహకరిస్తోంది. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరిత గతిన అన్ని రకాల అనుమతులు ఇస్తున్నాం. జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాం.

–ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

జిల్లాలో భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాధారణ, జాతీయ రహదారులకు భూ సేకరణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎన్టీఆర్ జిల్లా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న సాధారణ రహదారులు, జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ పనులపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి రెవెన్యూ, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నందిగామ, కంచికచర్ల మండలం కంచికచర్ల, పరిటాల భూ సేకరణ ఒక వారంలో పూర్తిచేయాలన్నారు. జగ్గయ్యపేట మండలం జయంతి పురం గ్రామంలో ఇన్‌లాండ్ వాటర్ వేస్ టెర్మినల్ ప్రాజెక్ట్‌కు సంబంధించి భూ యజమానులకు నష్టపరిహారాన్ని అందజేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. గుణదల రైల్వే డబ్లింగ్‌కు సంబంధించి భూ సేకరణలో మార్కెట్ విలువల ప్రతిపాదనలు వెంటనే పంపాలని విజయవాడ నార్త్ తహసీల్దార్‌ను ఆదేశించారు. గొల్లపూడి ఆర్వోఆర్ ప్రాజెక్ట్ భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలపై నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో తిరువూరు ఆర్డీవో ప్రసన్న లక్ష్మి, నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, ల్యాండ్ సర్వే ఏడి కె. సూర్యారావు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నయవంచన..

- ఏటీఎం క్యాష్ విత్‌డ్రా, డిపాజిట్ మిషన్ల వద్ద కాపు కాస్తున్న కేటుగాళ్లు
- అమాయకులను నమ్మించి ఖాతాల్లోని డబ్బు స్వాహా
- తాజాగా విజయవాడలో వెలుగు చూసిన ఘటన
- 2019లోనూ ఇదే తరహాలో మోసాలు
- పాత నేరస్తులపై పోలీసుల నిఘా



విజయవాడ స్పోర్ట్స్: 'విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో నివాసం ఉండే ఓ చిరు వ్యాపారి గత నెల ఐదో తేదీన తన బ్యాంకు ఖాతాలో రూ. లక్ష డిపాజిట్ చేసుకునేందుకు సమీపంలోని ఏటీఎం వద్దకు వెళ్లాడు. డిపాజిట్ యంత్రం అంత డబ్బు ఒకే సారి తీసుకోకపోవడమనేది సహజంగానే జరుగుతుంది. ఈ నేపథ్యంలో నగదు డిపాజిట్ చేసుకునేందుకు కాస్త సమయం పడుతోంది. వ్యాపారి నగదు డిపాజిట్ చేసేందుకు పదేపదే ప్రయత్నిస్తున్న ఘటనను అక్కడే ఉన్న ఓ వ్యక్తి గమనించి మాట కలిపాడు. తన ఖాతాలో నగదు ఉన్నాయని, అయితే కార్డు లేక పోవడంతో నగదు విత్‌డ్రా చేసుకోలేక పోతున్నానని వ్యాపారికి ఆ వ్యక్తి చెప్పాడు. వెంటనే నగదు తీసుకుని ఆసుపత్రికి వెళ్లాలని, లేదంటే తన కుటుంబ సభ్యులకు ప్రాణాపాయం ఉందని చెప్పాడు. మీ దగ్గరున్న రూ.లక్ష ఇచ్చేస్తే నా బ్యాంకు ఖాతాలోని నగదును మీ బ్యాంకు ఖాతాకు వెంటనే బదిలీ చేస్తానని నమ్మించాడు. ఆ మాటలను నమ్మి చిరు వ్యాపారి తన వద్దనున్న నగదును ఆ అజ్ఞాత వ్యక్తి చేతిలో పెట్టాడు. రెండు నిమిషాల్లో వ్యాపారి ఫోన్‌కు నగదు డిపాజిట్ జరిగినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకు ఖాతాను చెక్ చేసుకున్నాడు. మెసేజ్ వచ్చింది.. కానీ ఖాతాలో నగదు డిపాజిట్ కాలేదని ఆ వ్యక్తికి వ్యాపారి చెప్పాడు. మెసేజ్ వచ్చింది కదా.. అకౌంట్‌లో డబ్బులు నెమ్మదిగా పడతాయని, నా మీద నమ్మకం లేకపోతే నా ఫోన్ నెంబర్ తీసుకోండి, నా ఐడీ తీసుకోండి, నా ఆధార్ తీసుకోండని చెప్పి అవన్నీ వ్యాపారి చేతిలో పెట్టి ఆ వ్యక్తి అక్కడ నుంచి జారుకున్నాడు. అకౌంట్‌లో డబ్బులు జమ కాకపోవడంతో మరుసటి రోజు ఫోన్‌లో ఆ అజ్ఞాత వ్యక్తిని వ్యాపారి సంప్రదించాడు. మాయ మాటలతో దాదాపు 25 రోజుల పాటు అజ్ఞాత వ్యక్తి నెట్టుకొచ్చాడు. సడెన్‌గా అజ్ఞాత వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో మోసపోయానని తెలుసుకొని కృష్ణలంక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు'.

అమాయకులే టార్గెట్

ఏటీఎంలో నగదు తీసుకునేందుకు, బ్యాంకు ఖాతాల్లోని నగదు డిపాజిట్ చేసుకునేందుకు వచ్చిన అమాయకులే ఈ ముఠా టార్గెట్. ఏటీఎంల పరిసరాల్లోనే నిత్యం సంచరిస్తూ డబ్బులు తీసుకోవడం రాని వారిని ముందుగా వీరు గుర్తిస్తారు. అదే సమయంలో మోసగాళ్లు సైతం డబ్బులు తీసుకునేందుకు వచ్చినట్లు ఏటీఎంలోకి చొరబడతారు. ఆ సమయంలో కాస్త డబ్బులు తీసి ఇవ్వండి .. తీసుకోవడమేలాగో నాకు తెలీదంటూ వచ్చిన వ్యక్తి డబ్బును ఆ వ్యక్తికి తెలీకుండానే కాజేస్తున్నారు. ఏటీఎం పిన్ తెలుసుకుని అవసరమైతే కార్డు మార్చి ఇచ్చి ఆ వ్యక్తి వెళ్లి పోయిన తరువాత మిగిలిన డబ్బును కాజేస్తుంటారని పోలీసులు చెబుతున్నారు. క్యాష్ డిపాజిట్ మిషన్ల వద్ద ఇదే తరహాలో మోసాలు జరుగుతున్నాయి. నా అకౌంట్‌లో ఉన్న క్యాష్‌ను.. మీ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేస్తానని నమ్మించి ముందుగా నగదు తీసుకుంటున్నారు. ఆ తరువాత బాధితుడి ఫోన్ నెంబర్ తెలుసుకుని ఆ నెంబర్‌కు డబ్బులు డిపాజిట్ అయినట్లు (బ్యాంకు నుంచి మెసేజ్ వచ్చినట్లే) మోసగాళ్లే మెసేజ్ పంపుతారు. ఫోన్‌కు మెసేజ్ రావడంతో కొందరు బాధితులు డబ్బులు అకౌంట్‌లో జమయ్యాయని నమ్మి వెళ్లిపోతున్నారు. బాధితులను నమ్మించేందుకు మోసగాళ్లు వారి ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డు, నకిలీ ఐడీలను ఇస్తున్నారు. కొన్నాళ్ల పాటు మాత్రమే ఆ ఫోన్ నెంబర్లు పని చేస్తాయని పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు చెబుతున్నారు.

మోసగాళ్లపై పోలీసుల నిఘా

మూడేళ్ల క్రితం ఇదే తరహా ఘటనలతో నగరం అట్టుడుకింది. మోసగాళ్లు ఏటీఎం కేంద్రాల వద్ద కాపు కాసి అమాయకులకు ఇదే తరహాలో వల వేసిన ఘటనలు 2019లో అత్యధికంగా వెలుగు చూశాయి. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సత్యనారాయణపురం స్టేషన్‌లో ఈ ఘటనలపై అప్పట్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయని పోలీసులు చెబుతున్నారు. తాజాగా ఇదే తరహా మోసాలు వెలుగు చూడటంతో పోలీసులు పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచారు. ఏటీఎం కేంద్రాల వద్ద తరుచూ సంచరించే వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- ఈ నెల ఐదు నుంచి ఆరురోజుల పాటు నిర్వహణ
- మార్చి 7న స్వామి తిరుకల్యాణ మహోత్సవం
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వస్తారని అంచనా



నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానం



ఆలయంలో వేణుగోపాలస్వామి

నెమలి(గంపలగూడెం):ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి 66వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుగా ఉన్న అనురాధ ఏటి ఒడ్డున విరాజిల్లుతున్న వేణుగోపాల స్వామికి ఏటా ఆరురోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు చేస్తారు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ్ వర ప్రసాదరావు శుక్రవారం విలేకర్లకు వివరించారు. 5వ తేదీన సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను పరాశరం వెంకటరమణాచార్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందం ప్రారంభిస్తారు. స్వామికి విశేష అభిషేకం, పెళ్లి కుమారుని చేయుట, నూతన వస్త్రాల సమర్పణ ఉంటుంది. 6వ తేదీ నవ కుంభారోహణ, బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7వ తేదీ రాత్రి 10 గంటలకు వేణుగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్ష మందికి పైగా భక్తులు వివిధ జిల్లాల నుంచి విచ్చేస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీ నూతన వధూవరులైన దేవతామూర్తుల రథోత్సవం ఉంటుంది. 9 న ఉదయం స్వామికి చూర్ణోత్సవం, వసంతోత్సవం చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు పల్లకి ఉత్సవం, రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం నిర్వహిస్తారు. 10వతేదీన ఉదయం 6 గంటలకు స్వామికి, అమ్మవార్లకు పంచామృతాలు నవఫల రసాలతో అభిషేకం పుష్పయాగం చేస్తారు. రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు (12 సేవలు) పర్యంకాసనోత్సవం (పవళింపు సేవ)తో బ్రహ్మోత్సవ ప్రత్యేక కార్యక్రమాలు ముగుస్తాయి. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవ పీటలపై కూర్చొనదలిచిన దంపతులు ముందుగా రూ. 3,116 చెల్లించాలి.

ఇబ్బందులు లేకుండా చూడాలి : డీసీపీ

బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీసీపీ మేరి ప్రశాంతి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, భక్తులకు సౌకర్యాల ఏర్పాటుపై ఆమె శుక్రవారం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. చేపట్టాల్సిన చర్యల గురించి తిరువూరు సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ వి. సతీష్‌కు వివరించారు. రద్దీ ప్రాంతాల్లో తోపులాట జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు



మహిళలకు కోళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో జగనన్న చేదోడు పథకం ద్వారా మహిళలకు శుక్రవారం నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా వైఎస్సార్ క్రాంతి పథం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ, శ్రీనిధి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా ఆర్థిక పరిపుష్టి చెందాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. జిల్లాలో వెయ్యి స్వయం సహాయక సంఘాల మహిళలకు నాటుకోళ్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక్కో యూనిట్‌కు పది కోళ్లను అందిస్తున్నామన్నారు. ఇందులో రూ.1200 ఖర్చుతో నెల రోజులకు సరిపడా కోళ్ల మేతను, రూ. 852 తో కోళ్లకు వ్యాక్సినేషన్ వేయించి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. రూ. 44 లక్షల వ్యయంతో జిల్లాలో 1000 సంఘాల సభ్యులకు కోళ్లను అందిస్తున్నామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలకు కోళ్లను వారి గ్రామం వద్దే అందజేసేలా రవాణా సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఏ కారణం చేతనైనా వారం రోజులలోపు సరఫరా చేసిన కోడి మరణిస్తే, ఆ స్థానంలో మరొక కోడిని ఉచితంగా అందజేయాలని అధికారులను ఆదేశించామని స్పష్టం చేశారు. కోళ్ల సంతాన ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చన్నారు. త్వరలో జిల్లాలో సుమారు 2000 గొర్రె పొట్టేళ్లను పంపిణీ చేసే ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, ఏపీఎం జి. చంద్రశేఖర్ , కమ్యూనిటీ కోఆర్డినేటర్స్ బి. అమ్మాయమ్మ, ఎం. రామారావు, ఎం. కాంతిశ్రీ, మండల సమైక్య అధ్యక్షురాలు పి. లియోనా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే సీఎం జగన్ ధైర్యం

ఎమ్మెల్యే కొడాలి నాని



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యం అంతా ప్రజలేనని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) అన్నారు. మండలంలోని వేమవరంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ కొండలమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార అభినందన సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అమరావతిని రూ.2 లక్షల కోట్లతో నిర్మించి ఒక వర్గానికే కొమ్ము కాయాలని చూస్తున్నారని చెప్పారు. జగన్ మాత్రం పేదల కోసమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ ఎన్నుకున్న వైజాగ్ అనేది మహా నగరమని తెలిపారు. ప్రపంచంలో పెట్టుబడులు పెట్టేవారికి ఉన్న సౌకర్యాలను చూపించి పరిశ్రమల స్థాపనకు ఆహ్వానిస్తున్నారన్నారు. పరిశ్రమలకు అవసరమైన ఎయిర్ పోర్ట్, షిప్పింగ్ హార్బర్ వంటి సదుపాయాలను పారిశ్రామిక వేత్తలకు చూపుతున్నారని తెలిపారు. టీడీపీ వలె ఏదో ఒక వర్గానికి కొమ్ము కాయకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి జగన్ కృషి చేస్తున్నారన్నారు. రాజకీయంగా ఈ రాష్ట్ర భవిష్యత్తును డిసైడ్ చేసేది ప్రజలేనని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే 151కు తగ్గకుండా 175 వరకూ జగన్‌కు సీట్లు రానున్నాయని తెలిపారు. జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తే 175లో 18 సీట్లలోనే టఫ్‌గా పోటీ ఉంటుందన్నారు. మిగిలిన సీట్లు అన్నీ వన్‌సైడ్‌గా వైఎస్సార్ సీపీకే దక్కనున్నాయన్నారు. మాటలు కాదు... చేతల్లో చూసి చూపిస్తూ ప్రజలను నమ్ముకున్న ముఖ్యమంత్రి జగన్ అన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ నేత రాము, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి తదితరులు పాల్గొన్నారు.

పుట్టగుంటలో కారు బీభత్సం

వృద్ధుడి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలంలో సుబ్బారెడ్డి మృతదేహం

గుడివాడటౌన్(నందివాడ): ఓ కారు రోడ్డుపై బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన బల్లపై కూర్చున్న వృద్ధుడిని ఢీకొట్టి ప్రాణం తీసింది. అదే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని తీవ్రంగా గాయపరిచింది. ఈ ప్రమాదం నందివాడ మండలం పుట్టగుంట గ్రామంలో శుక్రవారం జరిగింది. నందివాడ పోలీసుల కథనం మేరకు.. హనుమాన్ జంక్షన్‌కు చెందిన పామర్తి నాగసత్యసీతారామబాబు కారులో గుడివాడ వచ్చి స్వగ్రామానికి బయలుదేరాడు. అతివేగంగా ప్రయాణిస్తున్న కారు మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన సిమెంట్ బల్లపై కూర్చున్న పామిరెడ్డి సుబ్బారెడ్డి(70)ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ కారు అదే ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మడా శ్యామ్ కుమార్‌ను కూడా ఢీకొట్టింది. దీంతో అతను కూడా తీవ్రంగా గాయపడ్డాడు. శ్యామ్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. సుబ్బారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడు నాగ సత్య సీతారామ బాబును అదుపులోకి తీసుకున్నారు.

9న ఎడ్ల పోటీలు

గంపలగూడెం(తిరువూరు): మండలంలోని నెమలి గ్రామంలో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సినియర్స్, పదో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు నుంచి జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో వరుసగా తొలి ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున, సీనియర్స్ విభాగంలో రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి గలవారు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

రెండు రాష్ట్రాల స్థాయి పొట్టేళ్ల పోటీలు

మండలంలోని నెమలి గ్రామంలో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పొట్టేళ్ల పోటీలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ రోజు ఉదయం పది గంటల నుంచి పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన పొట్టేళ్లకు రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పందెం

ఈ నెల ఎనిమిదో తేదీ మధ్యాహ్నం రెండుగంటల నుంచి హైస్కూల్ ఆవరణలో ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. మూడు పోటీలకు సంబంధించి మరిన్ని వివరాలకు కూరాకుల వెంకటకృష్ణను 63054 39771 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

15 మందికి గ్రహణంమొర్రి శస్త్ర చికిత్సలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మిషన్ స్మైల్, ముత్తూట్ ఫౌండేషన్ సహకారంతో మూడు రోజులపాటు జరిగే గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సల శిబిరంలో తొలిరోజు 15 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేశారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఆపరేషన్లు జరిగాయి. ప్రభుత్వాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎ.ఆర్.సీహెచ్.మోహన్ ఆధ్వర్యంలో ఎనస్థీషియా వైద్యులు ఈ శిబిరంలో సేవలు అందిస్తున్నారు. గ్రహణంమొర్రి, అంగిలి చీలిక వంటి సమస్యలకు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు శస్త్ర చికిత్సలు జరగనున్నాయి. మరో 40 మందికిపైగా ఆపరేషన్లు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న పిల్లల వద్ద ఉన్న సహాయకులకు కూడా ఆస్పత్రిలోనే ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. ఇంటి నుంచి వచ్చేందుకు, శస్త్ర చికిత్స తర్వాత వెళ్లేందుకు మిషన్ స్మైల్ సంస్థ రవాణా చార్జీలు చెల్లిస్తోంది. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ ఈ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నారు.

కమనీయం.. గజాననీయం



గజాననీయంలోని ఓ సన్నివేశం

మొవ్వ(పామర్రు): శ్రీ గంగ, బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య వేదిక పై ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం హరికథా గానం, భక్తి రంజని, కూచిపూడి నృత్య ప్రదర్శనలు కొనసాగాయి. ప్రాధానంగా ప్రదర్శించిన గజాననీయం నృత్యరూపకం ఆద్యంతం కమనీయంగా సాగింది. తొలుత యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.శ్రావణి, నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, డాక్టర్ పసుమర్తి రామలింగ శాస్త్రి, కావూరి భానుమూర్తి, జ్యోస్యుల మోహన రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. బుర్రా పద్మనాభశర్మ భాగవతార్ సుందరాకాండ హరికథాగానం చేశారు. సోమయాజుల శ్రీరామచంద్రశర్మ భక్తి రంజని ద్వారా ప్రేక్షకుల్లో భక్తి పారవశ్యం నింపారు. అనంతరం వరంగల్‌కు చెందిన నాట్యాచారిణి కుప్పా పద్మజ, తరిగొప్పుల శ్రీధర్, ఎస్.జీవిత తమ నృత్యప్రదర్శనలతో అలరించారు. నందిగామకు చెందిన జాహ్నవి బ్రహ్మోంజలి అంశం పై నాట్యం చేసి కరతాళధ్వనులు అందుకుంది. శ్రీరాధేశ్యామ్ కుచిపూడి కళాక్షేత్రం నిర్వాహకుడు శ్రీ దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి బృంద సభ్యులు అలేఖ్య, వర్షిత, రాఘవైష్ణవి, లాస్యమణికర్ణిక, అఖిల, సహస్ర, సమన్వి, శర్వాణి, తేజస్వీ, ప్రేక్ష్య, శివాని, సాయిరోహిత, భాస్కరుని దశావతారాలు, సరస్వతీ స్తుతి, నారాయణీయం, ఉషా ప్రవేశ దరువులకు చక్కని హావ భావాలతో నృత్య ప్రదర్శన చేశారు. విశాఖపట్నానికి చెందిన శ్రీభారతీ కళాసదన్ నాట్యాచారిణి భారతి కుమార్తె మహీధర శ్రీరవళి మనోహర్ 'ఎందరో మహానుభావులు', కామాక్షి స్తుతులకు నవరస భరితంగా నృత్యం చేశారు. చివరిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ గ్రహీత నాట్యాచార్య పసుమర్తి రామలింగశాస్త్రి శిష్యబృందం ప్రదర్శించిన గజాననీయం నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివుడిగా సుబ్బరాజు, పార్వతిగా శ్వేత, విష్ణుమూర్తి సౌజన్య శ్రీనివాస్, లక్ష్మీదేవిగా యామిని రెడ్డి, గజాసురుడిగా భరత్, విష్ణువుగా ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, నారదునిగా రిషిత చక్కని అభినయం, భావ వ్యక్తీకరణతో కథా వృత్తాంతాన్ని కళ్లకు కట్టికట్లు ప్రదర్శించారు. నాట్యాచార్యులను, కళాకారులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

భక్తుల కల్పవల్లి అద్దంకి నాంచారమ్మ

- రేపటి నుంచి అమ్మవారి ప్రధాన జాతర
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం



అద్దంకి నాంచారమ్మ అమ్మవారు



అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయం

కోడూరు: కృష్ణా తీరంలో భక్తుల కల్పవల్లిగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారు ప్రధాన జాతరోత్సవాలకు ఆలయం సుందరంగా ముస్తాబైయింది. ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగే జాతరకు రాష్ట్ర నలుమూల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో దేవదాయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

15 రోజుల పాటు చిన్నఅమ్మవారి ఊరేగింపు..

జాతరకు 15 రోజుల ముందు (పాల్గుణ శుద్ధ పాఢ్యమి) రోజున నాంచారమ్మ చిన్నఅమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసి ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయం నిర్మించిన గ్రామపెద్ద రామినీడుకు కూడా ప్రత్యేక ఉత్సవాన్ని జరుపుతారు. విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, గాబ, కుమ్మరిపాలెం గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి భక్తులు పూజలు చేస్తారు. వాహనాలు లేకుండా ప్రజలు నడుచుకుంటునే అమ్మవారిని ఊరేగించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన చిన్న అమ్మవారి ఊరేగింపును ప్రారంభించగా, ప్రస్తుతం వి.కొత్తపాలెం గ్రామంలో పూజలు నిర్వహిస్తున్నారు.

గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులకు ఇలవేల్పు..

నాంచారమ్మ అమ్మవారు అద్దంకి గ్రామం నుంచి రావడంతో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలు అమ్మవారి పుట్టింటివారుగా భక్తులు భావిస్తారు. దీంతో అమ్మవారి జాతరకు ఈ రెండు జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ప్రత్యేక వాహనాల్లో జాతరకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. జాతరకు రెండు లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా. భక్తుల సౌకర్యం కోసం మచిలీపట్నం, రేపల్లె, అవనిగడ్డ నుంచి 'విశ్వనాథపల్లి స్పెషల్' పేరుతో 15 ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా ఏర్పాటు చేశారు. 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఐదో తేదీన నాంచారమ్మ మూలమూర్తికి ప్రత్యేక అలంకారం, ఆరో తేదీన నైవేద్యాల సమర్పణ, ఏడో తేదీన ఆలయ ప్రధాన గుడి జాతరను నిర్వహించనున్నారు.

హుండీ ఆదాయం రూ.2.80 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని దేవదాయ అధికారులు శుక్రవారం లెక్కించారు. 93 రోజులకు గాను హుండీ ద్వారా రూ.20,80,773 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, చైర్మన్ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు, సభ్యులు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

ఆలయ ప్రాశస్త్యం...

నాంచారమ్మ తల్లి ఆలయ నిర్మాణం వెనుక పెద్ద చరిత్రే ఉందని గ్రామ పెద్దలు చెబుతారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథపల్లి గ్రామంలో సుమారు ఐదు శతాబ్దాల కితం కరువు కాటకాలు వచ్చాయి. పశువులకు కనీసం పశుగ్రాసం కూడా దొరకని పరిస్థితుల్లో ఈ ప్రాంత రైతులు తమ పశువులను నాటి ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామానికి (ప్రస్తుతం బాపట్ల జిల్లా) వలస వెళ్లారు. అక్కడ పశువులు కొంత కాలం బాగానే ఉన్నా, తరువాత అంతుచిక్కని వ్యాధితో మృతిచెందాయి. దీంతో రైతులు తిరిగి మళ్లీ తమ పశువులను విశ్వనాథపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. ఆ సమయంలో పశువులతో పాటు ఓ బాలిక విశ్వనాథపల్లికి వచ్చి, ఇక్కడ అంతర్ధానమైంది. గ్రామానికి చెందిన ఒక మహిళకు పూనకం వచ్చి తాను అద్దంకి నాంచారమ్మనని, తనకు గ్రామంలో ఆలయం నిర్మాణం చేపట్టాలని కోరింది. దీంతో గ్రామపెద్ద రామినీడు గ్రామ నడిబొడ్డు అమ్మవారికి చిన్నపాటి ఆలయాన్ని నిర్మించి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. కరువు కాటకాలు తొలగి గ్రామస్తులు ఆర్థికంగా వృద్ధి చెందగా, అప్పటి నుంచి ఏటా పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఇక్కడ అమ్మవారి ప్రధాన జాతర నిర్వహించడం ఆనవాయితీ.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం



నాంచారమ్మ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు సకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. క్యూలైన్లలో భక్తులకు దాహార్తి తీర్చేందుకు వసతులు కల్పించడంతో పాటు అన్నసమారాధన కూడా నిర్వహిస్తున్నాం. అన్ని శాఖల సమన్వయంతో జాతరను విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించాం.


– పామర్తి సీతారామయ్య, ఆలయ ఈఓ

క్రైం కార్నర్

పార్శిల్ వచ్చిందంటూ రూ 3.10 లక్షలు స్వాహా

పెనమలూరు: మండలంలోని పోరంకిలో ఓ మహిళకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి పార్శిల్ వచ్చిందని మాయమాటలు చెప్పి ఆమె వద్ద రూ.3.10 లక్షలు స్వాహా చేశారు. ఈ ఘటనపై బాధితురాలు ఎం.సుధారాణి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. ఫిబ్రవరి రెండో తేదీన గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సుధారాణికి ఫోన్ వచ్చింది. ఆమె బుక్ చేసిన వస్తువుల పార్శల్ వచ్చిందని, సొమ్ము చెల్లించాలని ఫోన్ చేసినవారు కోరారు. తాను ఎటువంటి వస్తువులనూ బుక్ చేయలేదని సుధారాణి చెప్పి ఫోన్‌కట్ చేశారు. ఆ తరువాత పలుమార్లు ఫోన్ వచ్చినా ఆమె స్పందించలేదు. అదే నెల ఆరో తేదీన మళ్లీ ఫోన్ చేసి, వస్తువులు బుక్ చేసి, వచ్చిన పార్శల్ తీసుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆగంతకులు సుధారాణిని బెదిరించారు. ఆమె భయపడి పలు దఫాలుగా రూ.3.10 లక్షలు ఆన్‌లైన్‌లో ఢిల్లీలోని బ్యాంకుకు సొమ్ము బదిలీ చేశారు. ఆగంతకులు మళ్లీ ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు వర్గాల మధ్య కొట్లాట



రోడ్డుపై కొట్లాటకు దిగిన యువకులు



శ్రీనివాసరెడ్డి వంటిపై గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘర్షణతో స్థానికులు ఆందోళన చెందారు. ఈ ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. వాగు సెంటర్‌కు చెందిన రాపర్తి దుర్గేష్ గురువారం రాత్రి ఈద్గామహల్ రోడ్డులో నడిచి వెళ్తుండగా అతని భుజం రోడ్డుపై నిలబడి ఉన్న గాలిబ్‌కు తగిలింది. దీంతో దుర్గేష్ చెంపపై గాలిబ్ కొట్టాడు. అనంతరం దుర్గేష్ వాటర్ ట్యాంక్ రోడ్డు వద్దకు వెళ్లి తన స్నేహితులు గోపి, వంశీ, సంతోష్‌కు విషయం చెప్పి వారిని తీసుకుని గాలిబ్ వద్దకు వచ్చి అతనితో ఘర్షణపడ్డారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత సమయం తరువాత సంతోష్ ఒంటరిగా కనిపించడంతో గాలిబ్, అతని స్నేహితులు గన్నీ, హరి అతనిపై దాడి చేసి కొట్టారు. దీంతో ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గురువారం రాత్రి స్టేషన్‌కు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు రావాలని రెండు వర్గాలకు పోలీసులు చెప్పి పంపంచారు.

మరోసారి దాడి

ఈద్గా మహాల్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం హరి ఉండగా, సంతోష్, అతని స్నేహితుడు అఖిల్ మరో తొమ్మిది మంది యువకులు అతడితో కొట్లాటకు దిగారు. హరి తన జేబులో ఉన్న పదునైన వస్తువు తీసి అఖిల్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో హరిని వారించేందుకు అతని స్నేహితుడు శ్రీనివాసరెడ్డి ప్రయత్నించాడు. ఈ క్రమంలో శ్రీనివాసరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాసరెడ్డి, అఖిల్ తీవ్రంగా గాయపడి పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా, వారిని పోలీసులు అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తలరించారు. కొట్లాటలో పాల్గొన్న పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ గొడవలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ సభ్యులు ఎవరూ లేరని వెస్ట్ ఏసీపీ హనుమంత రావు తెలిపారు. శుక్రవారం రాత్రి కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. హరి, సంతోష్ వర్గాల మధ్య జరిగిన గొడవ కారణంగానే శ్రీనివాసరెడ్డికి గాయాలయ్యాయని తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

లైంగిక దాడికి పాల్పడిన బాలుడిపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బాలుడిపై సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సత్యనారాయణపురం లక్ష్మీనగర్‌కు చెందిన బాలిక ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. 2022 ఆగస్టు 11వ తేదీన ఆమె కిరాణాషాపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చింది. తన స్నేహితుడైన 17 ఏళ్ల బాలుడితో కలసి విజయవాడ రైల్వే స్టేషన్ చేరుకుని అక్కడ నుంచి పుణే వెళ్లింది. అక్కడ సీసాలు శుభ్రపరిచే పరిశ్రమలో పనిలోకి చేరిన వారిద్దరికీ సంస్థ యజమాని వేర్వేరుగా వసతి ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బాలికను ప్రేమిస్తున్నానంటూ ఆమెపై బాలుడు పలుమార్లు లైంగిక దాడిచేశాడు. ఈ క్రమంలో బాలిక గర్భవతైంది. ఈ విషయాన్ని ఆమె అతనికి చెప్పింది. దీంతో ఫిబ్రవరి 28వ తేదీన ఆ బాలుడు బాలికతో హైదరాబాద్ వచ్చి, ఆమెను అక్కడ వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో బాలిక తన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. బాలుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్య కారణంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట కోమల విలాస్ ప్రాంతానికి చెందిన వాంద్రాసి గోపాలకృష్ణ పాణి(52)కి వివాహం కాలేదు. సోదరి, సోదరితోపాటు సొంత ఇంటిలో ఓ పోర్షన్‌లో నివసిస్తున్నాడు. అతనికి 2015లో పక్షవాతం వచ్చింది. గోపాలకృష్ణ పాణికి అతని సోదరి రజని భోజనం వండి ఇస్తోంది. గురువారం రాత్రి రజని ఇచ్చిన భోజనాన్ని తీసుకుని గోపాలకృష్ణ పాణి తన పోర్షన్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం గోపాలకృష్ణ పాణి పోర్షన్ నుంచి బయటకు రాకపోవడంతో అతని సోదరుడు గంగాధరరావుకు అనుమానం వచ్చి చూడగా లోపల గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధికార లాంఛనాలతో బచ్చుల అర్జునుడి అంత్యక్రియలు

మచిలీపట్నంటౌన్: ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అంతిమయాత్ర, అంత్య క్రియలను శుక్రవారం మచిలీపట్నంలో శుక్రవారం నిర్వహించారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అంత్యక్రియలకు ముందు పోలీసులు అధికార లాంఛనాలతో గన్ ఫైర్ చేసి నివాళులర్పించారు. అర్జునుడి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని తదితరులు ఉన్నారు.



బచ్చుల భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని



బచ్చుల అంత్యక్రియలకు హాజరైన చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు



మచిలీపట్నం ప్రధాన రహదారిలో బచ్చుల అంతిమయాత్ర

క్లుప్తంగా

అర్హులకు సంక్షేమ ఫలాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుల, మత, ప్రాంతాలు, పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వీఎంసీ ఫ్లోర్‌లీడర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ అన్నారు. రాణిగారితోటలోని సిమెంట్ గోడౌన్స్‌లో శుక్రవారం 17, 18 డివిజన్లలో నివసిస్తున్న రాజస్తాన్, యూపీ రాష్ట్రాలకు చెందిన ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు, రైస్ కార్డు ఉంటే అర్హతను బట్టి సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. ఆధార్ ఉన్నవారు సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను సంప్రదించి రైస్ కార్డు, ఇతర పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీఓ ఉమామహేశ్వరీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): వక్ఫ్ బోర్డులో వివిధ పదవుల్లో నియమితులైన వారు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. వక్ఫ్ బోర్డు ఎన్టీఆర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన తూర్పు నియోజకవర్గానికి చెందిన సుభాని, డైరెక్టర్లుగా నియమితులైన 19వ డివిజన్‌కు చెందిన అబిద్, 2వ డివిజన్‌కు చెందిన మోయిన్ శుక్రవారం రాణిగారితోటలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అవినాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దోమలను లార్వా దశలోనే నివారించడానికి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సుహాసిని పేర్కొన్నారు. డ్రైడే–ఫ్రైడే పురస్కరించుకుని సర్కిల్–1 పరిధిలోని పలు డివిజన్లలో డీఎంహెచ్‌ఓ సుహాసిని, బయోలజిస్టు సూర్యకుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు పర్యటించారు. కొండ ప్రాంతాల్లో దోమల నివారణకు చేపడుతున్న చర్యలపై డీఎంహెచ్‌ఓ సుహాసిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతాల్లో నీటిని ఎక్కువగా నిల్వ చేసి ఉంచే ప్లాస్టిక్ డ్రమ్ములు, నీటి తొట్టెలను వారంలో ఒక రోజు శుభ్రం చేసుకుని ఆరబెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పలు ప్రాంతాల్లో నీటిని పరిశీలించి దోమల లార్వా లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికులను మలేరియా సిబ్బంది వారంలో ఎన్ని రోజులు వస్తున్నారు... నీటి తొట్టెలను తనిఖీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో కొత్తపేట ఎస్‌యుఓ రోషి బాబు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

పెనమలూరు: మండలంలోని కానూరులో వేంచేసి ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం ఐదో వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా ముగిశాయి. మాజీ సర్పంచ్ అన్నే సుజాత, అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి దంపతుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. వార్షికోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. శుక్రవారం గ్రామోత్సవం, పవళింపుసేవ, అన్నసమారాధన చేశారు.

సింగ్‌నగర్‌లో విషాదఛాయలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చోడవరం వద్ద కృష్ణానదిలో స్నానానికి వెళ్లిన సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లో నివసిస్తున్న జారా బిర్యాని పాయింట్ ప్రొప్రయిటర్ అబ్దుల్ రహీమ్ బాషా(34) మృత్యువాత పడడంతో సింగ్‌నగర్‌లో శుక్రవారం విషాదఛాయలు అలముకున్నాయి. అతని మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎప్పుడు నవ్వుతో, ఆప్యాయంగా పలకరించే రహీమ్‌బాషా మృత్యువాత పడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. రహీమ్ బాషా పన్నెండేళ్ల క్రితం సమీరా అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. సంతోషంగా సాగుతున్న వారి కుటుంబంలో రహీమ్‌బాషా మృతి తీరని శోకం కలిగిస్తోంది.

తండ్రి కోసం ఎదురుచూపులు

మొగల్రాజపురం పుష్పాహోటల్ సెంటర్ వద్ద నివసిస్తున్న తాళ్లూరి కిరణ్ హోటల్‌లో పని చేస్తుంటాడు. ఇతనికి భార్య, కొడుకు ఉన్నారు. కిరణ్ చోడవరం వద్ద కృష్ణానదిలో గల్లంతయ్యాడని తెలియడంతో అతని తల్లిదండ్రులు, భార్యా, పిల్లలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చోడవరం వద్దకు వెళ్లి కిరణ్ ఆచూకీ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

కర్మల భవన్ ఆధునికీకరణ

- రూ.8 లక్షలతో పనులు
- మరమ్మతులతో పాటు వంటగది నిర్మాణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): అమెరికన్ ఆస్పత్రి సమీపంలో కర్మల భవన్ ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీఎంసీ నుంచి రూ.8 లక్షల నిధులు మంజూరవడంతో పనులు ప్రారంభమయ్యాయి. కృష్ణలంక 20వ డివిజన్‌లో వీఎంసీ ఆధ్వర్యాన అమెరికన్ ఆస్పత్రి వంతెన సమీపంలో బందరు కాల్వ గట్టున జాతీయ రహదారి వెంట 2008లో లక్షలాది రూపాయల వ్యయ అంచనాతో కర్మల భవనాన్ని నిర్మించారు. అప్పటి, ప్రస్తుత కార్పొరేటర్ అడపా శేషు హయాంలో కాల్వ గట్టున కర్మల భవనం నిర్మించారు. నామ మాత్ర ఫీజు తీసుకుని సేవలందిస్తున్నారు. అన్ని సౌకర్యాలు ఉండటంతో డివిజన్ వాసులతో పాటు కృష్ణలంక ప్రాంతంలోని అనేక మంది ఇక్కడ కర్మకాండలు నిర్వహించేవారు.

నిధుల మంజూరు

కాలక్రమేణా ఇది మరమ్మతులకు గురైంది. పర్యవేక్షణ కొరవడటంతో కొన్ని నెలలుగా ఇది నిరుపయోగంగా మారింది. కర్మల భవన్ అందుబాటులో లేక పేద, మధ్యతరగతి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన స్థానిక కార్పొరేటర్ అడపా శేషు భవనం ఆధునీకరణకు కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టి నిధులు మంజూరు చేయించారు. రూ.8 లక్షల నిధులు మంజూరు కావడంతో వారం నుంచి పనులు జరుగుతున్నాయి. భవనం మరమ్మతులు, అదనంగా వంటగది నిర్మాణం, వాటర్ పైప్‌లైన్, భవనం చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. 15 రోజుల్లో పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.





ఆధునీకరణ పనులు జరుగుతున్న కర్మల భవనం (ఇన్‌సెట్) వంటగది షెడ్డు నిర్మాణం

అందుబాటులోకి తీసుకొస్తాం



కృష్ణలంకలో అద్దె కుటుంబాలు ఎక్కువగా నివసిస్తుంటాయి. కర్మల భవన్ అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం డివిజన్ అభివృద్ధిలో భాగంగా రూ.8 లక్షలతో భవనం మరమ్మతులు, వంటషెడ్డు నిర్మాణం చేపట్టాం. మరో రూ.8 లక్షలతో కర్మకాండలు చేసుకునేందుకు మరో షెడ్డు నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తాం. పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– అడపా శేషు, కార్పొరేటర్, 20వ డివిజన్

లేపాక్షి థీమాటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని బాపు మ్యూజియంలో ఏర్పాటు చేసిన లేపాక్షి థీమటిక్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌కు వెళ్లి ఉత్పత్తులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రాచీన హస్త కళలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దమన్నారు.

లేపాక్షి మేనేజర్ సురేష్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ఈ నెల 12వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని సెలవు దినాల్లో కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, హెచ్‌పీఓఎం సువర్చల, హస్తకళల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ రమాదేవి, జనరల్ మేనేజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చీరలు చూస్తున్న జేసీ

యువజనోత్సవాల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సిద్ధార్థ అకాడమీ, కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బెంగళూరులోని జైన్ డీమ్డ్ యూనివర్సిటీలో గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన 36వ అంతర్ విశ్వవిద్యాలయాల జాతీయ యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పలు విభాగాల్లో బహుమతులు పొందారని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం సాయంత్రం కళాశాల ఆవరణలోని మైదానంలో ఉన్న వేదికపై అభినందించారు.

సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచిత విద్యను అందజేస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సీ.జంపాల, సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ఎల్‌కే.మోహనరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్‌తో పాటుగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ ఇంధన వనరుల పొదుపు నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరగాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వరంగల్) ఆచార్యులు డాక్టర్ వినయ్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'కంట్రోల్ ఆఫ్ ఎలక్ట్రిక్ మోటార్ డ్రైవ్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్స్' అంశంపై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. డాక్టర్ వినయ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ, ఆధునీకరణ నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. సంప్రదాయ ఇంధన వనరుల కొరత, వాటి వినియోగంతో పెరిగే కాలుష్యంతో సమాజానికి తీవ్రమైన ప్రమాదాలు కలుగుతున్నాయని చెప్పారు. ఆ క్రమంలో సంప్రదాయేతర ఇంధన వనరులను పెంపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యుత్ వాహనాలను రోడ్డు రవాణా వ్యవస్థలతో పాటు అంతరిక్ష నౌక వ్యవస్థలోనూ వినియోగిస్తున్నారని వివరించారు. ఈ రంగంలో అపూర్వ ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. వాటిపై పట్టు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగంపై అనేక అద్భుత ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాలుష్య నివారణకు బీఎస్6 ఇంజిన్ వాహనాల వినియోగాన్ని తప్పనిసరి చేసిందన్నారు. విద్యుత్ వాహనాల వినియోగంపై మరిన్ని ప్రయోగాలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రబాబు నిర్వహించగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు నిజాయతీ

రోడ్డుపై పడిపోయిన మొబైల్ అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డుపై పడిపోయిన మొబైల్ ఫోన్‌ను తిరిగి దాని యజమానికి అప్పగించిన హోంగార్డ్ నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు ప్రకారం సతీష్ అనే వ్యక్తి గొల్లపూడి సారాయి కొట్టు సెంటర్‌లో షామియానా షాపు నిర్వాహకుడు. ఈ క్రమంలో అతను శుక్రవారం పనులపై భవానీపురం వెళ్లి తిరిగి తన షాపునకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. గొల్లపూడి మైలురాయి సెంటర్ (వై జంక్షన్) మీదుగా వెళ్తుండగా ప్యాంట్ జేబులోని మొబైల్ ఫోన్ జారి అక్కడ పడిపోయింది. అది గమనించకుండా షాపు దగ్గరకు వెళ్లి పోయిన అతను ఫోన్ కోసం చూశాడు. కనపడక పోయేసరికి కంగారు పడుతూ వెదుకులాట ప్రారంభించాడు. వై జంక్షన్‌లో పడిపోయిన ఫోన్‌ను అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ రాజశేఖర్ చూశారు. దానిని తీసుకుని ఫోన్ పౌచ్‌లో ఉన్న సతీష్ విజిటింగ్ కార్డ్‌లో నెంబర్ చూసి ఫోన్ చేసి సమాచారం అందించారు. అతను హడావుడిగా వై జంక్షన్‌కు రాగా రాజశేఖర్ ఫోన్ అప్పగించారు. ఫోన్ దొరికినందుకు సంబరపడిపోతూ ఆయనకు థ్యాంక్స్ చెప్పి వెళ్లాడు. ట్రాఫిక్ సీఐ రామచంద్రరావు హోంగార్డ్ రాజశేఖర్ నిజాయతీని మెచ్చుకుని అభినందించారు.



సతీష్‌కు ఫోన్ అందజేస్తున్న హోంగార్డ్ రాజశేఖర్

అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నగరానికి చెందిన ఎస్.రిషిత బృందంలోని రిషిత, భావన, భార్గవి, ధన్య, అద్విత, అమృత, జశ్విత, అరిశులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం చేయించారు.



ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు

కలెక్టర్ ఢిల్లీరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన మనస్సుతో, ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు విద్యార్థులకు సూచించారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సబ్జెక్టుల్లో వారిని ప్రశ్నలు అడిగారు. గణితంలోని ట్రిగ్నోమీటర్ డయాగ్రాంను బోర్డుపై వేసి దానిపై విద్యార్థులను జవాబులు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. పదో తరగతి జీవితంలో మంచి టర్నింగ్ పాయింట్ అన్నారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని, విద్యార్థులకు ఇచ్చిన మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఢిల్లీరావు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ఆవరణలో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు అందిస్తున్న ఐరన్ ట్యాబ్లెట్లను విద్యార్థినులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నాడు–నేడు పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లు,టాయిలెట్‌లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, రక్షిత మంచినీటి వసతి, విద్యుత్‌సౌకర్యం, గ్రీన్ చాక్ బోర్డు, ఇంగ్లిష్ ల్యాబ్‌లు కల్పించడానికి కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. నార్త్‌జోన్ తహసీల్దార్ చందన దుర్గాప్రసాద్, ఆర్ఐ అనిల్, వీఆర్‌ఓలు మోహన్, కమల్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

22 నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన వసంత నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకం సుభిక్షంగా ఉండటానికి భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందడానికి తొలిసారి అమ్మవారు స్వీకరిస్తారన్నారు. లోక కల్యాణార్థం తొమ్మిది రోజుల పాటు విశేషం అర్చనలు చేస్తారన్నారు.

పేద కుటుంబాలకు జగనన్న అండ

గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కరోనా కష్టకాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి తమ లాంటి పేద కుటుంబాలకు అండగా నిలిచారని 18వ డివిజన్ ఆంటోనీ వీధికి చెందిన వేల్పుల కుమారి హర్షం వ్యక్తం చేశారు. వివిధ పథకాలతో తన కుటుబానికి రూ.7.38 లక్షల ఆర్థిక సాయం లభించిందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం రాణిగారితోట 83, 84 వార్డు సచివాలయాల పరిధిలోని ఆంటోనీ వీధిలో జరిగింది. వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక కార్పొరేటర్, వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి 400 గడపలను సందర్శించారు.

పలువురు స్థానికులు దోమల బెడద ఎక్కువగా ఉందని, డ్రైనేజీ, రోడ్డు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వారి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లబ్ధిదారు బొద్దు గోవిందమ్మ మాట్లాడుతూ తన కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా రూ.1.45 లక్షల ఆర్థిక సాయం పొందామన్నారు. కలగట్ల కాసింబీ మాట్లాడుతూ వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేశారు.



రాణిగాతోట ఆంథోనీ స్ట్రీట్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో మాట్లాడుతున్న అవినాష్, కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ సత్యనారాయణ

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో మున్సిపల్ కమిషనర్ పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంస్కరణలు, రాయితీలతో రాష్ట్రానికి పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయని అవినాష్ అన్నారు. ప్రపంచంలోని దిగ్గజ వ్యాపార సంస్థలు మన రాష్ట్రం వైపే చూస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి ఉత్తుత్తి ఒప్పందాలు, ఆర్భాట ప్రచారాలు లేకుండా నేరుగా దిగ్గజ సంస్థలే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సముచిత స్థానం



ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను కలిసిన దుర్గ గుడి పాలకమండలి చైర్మన్ రాంబాబు, సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ సముచిత స్థానం లభిస్తోందని ఎమ్మెల్సీ రుహుల్లా తెలిపారు. దుర్గగుడి నూతన పాలకవర్గం చైర్మన్, సభ్యులు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను సింగ్‌నగర్ డాబాకొట్లుసెంటర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు కట్టా సత్తయ్య, బుద్దా రాంబాబు, చింతా సింహాచలానికి ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని గుర్తించి దుర్గగుడి పాలకమండలి సభ్యులుగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న నన్ను ఎమ్మెల్సీ స్థానంలో కూర్చోబెట్టారంటేనే జగనన్న మనస్సు ఏంటో అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, ఓసూరి బాలరమేష్, అమిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సిద్ధంకావాలి

పెనమలూరు: విద్యార్థులు చక్కటి ప్రణాళికలతో పబ్లిక్ పరీక్షలకు సిద్ధంకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ తాహేరా సుల్తానా మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ప్రతిభ చూపి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి సబ్జెక్టుపైనా పట్టుసాధించాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలతో చక్కటి మెలకువలతో పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. బాగా అర్థం చేసుకుని చదవాలని, పరీక్షల్లో ఒత్తిడికి గురవకుండా రాయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ప్రణాళికలు రూపొందించి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారి ఎం.కనకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని వై.దుర్గాభవాని పాల్గొన్నారు.

స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేటి మహిళకు పూర్తిగా స్వేచ్ఛ ఉందని భావిస్తున్నానని, దాన్ని సద్వినియోగం చేసుకోవల్సిన బాధ్యత వారిపైనే ఉందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించి ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సిప్ అబాకస్ వన్‌టౌన్/భవానీపురం బ్రాంచిల ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు.

ముఖ్యఅతిథి మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటేనే వారికిష్టమైన రంగంలో రాణించగలరన్నారు. తానూ భర్త, అత్తమామల ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. మరో అతిథి డాక్టర్ కె.లత ఆరోగ్యపరంగా మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సిప్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ మధుసూదనరావు మాట్లాడుతూ మహిళలు సమాజానికి వెన్నెముకలని, వారిని గౌరవిస్తే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని చెప్పారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు మహరాణులుగా అభివర్ణించారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి మాట్లాడుతూ మహిళల విజయానికి వారి నిబద్ధతే కారణమని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేయర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ లతను సత్కరించి జ్ఞాపికలు ఇచ్చారు. అనంతరం మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

16వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): వీఎంసీలోని 16 డివిజన్‌లో శుక్రవారం 96.66 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు పరిపాలన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం 1086 పింఛన్లకు ఇప్పటి వరకు 1053 మందికి పంపిణీ చేశారు. కళానగర్‌కు చెందిన వికలాంగుడు రావి లారేష్‌కు వెల్ఫేర్ కార్యదర్శి వైడీవీ సుబ్బారావు పింఛన్‌ను ఇచ్చారు.



వికలాంగుడు రావి లారేష్‌కు పింఛన్ ఇస్తున్న వెల్ఫేర్ కార్యదర్శి సుబ్బారావు

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీగురుసింగ్ సభ గురుద్వార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గురునానక్‌కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కన్వల్‌జిత్‌సింగ్, హరమోహిందర్‌సింగ్, జేజే సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువు వ్యాధులకు పరీక్షలు చేయనున్నారు.



● కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం



● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం.

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి

కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. 'పెళ్లి ప్రేమను చంపేస్తుంది' అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, చొరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన

> **'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.**

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



● మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి. ● ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్రపోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి. ● మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి. ● మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి. ● హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెషనర్

● అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.

● దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!

● సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.

“ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

ఎనిమిదిళ్లు మారాను!



మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.

– గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి